ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



వెల
4 అణాలు

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

15-2-50

విషయానుక్రమణిక

15 ఫిబ్రవరి 1950

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0 విడిప్రతి 4 అణాలు	ప్రతిబుధవారము ప్రకటింపబడును. ఒరులేయవియొనరించిన నరవర యప్రియము తనమనంబున కగు దా నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథముల కెల్లన్. (మహాభారతము) **Founder : K. NAGESWARA RAO.**	సంపుటము **42** సంచిక **24**


విరోధి సంవత్సర మాఘ బహుళ చతుర్దశి బుధవారము



నీరెండ

గతసంవత్సరం ఢిల్లీలో జరిగిన చిత్రలేఖన ప్రదర్శనంలో ప్రదర్శించబడింది.

చిత్రకారులు:—సయ్యద్ అహ్మద్ గారు.



ఆంధ్రపత్రిక

1950-వ సం॥ ఫిబ్రవరినెల 15-వ తేది బుధవారము

ఆంధ్రరాష్ట్ర సంపాదన

ఆంధ్రరాష్ట్ర నిర్మాణము తిరిగి సభలు, సమావేశములు, తీర్మానములు, ఉపన్యాసములలో పడినది. ఈకార్యక్రమముద్వారా రాష్ట్రము రాదని గత మూడున్నర దశాబ్దముల చరిత్ర స్పష్టము చేసినది. అయినను నేడు ఆంధ్రులకు మార్గాంతరము లేదు. నిర్ణయముల యెడ అసంతృప్తిని, అసమ్మతిని ప్రకటించుటకంటె చేయ కలిగినది లేదు. ఇట్టి చర్యలందు మనకు గల అనుభవము అపారము. ఇట్టి కార్యక్రమనిర్వహణలో మనకు గల ప్రతిభావిశేషములు అసమానము; నిరుపమానము. కార్యసాధన, కార్యదక్షతలో గల కొరత వీటి వలన భర్తీయగుచున్నది.

సత్తెనపల్లిలో ఈ నెలారంభములో జరిగిన అఖిలాంధ్రప్రజాపరిషత్తుతీర్మానములు, ఆ మహాసభయందు నాయకులు చేసిన ప్రసంగములు ఈ విషయములను ఎట్టి అనుమానములకు ఆస్కారము లేకుండ ఋజువు చేసినవి. వరంగల్‌లో సమావేశమయిన విశాలాంధ్రమహాసభ ఈవిషయమును ధ్రువపరుచుచున్నది. కాని ఇందువలన రాష్ట్రనిర్మాణము సుకరము గాదు. ప్రత్యేకాంధ్రరాష్ట్రము, విశాలాంధ్రము సమీపస్థము గాదు. ఈ సత్యమును మనము గ్రహించుట అవసరము.

రాష్ట్రకాంగ్రెస్‌సంఘము నవంబరు 11 వ తేదీ తీర్మానముద్వారా నాయకత్రయనివేదికకు తన సమ్మతిని తెలిపెను. ఒక్క చెన్నపట్టణమువిషయమున తన అభిప్రాయమును ప్రకటించి, ఆ ప్రకారమే కేంద్రప్రభుత్వము ఆ సమస్యను పరిష్కారము చేయవలెనని కోరెను. ఈ ఒక్క సమస్యను వదలివేసిన, రాష్ట్రకాంగ్రెసుసంఘము తద్వారా ఆంధ్రప్రజానీకము నాయకత్రయసిద్ధాంతములను పూర్తిగ "అసందిగ్ధముగ" ఆమోదించెను. "ఆంధ్రరాష్ట్రనిర్మాణసందర్భమున ఉత్పన్నమగు వివిధసమస్యలపై అందుకు సంబంధించిన పక్షములమధ్య సంపూర్ణాంగీకారము కుదురుట అవసరము" అని నాయకత్రయనివేదిక తెలిపెనని కేంద్రప్రభుత్వము చెన్నరాష్ట్రప్రభుత్వమునకు వ్రాసిన తాజాలేఖయందు పేర్కొనెను. ఆంధ్రులు ఈ సిద్ధాంతమును, ఈ షరతును అంగీకరింపలేదని నవంబరు 11 తీర్మానఅనంతరము ఎవ్వరు చెప్పజాలరు. ఈ షరతులను అంగీకరించి, అందుకు లోబడి రాష్ట్రమును కోరినపుడు, వాటి సాఫల్యమునకే రాష్ట్రమును మనఃస్ఫూర్తిగ వాంఛించు ప్రతిఆంధ్రుడు కృషి చేయవలసి యుండెను. అట్టి ప్రయత్నము జరుగలేదనుట నిర్వివాదము.


సర్వపక్షసమ్మతమగు ప్రతిపాదనలను సాధింపవలెనను కేంద్రప్రభుత్వసూచనను అంగీకరించినపుడు, సమాధానము కుదరలేదని తిరిగి కేంద్రప్రభుత్వమునకు విజ్ఞాపనలు చేయుటలో ప్రయోజనము ఏమియు ఉండదు. విభజనసంఘమునందే సమాధానమును సాధింపవలసియుండెను. కాని విభజనసంఘమునందలి ఆంధ్రసభ్యులు భిన్నలక్ష్యములతో పరస్పర విరుద్ధ అపేక్షలతో పనిచేయుటవలన అట్టిది సాధ్యము గాలేదు. కేంద్రప్రభుత్వసూచనను అనుసరించి మద్రాసుప్రభుత్వము తిరిగి ప్రయత్నించినను విభజనసంఘసభ్యుల లక్ష్యములు, అపేక్షలు భిన్నముగ, పరస్పరవిరుద్ధముగ నున్నంతవరకు ఇట్టి "సర్వపక్షసమ్మతమైన ప్రతిపాదనలు" సాధ్యము గావు.

ఆంధ్రులు తమిళులతో మాత్రమేగాక, ముందు తమలో తామొక సమాధానమునకు రావలసియున్నారు. నేడు మనరాష్ట్రరాజకీయములను పరిశీలించిన నూత్నరాజ్యాంగమును అనుసరించి ఎన్నికలు జరిగి, నూత్నఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్‌సంఘ మేర్పడి,

ఆంధ్రరాజకీయనాయకత్వము ఏ ఒకపక్షమునకో సంపూర్ణముగ సంక్రమించువరకు నామమాత్రపు "ఆంధ్రైక్యత" అయినను సాధ్యముగాదని స్పష్టమగుచున్నది. ఆ నాయకత్వసంపాదనకు జరిగిన ప్రయత్నముల ఫలితమే ఆంధ్రరాష్ట్రము నిరవధికముగ వాయిదాపడుట.

శ్రీ ప్రకాశంపంతులుగారు శ్రీకాకుళము సభలో ఉపన్యసించుచు ఆంధ్రులందరు ఒకత్రాటిపై నడువ నారంభించిన వారమురోజులలో ఆంధ్ర రాష్ట్రము రాగలదని "ఆశ" పెట్టిరి. ప్రకాశంపంతులుగారు "ఒక్క త్రాటిపై నడక" ప్రతిపాదనను చేసి మూడుసంవత్సరములైనది. అందుకు వారు ప్రయత్నమారంభించికూడ దాదాపు అంతకాలమైనది. కాని ఇప్పటికి ఆ నడక సిద్ధింపవలసిన ఆశయముగనే యున్నట్లు శ్రీ ప్రకాశంపంతులుగారు శ్రీకాకుళము సభలో చేసిన ప్రసంగమే స్పష్టముచేయుచున్నది. రాష్ట్రసంపాదనవిషయమున ఆంధ్రనాయకులందరు "ఒక్క త్రాటిపై నడుచు" చున్నారను భావము ప్రకాశంపంతులుగారు భిన్నాభిప్రాయమును ప్రకటించువరకు సర్వత్రా వ్యాపించెను. కాని జనవరి 4, 5 తేదీలలో రాష్ట్ర కాంగ్రెస్‌సంఘము, కార్యవర్గము చేసిన తీర్మానములవలన ఆంధ్రనాయకులు ఒకరి తరువాత ఒకరు గాక, ఒకరి కెదురుగ మరొకరు నడచుచుండిరని వ్యక్తమయ్యెను.

రాష్ట్రసంపాదనవిషయముననే ఏకాభిప్రాయమునకు రాలేకపోయిన ఆంధ్రనాయకుల మధ్య ఐక్యత ఏర్పడుట అసంభవమనే తోచుచున్నది. "ఒక్క త్రాటిపై నడక" సాధ్యమైననే రాష్ట్రము లభించవలసియుండిన, ఆంధ్రులకు రాష్ట్రము ఎన్నటికి లభించునో చెప్పుట కష్టము. చివరకు ఆంధ్రరాష్ట్రము "తాడు, బొంగరము" లేని దైపోవుట తథ్యము.



మన రాష్ట్రం, మన దేశం:

★ మద్రాసు ప్రభుత్వ పరిపాలన గవర్నరుగారి సమీక్ష ★

★ ఆంధ్రదేశంలో సంచలనం ★

మద్రాసుశాసనసభ, లెజిస్లేటివ్ కౌన్సిల్ సంయుక్తసమావేశం శనివారం సాయంకాలం జరిగినప్పుడు నూతనకార్యక్రమ విధానాన్ననుసరించి గవర్నరుభావనగరమహారాజాగారు ప్రభుత్వకార్యకలాపాలను గురించి సందేశమిచ్చారు.

ఉదయం 176 మంది శాసనసభ్యులు, 44 మంది లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులూ నూతన ప్రమాణం స్వీకరించారు.

సాయంకాలం గవర్నరుగారు తమ ఉపన్యాసంలో మద్రాసుప్రభుత్వం ఇంతవరకూ నిర్వహించిన కార్యకలాపాల్నీ, ఇకముందు తలపెట్టిన కార్యక్రమాన్నీ సంగ్రహంగా తెలియపరిచారు.

దేశంలో ఆహారపరిస్థితిని సమీక్షచేస్తూ ఆంధ్రదేశంలో తుపానువల్లనూ, దక్షిణాదిని అనావృష్టివల్లనూ ఈ సంవత్సరం ధాన్యపు పంట చాలా తగ్గిందని చెప్పారు. దాదాపు పదిలక్షుల టన్నులు బియ్యం, 3 లక్షులటన్నులు జొన్నలు కొరవౌతాయి. ఈ కొరతను భర్తీ చెయ్యడానికి ఆహారానికి అధికంగా సప్లై చెయ్యాలని కేంద్రప్రభుత్వాన్ని మద్రాసు ప్రభుత్వం కోరింది. ఆహారోత్పత్తిని వృద్ధి పరచడానికిమద్రాసుప్రభుత్వం అయిదేళ్లలో పదికోట్లరూపాయలు ఖర్చుపెట్టి మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, చెరువులు మరమ్మతులు సాగించదలపెట్టింది.

రైతులికి చౌకగా విత్తనాలు, వ్యవసాయ పరికాలు, ఎరువులు సప్లైచెయ్యడానికి రెండేళ్లకు చాలిన ఖర్చు ప్రత్యేకింపబడింది.

భూమిశిస్తువిధానాన్ని సంస్కరించడానికిగాను ప్రభుత్వం ఒక విచారణ కమిటీని నియమించగలదని గవర్నరుగారు తెలిపారు. గవర్నరుగారి సందేశంలోకల్లా ఇదొక్కటే ముఖ్యవిషయం కనిపిస్తోంది. మిగతావిషయాలన్నీ ఇంతవరకూ నెరవేరని కార్యక్రమాల పాతపాటలే. జమీందారీరద్దుచట్టాన్ననుసరించి 1949 సెప్టెంబరు మొదలు ఇంతవరకు 6 పెద్దఎస్టేట్లనీ, 36 చిన్న ఎస్టేట్లనీ ప్రభుత్వం స్వాధీనంపరుచుకుందని చెప్పారు. అయితే పరిహారం చెల్లింపువిషయంలో ఏమీ చెయ్యదలిచారో ఒక్క మాటకూడా చెప్పలేదు. దానికి సంబంధించిన శాసనం ఒకటి ప్రవేశపెట్టబడనున్నట్లు అదివరలో ప్రకటించబడింద. ఆ విషయాన్నికూడా గవర్నరు ఎత్తలేదు.

వైద్యవిద్యావ్యాప్తి, వయోజనవిద్యా కార్యక్రమాలు, బేసిక్ విద్యాప్రచారం, గ్రామ్యఆర్థికాభివృద్ధికార్యక్రమాల్ని వృద్ధిపరచగలరని చెప్పారు. అయితే ఇంతవరకూ నడుస్తున్న తీరునే ఇవి ఇంకా నడిచేట్లయితే ఫలితం బొత్తిగా శూన్యమే అవుతుంది.

తరవాత ఇప్పుడు చర్చింపబడవలసిన ముఖ్యశాసనాలను వివరించారు. అవి పంచాయతీబిల్లు, ఇళ్ల అద్దెలకంట్రోల్ ఆక్టు, మతాదాయధర్మసంస్థల శాసనం వగైరా.

తుంగభద్ర, దిగువభవానీ మొదలైన ప్రాజెక్టులు చురుగ్గా సాగుతున్నాయని గవర్నరుగారు చెప్పారు. ఇప్పటిమాదిరిగానే అయితే దక్షిణాదిప్రాజెక్టులు ఒకటి రెండేళ్లలో అన్నీ పూర్తికాగలవనేది రూఢి. తుంగభద్రమాత్రం మనతరవాతతరం వారికోసమైనా పూర్తిఅవుతుందో కాదో చెప్పడం కష్టం.

అశాంతి:

దేశంలో కమ్యూనిస్టుముప్పునుగురించి కాని, కమ్యూనిస్టుపార్టీని నిషేధించిన తరవాత పరిస్థితిలో ఎలాంటి మార్పులు కలిగాయో ఆ వివరాలు కాని, దేశంలో పరిస్థితి శాంతపడిందో లేదో అదికాని గవర్నరుగారి ఉపన్యాసంలో మాటవరసకైనా రాలేదు. పోలీసుశాఖవారు దేశంలో శాంతిని చక్కగా కాపాడుతున్నారని మాత్రం చెప్పి వారిని ప్రశంసించారు.

అయితే ఇక్కడొక్క విషయాన్ని ప్రభుత్వం గుర్తించవలసిన అవసరం ఉంది. దేశంలో ముఖ్యంగా హైదరాబాద్ సరహద్దు సమీపప్రాంతాల్లోనూ, కృష్ణా ఉభయగోదావరిజిల్లాల్లోనూ పరిస్థితి ఇంకా చక్కబడలేదనీ, ఒక వంక కమ్యూనిస్టులదారుణాలకూ మరొకవంక పోలీసుల దౌర్జన్యాలకూ గురై ప్రజలు నలిగిపోతున్నట్లు వార్తలు విరివిగా వస్తున్నాయి. ఈవార్తలు సత్యాలా అసత్యాలా అని పరిశీలించి ప్రజల్లో భయమూ అసంతృప్తీ కలగకుండా జాగ్రత్త వహించాలనే యోచన ఇంతవరకూ మద్రాసుప్రభుత్వానికి కలగనట్లు కనిపిస్తుంది.

పుకార్లవల్ల ఎంత ప్రమాదం ఉందో ప్రభుత్వానికి తెలియకపోదు. 1930 ప్రాంతాల అమెరికాలో ఆర్థికమాంద్యం వచ్చి బాంకులు కూలిపోవడానికి వదంతులే కారణం. కొన్నిచోట్ల యుద్ధాలకు వదంతులు కారణమైనాయి. వదంతులవల్ల దేశం పరిస్థితులు అయోమయంలో పడిపోవడం యుద్ధకాలంలో మనకి అనుభవమే. ఇప్పుడు వస్తున్న వదంతులవల్ల దేశంలో ప్రభుత్వంపట్ల కాంగ్రెస్‌పట్ల ప్రజలకి విశ్వాసం, గౌరవం, ఆదరం భగ్నమైపోగల ప్రమాదంఉంది. సేలం జైళ్లలో నాలుగుగోడలమధ్య బంధింపబడిన

(39-వ పేజీ చూడుము)

అధికారోత్పత్తి

[శ్రీ దసు వామనరావు]

పాలను నీటిని విభాగంచేసే శక్తి హంసకు ఉన్నదని కవులు వర్ణించారు. ఈవిధంగా కావ్యాలలో వర్ణించడం పరిపాటి అయింది. దీనినే కవిసమయం అంటారు. ఇది కవుల చమత్కారవర్ణన కావచ్చు కాని, కాలక్రమేణ ఇది కవుల మూఢనమ్మకముకూడా అయింది. ఇంతకూ అసలులోపం ఎక్కడ ఉందంటే హంస అంటే ఏమిటో చూడకుండా, దాని స్వభావలక్షణాలు ఏమిటో పరిశీలించకుండా కండ్లుమూసికొని ఊహాగానం చేయడమే కవిత్వలక్షణమైంది. కవిత్వపటుత్వానికి యిటువంటి అతిశయోక్తులతో కూడిన ఊహాగానం అవసరం అని సిద్ధాంతీకరించారు. ఒకవిధంగా చూస్తే, చూడనివస్తువును చూచినట్లుగా వర్ణించి చెప్పడంలో కొంత ప్రజ్ఞ ఉంది. రంభ అంటే ఎట్లా ఉంటుందో మనలో ఎవ్వరూ చూచి ఉండకపోయినప్పటికీ మన పూర్వకవులు స్వయంగా దేవేంద్రలోకానికి వెళ్లి చూచివచ్చినట్లుగానే రంభామేనకాదులను వర్ణించారు. ఊహాప్రపంచంలో ఉన్న ఆనందం వ్యవహారప్రపంచంలో ఉండదు. వాళ్లు దేవతలతో ముఖాముఖి మాట్లాడినారంటే ఒక అతిశయోక్తి కాదు. "అటజని కాంచె భూమిసురు డంబరచుంబి శిరస్సపజ్ఝరీపటల ముహుర్ముహుర్లుఠదభంగతరంగమృదంగ" అని అల్లసాని పెద్దన్నగారు హిమాలయప్రాంతంలో కొండలమీద నుండి దొరలి క్రిందపడుతున్న నదీప్రవాహమును, ఆప్రాంతప్రకృతిసౌందర్యమును అత్యద్భుతంగా వర్ణించారు. ఆ పెద్దన్నగారు హిమాలయ ప్రాంతాలకు వెళ్ళి చూచి వ్రాసినారా? అనే ధర్మసందేహం మనకక్కరలేదు. ఆయన వెళ్లిచూడకపోయినా, వెళ్లిచూచినవారికంటె అనేకరెట్లు మనోహరంగా వర్ణించారు. ప్రత్యక్షంగా వెళ్ళి పరిశీలిస్తే అటువంటి దృశ్యం అక్కడ ఆ పర్వతసీమలో ఉంటే ఉండవచ్చు. పోతే లేకపోవచ్చు. కాని, అటువంటిమనోహరమైన ప్రాంత మొకటి రంగులతోహో చిత్రించడానికి వీలుగా కండ్లకుకట్టునట్లుగా కవిబ్రహ్మయే సృష్టికర్త యైనట్లుగా రసపుష్టితో శిల్పకల్పన చేశారు. మహాకవులచేత పలికించెడివాడు రామభద్రుడు కావచ్చు, లేదా వీరభద్రుడు కావచ్చు మొత్తముమీద ప్రత్యక్షప్రపంచమునకు అతీతమైన ఒక రసప్రపంచము ఉన్నదన్న, ఆ రససిద్ధిపొందిన పరమహంసలే వ్యాసవాల్మీకులవంటి మహాకవులనిన్నీ అంగీకరింపక తప్పదు. రసయుక్తమైనదే, నీరసమైనదేదో విభజించగల నేర్పు కవిరాజహంసలకే ఉండగలదు. అహంబ్రహ్మ యని ఆత్మసాక్షాత్కారం పొందిపరమహంస బ్రహ్మకు వాహనమా? బ్రహ్మసమానమా? కవిరాజహంసలే కవిబ్రహ్మ.

కే, యీ కాలపు కవిత్వంలో పటుత తక్కువ అని కొందరి అభిప్రాయం. అంటే ఏమిటి? వెనుకటి కవులు వ్రాసిత మహాగ్రంథములు కావ్యప్రబంధములుపురాణములు యీనాటి కవులు రచించలేరనిన్నీ, ఆనాటి కవుల పద్యములలోనున్న రసపుష్టి యీనాటి కవులలో లేదన్నీ విమర్శకుల అభిప్రాయం. ఆ మాటకు వస్తే, ఆ కవులకు ఉన్న కండపుష్టికూడా యీనాటి కవులకు లేదనవచ్చు. దేహంలో నీరసంగా ఉంటే భావంలో రస ఉంటుందా? ఆనాడు కండపుష్టి ఏవిగా ఉండేదో కావ్యపుష్టి కూడా ఆలాగే ఉండేది. "స్వర్గసుడయ్యో విస్సనమాటి మకిహేముపాత్రాన్న మెవ్వనిపంక్తి కల?" అని శ్రీనాథకవి విలపించాడు. బంగారపు గిన్నెలలో మంత్రులతో సమానంగా షడ్రసోపేతముగా ఆరగించిన శ్రీనాథుడు పుష్టియైన భోజనంచేసి రసపుష్టిగల కావ్యాలు రచించాడు. షడ్రసోపేతమైన భోజనం కరవైననాడు నవరసభరితమైన కావ్యం కూడ కరవై ఉభయత్ర రసక్షామం ఏర్పడగలదు. రసవర్గులో చేరిన ఉప్పు, మిరపకాయ, చింతపండు, చక్కెర విషయమే ఆలోచించి చూడండి. ఒకప్పుడు గాంధీమహాత్ముడు ఉప్పుసత్యాగ్రహం చేసినకారణంచేతనో భగవదనుగ్రహంవల్లనో ఉప్పుధరమాత్రం మనకు హెచ్చలేదు. కాని రజాకార్ల దురాగ్రహం హైదరాబాదుసంస్థానంలో ప్రజ్వరిల్లిన రోజులలో హైదరాబాదురాజ్యమందు ఉప్పుకూడా కరవైంది. ఆఖరుకు ఆ నైజాము ఉప్పు తిన్నవారే ఆయనకు ముప్పు తెచ్చిపెట్టారు. ఉప్పు విషయం ఎట్లాఉన్నా, చింతపండు మిరపకాయల ధరలు విపరీతంగా హెచ్చినవి. ఇక చక్కెరవిషయం చెప్పనవసరం లేదు. దానికోసం ఎవ రెంత ఎక్కువగా మక్కువపడినప్పటికీ లెక్కప్రకారమే చక్కెర చిక్కగలదని దేశమంతటా ఒక్కటే కంట్రోలు అమలుపరచి అధికారులే అమ్ముతున్నారు. చక్కెరవెల నిర్ణయించే అధికారి ఒకడు ఉంటాడు. అతడే చక్కెర వెలకాడు యీ ఆర్యావర్తానికి — అతడు చక్కెర విలుకాని కంటె చక్కనివాడగునో కాదో తెలియదు కాని ఈ చక్కెరదొర తన కంట్రోలుఅధికారము చలాయించినంతకాలము ఆ చక్కెరకొర కెక్కడ లేని వ్యామోహం లోకంలో వృద్ధియైనది. చాటుమాటు చీకటి తప్పులు చేయుట కదియొక ఉద్దీపన కారణమగుచున్నది.

వెలకంట్రోలు వెలసినకొలది వస్తువులకు వెలయాలివృత్తి ఏర్పడుతుంది. దానిమీద వ్యామోహం జనుల కెక్కువవుతుంది. చీకటిబజారు ఏర్పడుతుంది. అవసరం లేకపోయినా ఆ వస్తువుకోసం ఆశించడం అనే అజ్ఞానం ప్రబలమవుతుంది. సిగ్గును అభినయిస్తున్నట్లుగా కంట్రోలులో

ఉన్న వస్తువు కంటికి కనిపించినా చేతికి చిక్కదు. చిక్కని వస్తువుమీదనే ఎక్కువ లేని మోహం కలుగుతుంది. ఉదయం మొదలుకొని సాయంకాలంవరకూ ఎండ వక వానక క్యూలో నిలువబడి నానావ్య మానవులకు అలభ్యమైన గగనకుసుమమైన ఒక పావలాతరగతి సినిమాటిక్కట్టు సంపాదిస్తే చాలు. అదే మొగతనం అనుకుంటాడు. 'కొంగైన తగిలితే కోటిబంగారం' అన్నట్లుగా సంతోషిస్తాడు "ఖగనాగంబు దేవతేంద్రుల గెల్చి సుధముకొనైనగొన్న చందంబునకా" అన్నట్లుగా ఆ టిక్కట్టు సంపాదించి తెస్తే, దాని విలువ ఎంతో నలువకైనా తెలియదరమా! పావలాటిక్కట్టును గరికేసిబట్టి రూపాయకు అమ్మవచ్చు. ఇదంతా కంట్రోలు మహిమ. ఈ కంట్రోలు ఉంటేనే స్త్రీపురుషులకు తృష్ణ. ఈతృష్ణతోనే బజారునాటకం, వీధినాటకం, జగన్నాటకం అంతా సాగుతోంది. అందుకనే, మన్మథుడు దేవ్వుడూ తన కంట్రోలు డిపార్టుమెంటు ఎత్తివేయడానికి ఒప్పుకోడు. ఎవరికి దేనిని అనుసంధానం చేయవలెనో కనిపెట్టి చేకూర్చడమే నా పని అంటాడు. నలునిమీద దమయంతికి, దమయంతిమీద నలునకు అనురాగం కలుగచేయడమే మన్మథుని పనియైనట్లయితే, ఇంద్రాదిదేవతలందరికి ఆ దమయంతిమీద కోరికపుట్టినప్పుడు ఆ విధంగా వారికి వ్యామోహం కలుగకుండా మన్మథుడు కంట్రోలుచేయవలసింది. కాని చేయలేదు. కంట్రోలు అధికారం అంటే అంటే అది దారేషణ, ధనేషణ, పుత్రేషణ, సర్వేషు నాలక్రమైనా. ఎవడికి ఎంత సంతానం యివ్వవలెనో ఎవడికి ఎటువంటి సంతానం యివ్వవలెనో నాకు తెలుసునంటాడు. ఎవరు? సంతానకంట్రోలు ఆఫీసరు - చిట్టచివరకు జరిగేది ఏమిటంటే, సంతానం కావాలి అన్నవాడికి సంతానం యివ్వడంలేదు. సంతానం నాకెందుకు ముల్లో అన్నవానికి సంతానం యిస్తున్నాడు. లక్ష్మీకటాక్ష కంట్రోలుడిపార్టుమెంటుకూడా (అధికారి అదృష్టమైనప్పటికీ) అదికూడా అక్రమంగానే అగమ్యగోచరంగానే నడుస్తోంది. లక్షాధికారికే మరింత లక్ష్మీ, భిక్షాధికారికి కుక్షికూడా నిండుటలేదు. ఏమిటీ అన్యాయం అంటే, కంట్రోలు అధికారం ఉండటంవల్లనే ప్రపంచం యీమాత్రంగానైనా నడుస్తోందని లక్ష్మీ డిపార్టుమెంటు అధికార్లు అంటారు. ఆ డిపార్టుమెంటులో ఏమైనా లోటుంటే కొన్ని కమిటీలువెట్టి విచారించవచ్చు. మరి కొంతసిబ్బందిని శీఘ్రంగా నియమించవచ్చు.

దేశం సుభిక్షంగా ఉండాలంటే, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలి నిజమే. పాడిగాని పంటగాని వృద్ధికావడం ఎట్లా! ఆవుకు మేతపెట్టితే పాలిస్తుంది. రైతు బీద అయితే, పొలం బీద అవుతుంది. రైతుకు గిట్టుబడి అయ్యేధర రైతుకి లభిస్తే తాను కడుపునిండా తిని అధికాహారోత్పత్తి చేస్తాడు. రైతు అమ్మే ధాన్యాన్ని కొనేవాడు షావుకారీ ఆసామియో సాహుకారు. అతడే స్వాహాకారుడు రైతుకు మిగులవలసిన లాభాన్ని స్వాహా చేవాడు. సాహుకారుచేతులలో రైతును కట్టించే బదులు రైతుల సహకారసంఘంలోనే రైతుల ధాన్యం నిల్వచేసి సరాసరిగా గవర్నమెంటుకు అమ్మవచ్చునుగ! ఈ పద్ధతికి అధికాహారోత్పత్తిడిపార్టుమెంటు తాలూకు అధికారులు చెవియొగ్గరు. ఈవిధంగా చేస్తే రైతరక్తం పీల్చే జీవరాసుల మిరాశీలు పోతాం. ఈ మిరాశీదార్లు నెత్తురు త్రాగి బ్రతికే నల్ల అధికారులు బల్లక్రింద చేతులుజాపేనల్లుల వలె నల్లత్రాగి జీవించుటకు అవకాశం ఉండదు. నల్ల అధికారులంటే మాత్రమే. మనమీద బ్రతుకవలసిన నల్లులే అనేగైతు జనం అర్థం చేసుకుంటూ. ఈ నల్లుల ఉత్పత్తి ఎక్కువైన అధికారోత్పత్తి అధికమౌతోందేగాని, అధికాహారోత్పత్తి అంగుళం తగినపమాణంలో లేదని ప్రజలు పరిహసిస్తున్నారు. అధికాహారోత్పత్తికోసం రు. 15 కోట్లువరకు ఇండియా ప్రభుత్వం ఖర్చుచేసినట. ఆ ద్రవ్యమంతా ఏ విధంగా కైంకర్యమైనదో ఇంతవరకూ జనానికి బోధపడలేదు. బోధపరచలేదు. ఉత్పత్తి హెచ్చాలి అంటారు. ధాన్యమే కాదు. ప్రత్తికూడా 10 లక్షబేళ్ల వరకూ లోటుగా ఉంది. కనుక ప్రత్తిఉత్పత్తి కూడా హెచ్చాలి. ఉత్త ప్రత్తిఉత్పత్తి మాత్రమే కాదు. జూటు (జనపనార) ఉత్పత్తి కూడా హెచ్చాలి - అదికూడా పాకిస్తాను నుంచి రావడంలేదు కనుక, ఎక్కువగా పై చెయ్యాలి. పాకిస్తాను సప్లయి చేస్తా ఒప్పుకొని బేరం ఖయిసలుచేసికొన్న సరుకును కూడా సప్లయి చేయకుండా తన మాట జాటా మాట అని ప్రత్యక్షంగా చూపించింది. అధికాహారోత్పత్తికోసం 15 కోట్లు ఖర్చుచేస్తే 7 లక్షలటన్నుల ఎక్కువ ధాన్యం ఉత్పత్తి అయిందట. మొత్తంమీద దేశానికి 20 లక్షల టన్నుల ధాన్యం లోటు. కనుక ఇంకా 13 లక్షల టన్నుల ధాన్యం దిగుమతిచేసుకోవాలి. అధికాహారోత్పత్తి, అధికప్రత్తిఉత్పత్తి, అధికజాటుఉత్పత్తి అన్నీ కలిసి ఆఖరుకు అధికాహారపత్తి జాటోత్పత్తియై ఈ ఆర్భాటంఅంతా జాటాఉత్పత్తిఅయితే చాలా విషాదకరం. ఏమైనప్పటికీ, కమిటీలను, అధికారులను ప్రస్తుతం ఎక్కువగా యీ వ్యవహారంకోసం నియమించుటవల్ల అధికారోత్పత్తిమాత్రం ప్రత్యక్షంగా జరుగుతోంది.



విద్వాన్ భమిడిపాటి

అయ్యప్ప శాస్త్రి గారు

వీరికి ఇటీవల గుడివాడలో వారి శిష్యులు, పౌరులు షష్టిపూర్తి ఉత్సవం జరిపి, రెండు నూటపదార్లు కానుక ఇచ్చారు. వీరు శతావధాని, బహు గ్రంథకర్త.

ఢిల్లీ లేఖ:

మన పారిశ్రామిక పరిశోధకసంఘాలు, ప్రభుత్వవ్యవహారాలు

శ్రీ కృష్ణ

ఇప్పుడు భారతప్రభుత్వంఆధ్వర్యంకింద పనిచేస్తున్న పారిశ్రామికవిషయపరిశోధనసంఘాలు కొన్ని ఉన్నాయి. ఇవి కేంద్రశాసనసభాశాసనాల ద్వారా నిర్మించబడినాయి. వీనిలో కొన్నిటికి ప్రభుత్వం గ్రాంట్లు ఇస్తుంది. పెస్సు విధించి వచ్చే ఆదాయంతో మిగతావి నిర్వహించబడుతున్నాయి.

వీనిలో టీ కమిటీ వాణిజ్యశాఖవారి అధికారంకింద ఉంటుంది. రబ్బరు, కాఫీ కమిటీలు పారిశ్రామికశాఖఅధికారంలోనూ, మిగతావి వ్యవసాయశాఖఅధికారంలోనూ ఉంటాయి. వ్యవసాయశాఖాధికారంలో ఉండే కమిటీలు పత్తి, నార, కొబ్బరి, పొగాకు, చెరకు, నూనెధాన్యాలు, పోక, లక్క పరిశ్రమలకు సంబంధించినవి. నార, చెరకు, పోక, పొగాకు కమిటీలకు గ్రాంట్లు లభిస్తాయి. మిగతావానికి పెస్సుల విధింపువల్ల ఆదాయం వస్తుంది. ఈ కమిటీలన్నీ పరిశోధనకు సంబంధించినవి.

ఈ కమిటీలు పార్లమెంటుశాసనాలవల్ల నిర్మించబడినవేఅయినప్పటికీ, వీనిపైన పార్లమెంటుకి ఏపాటి అధికారమూ లేదు. ఈ కమిటీల వార్షికనివేదికల్ని పబ్లిక్ ఏకౌంట్స్ కమిటీకి పంపుతారు. ఆ కమిటీకి మిగతా పనుల్లో తీరిక లేక ఈ నివేదికల్ని చర్చించకుండానే సంతకాలుపెట్టి పంపెయ్యడం మామూలయింది.

కమిటీల కర్తవ్యం పరిశోధన అని చెప్పబడింది. కాని వీని పరిశోధన అక్కరకు వస్తున్నట్లు ఎక్కడా కనిపించదు. పశ్రమలదారి పరిశ్రమలది. వీరి పరిశోధన దారి వీనిది. ఎక్కడా కలయిక లేదు.

ఈ కమిటీలు చేసే సూచనలగతి ఏమవుతోందో తెలుసుకోడానికి మచ్చుకి లక్క పరిశోధనసంఘంసంగతి చూద్దాం. లక

తయాని మానివేసిన ప్రాంతాల్లో పరిశ్రమ పునరుద్ధరించడానికి ఈ కమిటీ ఇటీవల కొన్ని సూచనలు చేసింది. కొత్తగా ఎక్కడెక్కడ ప్రారంభించవచ్చునో కూడా కొన్ని సూచనలు చేసింది. సర్వే చెయ్యగా మధ్యప్రదేశంలో (సెంట్రల్ ప్రావిన్సెస్) ఈపరిశ్రమఅభివృద్ధికి చాలా అవకాశాలున్నాయని తేలింది. కాని ఉన్నమటుకు లక్క పుట్టల్నీ చెట్లనీ జనం కొట్టిపడేస్తున్నారు. దీనివ లక్కంతా నేలపాలవుతోంది. 16-47లో లక్క 17,67,250 మణుగులు ఉంటే 1947-48 కి 9,71,750 మణుగులకి తగ్గిపోయింది. 1944-49 లో 8,050 మణుగులికి పడిపోయింది. అంటే సగంగా పడిపోయిందన్నమాట. మనదేశంచి లక్క కొనే దేశాల్లో ముఖ్యమైనది మెరికా. డాలర్లు సంపాదించిపెట్టే మన క్క పరిశ్రమ ఒకవైపున పడిపోతుండగా, యాం మనతో పోటీ చేస్తోంది. కలప సం వంటచెరకుకోసం చెట్లను కొట్టిపడేస్తుందువల్ల లక్క ఉత్పత్తి తగ్గిపోతోంది. డవులు క్షీణించి పోతున్నాయి. వర్షాలు సరవాలంటే అడవు లుండవలసిన అవసరం ఉంది! అటవీశాఖవారు అడవుల్ని ఎలా వృద్ధిపరచాలో కార్యక్రమాలు నిర్ణయిస్తోంటే ప్రజలు ఉన్న అడవుల్ని కొట్టేస్తున్నారు. అటవీశాఖాధికారుల సమావేశంచేసిన తీర్మానాలు మూల చెదలుపట్టిపోతున్నాయి.

పాకిస్తాన్‌తో వ్యాపారరంగంలోతలపట్లు మితిమీరిపోయినందువల్ల ఇంక ప్రత్తి నార కూడా అవసరమైనంతా మన దేశంలోనే ఉత్పత్తిచేసుకోవలసిన అవసరం కలుగుతోంది. ఆహారోత్పత్తివృద్ధితోపాటు నార ప్రత్తి ఉత్పత్తివృద్ధికి కార్యక్రమాలు సిద్ధమైనాయి. ఈ రెండు ముడిపదార్థాల్లో కూడా మనదేశం స్వయంసమృద్ధం కావాలంటే కోటిరూపాయలు ఖర్చు పెట్టాలంటున్నారు.

ప్రత్తిపంట

దేశవిభజనకి పూర్వం (భారతదేశం పాకిస్తానల్లో)42 లక్షుల బేళ్లు పండేది. అందులో 26 లక్షుల బేళ్ళే ఇప్పుడు భారతరిపబ్లిక్‌లో పండుతుంది. కాని ఇప్పుడు మన రిపబ్లిక్‌లో మిల్లులికి $38\frac{1}{2}$ లక్షుల బేళ్లు పత్తి కావాలి. అంటే ఇప్పుడు $12\frac{1}{2}$ లక్షుల బేళ్లు దిగుమతి చేసుకోవలసివస్తోంది. విదేశాలనుంచి ఆరు లక్షుల బేళ్లు దిగుమతి చేసుకుంటున్నాం. మిగతాది పాకిస్తాన్‌నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. క్రమంగా మన దేశంలో ప్రత్తిపంట తగ్గిపోతోంది కూడా. 1947-48 లో 6 లక్షుల 80 వేల బేళ్లు పాకిస్తాన్‌నుంచి దిగుమతిచేసుకున్నాం.

పాకిస్తాన్ కాక ఇతరదేశాలనుంచి దిగుమతి చేసుకునే పొడుగు పింజపత్తి మన దేశములో ఇప్పుడప్పుడే పండించగల వీలు కనిపించడంలేదు. ఆరేడులక్షుల పత్తి విదేశాలనించి ఎలాగూ దిగుమతిచేసుకోక తప్పదు. చెన్నరాష్ట్రంలోనూ, మైసూరు లోనూ పొడుగుపింజపత్తి పండించడానికిగాను పరిశోధనలు జరుగుతున్నాయి. పాకిస్తాన్‌నించి పొట్టిపింజపత్తిని దిగుమతి చేసుకోడం మానాలంటే సులువు. ఆరకం ప్రత్తిని సులువుగా మనదేశంలో పండించుకోవచ్చును. అంటే మనం పాకిస్తాన్‌పై ఆధారపడకుండా గడుపుకోవాలంటే 9 లక్షుల బేళ్లు ప్రత్తి అదనంగా పండించుకోవాలి. 1948 మార్చిలో కాటన్ కమిటీవారు 40 లక్షుల ఎకరాల్ని అదనంగా ప్రత్తిసాగులోకి తీసుకురావాలని చెప్పారు.

(36 వ పేజీ చూడుడు)

ప్రకృతివిజ్ఞానం:

సముద్రగర్భంలో

సముద్రాన్ని చూస్తే మనుష్యులకి వింతైన ఒక ఆకర్షణ ఉంది. దీనికి కారణం మన రక్తంలో కూడా కొంత సాగరాంశ ఉండడమే. తరంగాల లయలకి నారుపలికే రక్తస్పందనమే మనుష్యుల జన్మకి కారణం.

జీవశాస్త్రజ్ఞులు రక్తాన్నీ సముద్రజలాల్నీ పరిశీలించారు. రెండింటిలోనూ ఒకేరకం నీరుంది. ఉప్పుపదార్థాలు ఒకేరకం సమాననిష్పత్తుల్లో ఉన్నాయి. అందువల్లనే శాస్త్రజ్ఞులు రక్తానికి సముద్రపు నీళ్ళే తల్లి అని గ్రహించారు.

ఇంతేకాదు. పిండోత్పత్తి, గర్భధారణ, జన్మాదిక్రియల మూలనియమాలు మనకు సాగరతరంగాల ప్రసాదమే. పాటుపోట్లు చంద్రుని కళల ననుసరిస్తాయి. ఈ పాటుపోట్ల ననుసరించే తీరస్థప్రాణుల జన్మమరణాలు సంభవిస్తాయి.

ఒకపోటు వచ్చేకాలంలో జలచరాలు గుడ్లు పెడతాయి. అవి పొదగడానికి సన్నపోట్లు సహాయపడతాయి. ఇతర సమయాల్లో గుడ్లు పొదగవు. ఎండి ప్రాణులు నశిస్తాయి. ఒకవారంలో పొదగనిగుడ్లు మళ్లీ పోటువరకూ నిలిచిఉండడం మామూలు. ఎప్పుడూ ఇవన్నీ వారప్రమాణాప్రకారం జరుగుతాయి. పక్షులు జంతువుల పూర్వసంతతులు భూమిపై జీవనాన్ని సప్రదేశాల్లోనే ప్రారంభించాయి కాబట్టి శాస్త్రజ్ఞులు పక్షులు గుడ్లుపెట్టడం జంతువులు పిల్లల్ని పెట్టడం సముద్రతరంగనియమాల్ని అనుసరించి ఉంటాయని చెప్తారు. అంటే చంద్రగమనాన్ని అనుసరించి ఉన్నాయి.

సముద్రగర్భాల్లో పురాతనారణ్యాలు, ఎడార్లుకూడా ఉన్నాయి. భూదేవి రూపొందిన యుగంలో ఎలా ఉండేవో ఇప్పటికీ అలానే ఉన్నాయి. నీటిలో అప్పుడు ఇప్పటికీ ఏమార్పూ రానికారణంవల్లనే నాటి వృక్షసంతతికి సముద్రగర్భంలో ఈనాటికి కూడా మార్పు చెందలేదు.

కాలిఫోర్నియా సమీపంలో ప్రశాంత మహాసాగరగర్భంలో బ్రహ్మాండమైన అరణ్యాలున్నాయి. నాచును పోలిన ఈ వృక్షాలు పర్వతాలపై వృక్షాలకంటె ఎత్తుగా పెరిగినవి ఉన్నాయి. ఇవి సముద్రమట్టంలో రాతిపైన పెరుగుతాయి. అంతే కెరటాల తాకిడికి అటూ ఇటూ కొట్టుకుపోకుండా కాపాడ్డానికి వీటికి చిత్రమైన ఏర్పాటుంది. నీటికంటె తేలికైన వాయువులు చిన్నచిన్న బుడగలుగా తేలి వృక్షం నిలువెల్లా అంటిపెట్టుకుని దాన్ని నిలువబెడతాయి. చెట్టు తలనిండా బుడగలు బుగబుగలాడుతూ విచిత్రంగా ఉంటాయి. ఈ అరణ్యంలోనే మనం సంచరించగలిగితే స్వప్నమాయాజగత్తులో విహరిస్తున్నట్లుంటుంది.

ఇక్కడ జంతుశాస్త్రవేత్తలకు కూడా తెలియని రకరకాల జలచరాలు స్వేచ్ఛగా విహరిస్తూఉంటాయి. పూర్వయుగాలలో సమసిపోయినా యనుకునే అనేకరకాల విచిత్రప్రాణులు ఇక్కడ కనపడతాయి.

ప్రశాంతమహాసాగరమధ్యలో పెద్ద ఎడారికూడా ఉంది. అది భూమధ్యరేఖనుండి ఉత్తరమెరికా, జపాన్ దీవులవరకూ వ్యాపించిఉంది. భాస్వరం బొత్తిగా లోపించిన ఈ పెద్ద ఎడారిలో చేపలుపట్టడానికి వెళ్లిన అనేకులకి ఆశాభంగ మయింది.

(౩౧ వ-పేజీ చూడుడు)



ఇటీవల ఏలూరులో జరిగిన పశ్చిమగోదావరిజిల్లా విద్యార్థి కాంగ్రెస్ మహాసభ ప్రతినిధులు, ఆహ్వానసంఘ సభ్యులు.

ఈనాడు కాంగ్రెస్ పరిస్థితి

శ్రీ సహజానందం

ఈ సంవత్సరం కాంగ్రెసులో 3 కోట్ల మందికి పైగా సామాన్య సభ్యులు చేరారు. ఆంధ్రదేశంలోనే సుమారు 40 లక్షల మంది చేరారు. అంటే సంఖ్యాదృష్ట్యా, మన దేశం జనాభాలో ప్రతి పదిమందికీ ఒకడు కాంగ్రెసుసభ్యుడు. వయోజన ఓటింగు హక్కు ప్రకారం మన ఓటర్లు సుమారు 17 కోట్లమంది ఉన్నారు. ఈ ఓటర్లలో 1/5 మంది కాంగ్రెసులో చేరినట్లు అనుకోవచ్చు.

దీన్నిబట్టి దేశంలో కాంగ్రెసు బలపడుతున్నట్లు గోచరిస్తుంది. కాని కొంచెంలోతు తరచి చూస్తే, ఇది పూర్తిగా నిజం కాదని బోధపడుతుంది.

సభ్యత్వవిషయంలో కాంగ్రెసువారు కొంతమంది స్వార్థంకోసం, అవినీతిగా ప్రవర్తిస్తున్నట్టు కాంగ్రెస్‌వారే విమర్శిస్తున్నారు. సభ్యుల సంఖ్య బాగా వృద్ధి చెందుతున్నా, కాంగ్రెస్ అంతర్నైతిక శక్తి నానాటికీ దిగనాసిల్లుతోంది.

కాంగ్రెసుపాతనియమావళినిబట్టి పావలా సభ్యత్వం ఉండేది. కాని ధనికులు, స్వార్థపరులు సభ్యత్వపుడబ్బు తామే ఇచ్చి, తమ ప్రాతినిధ్యానికనుకూలంగా ఉండే సభ్యులను చేర్పించేవారు. గ్రామాల్లో సభ్యత్వపు పుస్తకాలపై సభ్యులు సంతకాలు, వేలుముద్రలు వేస్తే చాలు. పావలాలు ఆ కాంగ్రెస్ ఏజంటు కట్టుకొనేవాడు.

ఈలోపాన్ని సవరించేందుకని కొత్త నియమావళి ప్రవేశపెట్టారు. కాని ఈ నియమాలను కూడా దుర్వినియోగం చేస్తున్నట్టు కాంగ్రెస్ కార్యసంఘం (24-1-50న) ప్రకటించింది.

ఇందుకు కారణాలు రెండు. 1. కాంగ్రెస్‌వారి వ్యక్తిగతభేదాభిప్రాయాలు; కాంగ్రెస్ రెండుముఠాలై, ఆ ముఠాలు తమ బలాన్ని పెంచుకోటంకోసం ప్రయత్నించటం.

2. అఖిలభారత, రాష్ట్రకాంగ్రెస్ సంఘాలకు ప్రతినిధులను సమర్థ సభ్యులు (*Effective Members*) ఎన్నుకుంటారు. కాబట్టి కాంగ్రెస్‌లో బలపడాలనుకొనేవారు డబ్బు ఖర్చుపెట్టి, దొంగసభ్యత్వానికి పూనుకుంటున్నారు.

ప్రత్యేకంగా ఈసంవత్సరం సభ్యత్వం ఇంత జోరుగా ఉండటానికి ముఖ్యకారణం, రాబోయే ఎన్నికల్లో అభ్యర్థులను నిర్ణయించే అధికారం రాష్ట్రకాంగ్రెసుసంఘాలకు ఉంటుంది. కాబట్టి రాష్ట్రకాంగ్రెసును అధీనం చేసుకుంటే, శాసనసభను కూడా వశం చేసుకోవచ్చును.

ఇవి కారణాలని కార్యసంఘం ప్రకటించింది. ఎన్ని నియమాలను పెట్టినా వాటిని తోసిపుచ్చి స్వార్థపరులు కాంగ్రెస్ సంస్థను వశంచేసుకోటానికి ఎలా ప్రయత్నిస్తున్నదీ కార్యసంఘప్రకటననుబట్టి తెలుస్తోంది.

కాంగ్రెసుసంఘానికి జీవగర్రగా ఉండవలసిన అర్హ (*Qualified*) సభ్యులు, సమర్థ (*Effective*) సభ్యులు ఎలాంటివారు చేరుతున్నారో కూడా తెలుసుకోటానికి, ఆ ప్రకటనలోంచే ఉదాహరిస్తాను. "ఇప్పుడు అర్హ, సమర్థసభ్యులుగా చేరినవారిలో 100 కి పదిమంది కూడా నియమావళి ఆదేశించే నిబంధనలప్రకారం యోగ్యులు కారని వేరే చెప్పనక్కరలేదు."

కాబట్టి హిమాలయశిఖరంలా పెరుగుతున్న కాంగ్రెస్ పునాది ఎంత లోప, దోషభూయిష్ఠంగా ఉందో స్పష్టంగా తెలుస్తోంది. 100 కి 90 మంది అయోగ్యులైన సంస్థలో చైతన్యం, కార్యదక్షత, యోగ్యత ఎలా ఉండగలవు?

చిత్తశుద్ధిగల సభ్యులు 2 లక్షలమంది ఉంటే చాలు అని ఒక సందర్భంలో కార్యదర్శి శంకరరావ్ దేవ్ చెప్పాడు. 3 కోట్ల సభ్యులున్నా, చిత్తశుద్ధిగలవారి సంఖ్య తగినంతగా లేదన్నప్పుడు, ప్రయోజనమేమిటి? కాంగ్రెస్‌సభ్యత్వం వృద్ధిచెందినకొద్దీ, నైతిక తేజస్సు క్షీణిస్తున్నప్పుడు, ఫలితం ఏమిటి? చైనాలో చయాంగ్ పార్టీగతే కాంగ్రెసుకూ పట్టకుండా చూడటం అత్యవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌పతనం దేశపతనానికి దారితీయకతప్పదు.

అధికారస్థానాలన్నిటినీ ఆక్రమించి, రాజకీయంగా అభివృద్ధిచెందటంతోపాటే కాంగ్రెస్ నైతికపతనంకూడా ఆరంభమైంది. కిందటి శాసనసభ ఎన్నికలలో కాంగ్రెసుకు అఖండవిజయం కలిగింది. దానితోపాటు కాంగ్రెసులో స్వార్థచింత, అధికారతృష్ణ వగైరా పెచ్చుపెరిగి, పూర్వప్రతిష్ఠను కోల్పోయింది.

ఆ ఎన్నికలకు అభ్యర్థులను నిర్ణయించేప్పుడే, 'నువ్వు మా ముఠాలో చేరితేనే నీ సంగతి చూస్తాం' అనే షరతుపెట్టి, అలా అభ్యర్థులను నిర్ణంచారని అప్పట్లో ఒకరినొకరు తీవ్రంగా దూషించుకొనేవారు. మన రాష్ట్రంలో ప్రభుత్వం ఇన్నిసార్లు మారటానికి కారణం ఇదే. ఈ ప్రభుత్వపు మార్పుల మూలంగా పార్లమెంటరీకార్యక్రమం అంటే ప్రజలకు ఏమీ గౌరవం లేకుండాపోయింది. రాష్ట్రంలో రాజకీయాలు కలుషితమైపోయినవి. ఇప్పుడు కూడా రాబోయే ఎన్నికల్లో తమతమ ముఠాలను బలపరచుకొనేందుకనే ఈ స్వార్థపరులు కాంగ్రెసునియమాలను దుర్వినియోగపరుస్తూ, కాంగ్రెసును మరింత అప్రతిష్ఠపాలు చేస్తున్నారు.

1947 కు మునుపు కాంగ్రెస్‌లో చేరటమంటే, సత్యాగ్రహాలు, లాఠీచార్జీలు, జైలు మొదలైనవాటికి సిద్ధంకావలసివచ్చేది.

త్యాగం, సేవాబుద్ధి ఉండాలి కాని ఆ తర్వాత ఆ దీక్ష అవసరం లేకపోయింది. సూటిగా ప్రభుత్వస్థానాలు ఆక్రమించటానికి, అది వీలుకాకపోతే పలుకుబడితో ప్రభుత్వసహాయం పొందటానికి కాంగ్రెసు సంస్థ వినియోగపడుతోంది. ఇదివరకు కాంగ్రెస్ ముక్కూ, మొగమూ, ఎరగనివారు, కాంగ్రెస్‌సంప్రదాయాన్ని గౌరవించనివారు కాంగ్రెస్‌వ్యతిరేకులు రాజకీయ, ఆర్థిక ఆధిపత్యంకోసం కాంగ్రెసును వశం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. వీరి సంఖ్య ఎక్కువగా పైకి కనబడకపోయినా, వీరే ఈనాడు కాంగ్రెసుకి ముక్కుకి తాడుపోసి నడిపిస్తున్నారు. వీరే వాస్తవంగా నాయకులని చెప్పినా అతిశయోక్తి కాదు. కాంగ్రెస్ సిద్ధాంతాల్లో, కార్యక్రమాల్లో మార్పులు వీరి ఇష్టానిష్టాల ప్రకారమే జరుగుతున్నాయి.

గ్రామాల్లో కాంగ్రెస్‌సభ్యత్వంగురించి విచారిద్దాం. కమ్యూనిస్టుల అరాచకంఫలితంగా అనేకులు ప్రాణ, విత్త, మాన సంరక్షణకోసం కాంగ్రెస్‌లో చేరుతున్నారు. కాంగ్రెస్‌సంప్రదాయం, కార్యక్రమం ఎరుగనివారు అర్హ, సమర్థసభ్యులుగా చేరుతున్నారు. సరిగ్గా పరిశీలిస్తే, ఈ సభ్యులపై ఖద్దరు ఎంత అగపడదో, వారిలో కాంగ్రెస్ తత్త్వమూ అంత మృగ్యము.

ఇప్పుడధికారంలో వున్న స్థానిక, తాలూకా, జిల్లా, రాష్ట్ర కాంగ్రెస్‌సంఘాలకు పోటీగా తద్వ్యతిరేకులు సభ్యులను చేర్పిస్తున్నారు. అర్హ, సమర్థసభ్యులివ్వవలసిన చందాలు ఈ ముఠాల ఏజంట్లే చెల్లిస్తారు. సభ్యులు కట్టనక్కర్లేదు! స్థానిక కాంగ్రెస్‌వాదులు 'మీరు మా కాంగ్రెస్ కాగితాలపై సంతకం చేస్తారా? లేదా మిమ్మల్ని కమ్యూనిస్టులని పోలీసులకు కబురు పంపేదా?' అని అమాయకప్రజలను బెదరిస్తున్నారు.

ఇలా బెదిరించి, చేర్పించి, పోగుచేసిన డబ్బును కాంగ్రెసుసంఘాలకు పంపడం లేదని కూడా అంటున్నారు. చేరే సభ్యులకు ఈ డబ్బు సక్రమంగా పైకి పంపబడుతోందా? లేదా అనేదిగాని, తమ పేర్లు కాంగ్రెసుపుస్తకాల్లోకి ఎక్కుతున్నయా లేదా అనిగాని ఈ సభ్యులకు అవసరంలేదు—కాంగ్రెస్‌వారు పోలీసులను మీద కురికించకుండా ఉంటే అదే చాలు.

ఈ సందర్భంలో కొన్ని విచిత్రసంఘటనలు జరుగుతున్నయ్. ఇటీవల ఒకగ్రామంపై పోలీసులు దాడిచేసి, కమ్యూనిస్టులను, కాంగ్రెసువారిని, అందరినీ కలిపి లాఠీలతో చావమోదారు. కమ్యూనిస్టులు కానివారు తెల్లపోయారు. "కాంగ్రెస్‌లో చేరినా, లాఠీదెబ్బలు తప్పవన్నమాట" అని కమ్యూనిస్టులు వీరిని ఎత్తిపొడిచారు. "మీ ప్రభుత్వం మీకు మంచి సత్కారం చేసింది" అని. తర్వాత ప్రాంతీయకాంగ్రెసునాయకులు వచ్చి, ప్రజలకు నచ్చచెప్పారు. "మీ ఊరిలో జరిగింది విచారకరమే. కాని ఇతర గ్రామాల్లో జరిగినదానితో పోల్చిచూస్తే, ఇక్కడ జరిగింది చాలా తక్కువ. అన్ని గ్రామాల్లోనూ ఇలానే ఉంది." అని.

కాంగ్రెస్‌వారు చెప్పేది ఇది. పోలీసులను విమర్శిస్తే, పోలీసులు సరిగా పనిచేయరని మంత్రులు భయపడుతున్నారు. కాబట్టి అనుభవించకతప్పదు అని వారి అభిప్రాయం.

అసలిప్పుడు గ్రామాల్లో కాంగ్రెస్‌లో చేరుతున్నవారిలో ఎక్కువమంది 'కాంగ్రెస్‌లో చేరకపోతే కమ్యూనిస్టులని, చావకొట్టుతారేమో' ననే భయంతో చేరుతున్నవారే.

ఆమధ్య జరిగిన జిల్లాబోర్డుఎన్నికల్లో స్వతంత్రఅభ్యర్థులకు ఓటిచ్చినవారికి కమ్యూనిస్టులగతే పట్టుతుందని చాటుమాటున కాంగ్రెసువారు ప్రజలను హెచ్చరించారు. ఇంక 'స్వతంత్రమైన, నిష్పాక్షికమైన ఎన్నికల'కు అర్థమేమిటి? ఇలాంటి ప్రజాస్వామ్యాన్ని ఎవరు గౌరవిస్తారు?

ఇప్పుడా స్వతంత్రఅభ్యర్థులు మళ్లీ కాంగ్రెసులోచేరి, కాంగ్రెసుసభ్యులను చేర్పిస్తున్నారు. కాంగ్రెసువ్యతిరేకి కాంగ్రెసుసభ్యులను చేర్పించటమేమిటి అనిపిస్తుంది. కాని అభ్యర్థులు ప్రజలకు ఇలా చెప్పుతున్నారు.

"స్వతంత్రఅభ్యర్థులకు వేరే పార్టీ లేదు. మేమూ కాంగ్రెసువారమే. కాని కాంగ్రెసు అధికారసంఘాల్ని నిలబెట్టుతున్నవారు సరైన ప్రజాసేవకులు కారు. ప్రజల శ్రేయస్సుదృష్ట్యా వారిని ఓడించి, కాంగ్రెస్‌ప్రతిష్ఠను నిలబెట్టటమే మా ధర్మం" అని.

ఈ కథ పల్లెప్రజల్లో పాకిపోతోంది. కాంగ్రెసులో సభ్యులను రెండుముఠాలు పోటీలు పడి చేర్పిస్తుండటంతో గ్రామాల్లో వాతావరణం చాలా హీనంగా ఉంది.

జిల్లాబోర్డుఎన్నికల్లో, మంత్రుల కనుకూలురు, ఇప్పటి కాంగ్రెసుసంఘాలకు వ్యతిరేకులు కాంగ్రెస్‌అభ్యర్థుల నెదిరించి పోటీచేసిన స్వతంత్రఅభ్యర్థులకు మద్దతు ఇచ్చారు. ఒకచోట ఇద్దరుసోదరులు మొదటినుంచీ కాంగ్రెసుసేవకులే. కాని ఇప్పుడు ఒకరు మంత్రివర్గానికి చెందినవారు. రెండవవారు కాంగ్రెసుసంఘానికి చెందినవారు. రెండవసోదరుడు కాంగ్రెస్ అభ్యర్థికోసం పాటుపడితే, మొదటిసోదరుడు స్వతంత్రఅభ్యర్థికోసం పాటుపడ్డాడు! కాంగ్రెసు అంతర్నాటకం ఇలా ఉండరి ఇంతకన్నా దుర్గతి ఏముంది? అక్కడక్కడ జరుగుతున్న పోలీసుల అత్యాచారులకు కాంగ్రెస్‌లోని ఈముఠాలే చాలావరకు కారణం. ఈ ముఠాలు స్థానికంగా ఉన్నవి కావు. మూలంలోనే ఉన్నయ్. రాష్ట్రకాంగ్రెస్, రాష్ట్రమంత్రులు రెండుముఠాలు. రాష్ట్రకాంగ్రెసునధీనం చేసుకోవాలని మంత్రివర్గంవారు, కాంగ్రెస్‌సంఘాలపై ఆధిపత్యం సంపాదించి, వచ్చే ఎన్నికల్లో తమ ముఠా అభ్యర్థులనే నిర్ణయించాలని ఇప్పటి సంఘాలవారూ, ప్రయత్నిస్తున్నారు. ఈ పోటీకి కాంగ్రెసు బలి అవుతోంది.

కొన్ని జిల్లా, నగరకాంగ్రెసుసంఘాలు మంత్రివర్గంవారి కనుకూలమైనవి. వాటిని రద్దుచెయ్యటం రాష్ట్రకాంగ్రెసువారి కర్తవ్యమయింది. కొన్ని మునిసిపాలిటీలు, పంచాయితీలు కాంగ్రెస్‌సంఘాలవారి ముఠాకి చెందినవి. వీటిని రద్దుపరచటం మంత్రుల కర్తవ్యమయింది.

కాంగ్రెసుప్రతినిధులుండే ప్రతి సంస్థలోనూ ఈ రెండుముఠాలు పనిచేస్తూనే ఉన్నయ్. జిల్లబోర్డులో, మ్యునిసిపాలిటీల్లో...వగైరా రాష్ట్రపతిపై కాంగ్రెసు ఫిర్యాదు, రాష్ట్రకాంగ్రెసుపై జిల్లా కాంగ్రెసు ఫిర్యాదు, జిల్లా కాంగ్రెస్‌పై తాలూకాకాంగ్రెస్ ఫిర్యాదు. ఇలా ముఠా రాజకీయాలతో మురికికొట్టుకుంటున్న కాంగ్రెసువారు తెల్లని ఖద్దరు ధరిస్తేమటుకు లాభమేమిటి? ఇదివరలో ఖద్దరును చూస్తే ఎంతో గౌరవం. పెద్దమనిషితరహాకి ఖద్దరు గుర్తు. కాని ఇప్పుడు? ఖద్దరు మోసానికి పైనకప్పిన ముసుగయింది. ఖద్దరు ధరించటానికికూడా ప్రజలు జంకుతున్నారు. ఖద్దరు ధరించినవారిని ఇవ్వాళ పిల్లలదగ్గర నుంచి వృద్ధులదాకా అందరూ అనుమా

(32 వ పేజీ చూడుడు)

రాజకీయపక్షముల తంత్రప్రవృత్తి

పద్మ అగర్వాల్

ప్రపంచమంతయును నేడు స్వపక్ష పరపక్ష విభేదభావములలో తగుల్కొనియున్నది. మానవజీవితమునకు సంబంధించిన ప్రతివ్యవహారరంగములోను పార్టీవిభేదములున్నా వర్గవిభేదములున్నా ఏర్పడుచుండుట పరిపాటియైనది. ప్రపంచములో ఎన్నిరకాల ప్రభుత్వవిధానములు కలవో బహుశః అన్నిరకాల రాజకీయపక్షములు అవతరించినవని చెప్పవచ్చును.

స్వతంత్రమైన ఒక అభిప్రాయసూత్రమునకు కట్టుపడియున్న ఒక వర్గములో చేరుటయును, ఆ వర్గముయొక్క నియమసూత్రముల ననుసరించి వ్యవహరించుటయును నేటి ప్రజాధర్మముగా నున్నది. ఆ వర్గము నేది ఒక్కకూటంగా ఏకముఖంగా ప్రవర్తించుచుండును.

ఒక పార్టీగా ఏర్పడి వ్యవహరించుటలో అంతర్గతమైయున్న ప్రజాసంకల్పమేమిటో మనము గ్రహించవలసియున్నది. అదియే మన ప్రస్తుత సమస్య. అధికారమును చేబట్టి చలాయించవలెననే సంకల్పంతోనే రాజకీయరంగములోని వేర్వేరు పక్షములు సాముదాయికంగా సమష్టిగా కృషిచేయుచున్నవి. ఇదియే ఆయావర్గముల ముఖ్యసంకల్పము. మానవుడు తానొక ప్రముఖుడనని తన వ్యక్తిత్వమును నిరూపించుకొనగోరుటగాని, తానొక వర్గమునకు ప్రతినిధిగా నిలువబడి ప్రాశస్త్యమును ప్రకటించుకొనగోరుటగాని మానవప్రకృతికి సహజలక్షణము. ఏ మనుష్యుడైనను స్వతంత్రుడై వ్యవహరించునప్పుడు, తాను ప్రాముఖ్యములోనికి రావలెననే సంకల్పంతో తీవ్రంగా కృషిచేసినట్లయితే అట్టి కృషివల్ల అతని ప్రతిభ వృద్ధిపొందగలదు. ఏదైనా, ఒకవర్గము సమష్టిగా ఉచ్చస్థితిలోనికి రావలెననే సంకల్పంతో అత్యధికమైన కృషి చేస్తే, ఆవర్గము యావత్తూ సర్వాధిపత్యమును సాధించుటకు త్రికరణశుద్ధిగా సిద్ధమగును. ఆయా రాజకీయపక్షములన్నింటియొక్క కార్యకలాపముల నిజస్వభావమును వివరించుటకు యీ పౌరుషప్రజ్ఞతే ముఖ్యకీలకములు.

ఏప్రభుత్వము చరిత్రనైనను ఉదాహరణగా స్వీకరించి దానిలోని వివిధఘట్టములను పరిశీలించినయెడల పైజెప్పిన సహజమానవతృష్ణయే మూలకందముగా కన్పించును. రాజవంశప్రభుత్వ పద్ధతియందు "నావిష్ణుః పృథివీపతిః" అన్నారు. రాజైనవాడు దేవాంశసంభూతుడన్నారు. అందువల్ల అతని ప్రజలపై అతడు అధికారము చలాయించుటకు అర్హుడైనాడని చెప్పుచున్నారు. రాజుకున్నూ ప్రజలకున్నూ ఉండే సంబంధము కేవలము పాలకపాలితసంబంధమై యున్నది. యజమానికి సేవకులకు ఉండే సంబంధమువంటిదని, ఒక వ్యక్తియొక్క నిరంకుశాధికారమునకు నియంతృత్వము ఒక నిదర్శనమువంటిది. అయితే నిరంకుశత్వమనేది ఒక అధికారవర్గముచేత కూడా చలాయింపబడవచ్చును. అట్టి నిరంకుశాధికారవర్గప్రభుత్వములో ప్రత్యేకమొకవ్యక్తియందు ఆధిపత్యము మూర్తీభవించియుండక ఒక ప్రత్యేకనిర్ణీతవర్గమువందు అట్టి నిరంకుశాధికారము మూర్తీభవించియుండును. నాజీతత్వమున్ను ఫాసిస్టుతత్వమున్ను రాచరికపు అధికారదౌష్ట్యమున్నూ నిరంకుశాధికారవర్గమున్నూ అమలులో నుండుటవల్లనే ప్రజలలో రాజకీయప్రబోధము కలిగినది. అదిమొదలుగా మానవచిత్తప్రవృత్తియందు నూతనశకము ఆరంభమైనది. రాజకీయమోక్షమునకై అన్వేషణ ఆరంభమైనది. అంతేగాక, అనాదిప్రాకృత మానవుని దాస్యభావము తొలగి ఆత్మవిమోచనము కలుగుటకిది అంకురారోపణ.

నేడు ప్రపంచమంతటను, అసాధారణ సంకల్పదీక్షతోను, ప్రబలశక్తిసంపత్తితోను కార్యనిమగ్నమై యున్నపార్టీ కమ్యూనిస్టుపార్టీ-ప్రజాస్వామ్యసిద్ధాంతముల పరిపక్వదశయే కమ్యూనిజం అని ఊహించుచున్నారు. కమ్యూనిస్టులు అనుసరించెడి సిద్ధాంతముల విషయములో వారు చాలా పట్టుదలగా ప్రవర్తిస్తారు. విద్యుచ్ఛక్తి సప్లయి ప్రతిష్ఠాల నన్నింటిని ప్రభుత్వమే వశపరచుకొని నిర్వహించవలెననే, విషయమై భారతదేశములో చాలా వాదప్రతివాదములు జరుగుచుండెను. దేశములోని ఫ్యాక్టరీలను రైల్వేలను కూడా ప్రభుత్వవశమొనర్పవలెనను విషయమై కూడా చాలా తర్జనభర్జన జరిగెను. అప్పట్లో ప్రభుత్వమునకది సాధ్యముగాక తాత్కాలికముగా ఆ సంకల్పమును వాయిదావేసెను కాని, కమ్యూనిస్టులు చాలాతొందరపడుచున్నారు. ఒక్కసారిగా గంతువేసి ముందంజవేయవలెనందురు. అమలులోనున్న ప్రభుత్వపద్ధతిని ఒక్కమారుగా తారుమారు చేయవలెనంటారు. తమమాట సాగేటందుకు తగిన స్థావరము తమకు కావలెనంటారు అది వారి చిత్తప్రవృత్తి.

అదేవిధముగా సోషలిస్టులు తమ భిన్నభావము వెల్లడించుచున్నారు. వానిలో చాలామంది నిన్నమొన్నటివరకు కాంగ్రెసునాయకులుగా ఉన్నారు. వారికి నిజంగా ప్రస్తుత ప్రభుత్వపద్ధతి సంతృప్తికరంగా లేదు. అందువల్ల ప్రచారం సాగించారు. బహిరంగ అధిక్షేపణప్రదర్శనములను ప్రోత్సహించుచున్నారు. స్వయం వ్యక్తిత్వము వారిలో ప్రబలంగా ఉన్నది. వారు ప్రస్తుత ప్రభుత్వములతో భుజాలుకలిపి పనిచేస్తూ సమయస్ఫూర్తిగా తమ సలహాలను సాధనోపాయములను సూచిస్తూఉండినట్లయితే చాలా బాగుండేది. సోషలిస్టులు జయప్రదంగా నిర్వహింపగల్గిన పరిస్థితులలో మన ప్రస్తుతప్రభుత్వము తన ప్రజ్ఞను చూపలేకపోవచ్చును. కాని యీ సోషలిస్టులు తమ వ్యక్తిత్వమును చూపించుటకొరకై మన దురదృష్టవశాత్తు వారు కాంగ్రెసులోనుండి విడిపోయినారు.

రాజకీయరంగంలో పార్టీ వ్యాపార

మనస్సులో కలతకీ మెడలో నెప్పికీ దగ్గర సంబంధం

డా. జాన్ షిండ్లర్

ఆరోగ్యానికి ముఖ్యంగా మూలకారణం ఏమిటి? నేను డాక్టర్ని కాబట్టి మనస్సే అని చెప్పగలను. అనేక రోగాల కఠినమైన ఈ శరీరం అస్థిరమైన మనస్సుకి బానిస. రోగాల్లో సగం పైగా మనోవ్యథల్లనే సంభవిస్తున్నాయని పరిశోధకులు నిరూపించారు. మనోవైకల్యంవల్ల అనేక శారీరక బాధ ఉద్భవిస్తున్నాయని నిరూపించబడింది.

జీవనం భారతరమైనప్పుడు, కష్టాలు కలిగినప్పుడు, ఘర్షణలు సంభవించినప్పుడు మనోవైకల్యం సంభవిస్తుంది. దీనివల్ల జీవితంలో ఆనందం ఉత్సాహం నశిస్తాయి. మతి తెన్ను తప్పుతుంది. అప్పుడే శరీరం అనేక బాధలకు లోనవుతుంది.

మనోవైకల్యానికి లోనయ్యేవారిలో మూడు తరహాలవారుంటారు:


1. అసలెప్పుడూ తృప్తి అనేది లేక సణుగుతూ ఉండే తరహా. ఈమధ్య గ్రామం వెళ్ళి ఒక మిత్రుణ్ణి చూడ్డానికి వెళ్ళాను. అతను పొలంలో ఉన్నాడు. నువ్వుచేను పుష్కలంగా పండింది. "చేను బాగా పండిందే" అన్నాను. "బాగానే పండిందిలే. కాని వరదొచ్చి తుడిచిపెట్టకుండా ఉన్నప్పుడు చూద్దాం. ఆ యేడు ధరరాలేదు. నువ్వులకి ధర కూడా బాగా వచ్చింది. తరవాత అతన్ని మళ్లీ కలుసుకున్నాను. "మంచిధర వచ్చినట్టుందే" అన్నాను. "వచ్చిందిలే. ఏం ఉపయోగం ఈయేడు బాగా పండిందంటే మళ్లీ యేటికి నేల నిస్సారమే." అని చప్పరించాడు.

ఇటువంటి మనస్తత్వం కలవాళ్ళకి మనోవైకల్యం సులువుగా వస్తుంది. వచ్చినప్పుడు వాళ్ళని పట్టతరం కాదు. ఆతరవాత వాళ్లు మళ్లీ మంచంమీదనించి లేవరు. వెయ్యాలన్నా మందు లేదు.

2. రోజంతా ఏవో ఒక విషయాన్ని

(31 వ పేజీ చూడుము)


తంత్రము లేకుండా చేయవలెనంటే, మానవుల చిత్తప్రవృత్తినే సమూలంగా మార్పు చేయాలి. "సమష్టి శ్రేయమే" ప్రధానలక్ష్యముగా ధర్మాధర్మనిర్ణయము చేయవలెను. అటువంటి సార్వజనిక క్షేమాభిలాషతో వ్యక్తియైనను, ఏ వర్గమైనను విషయ పరిశీలన చేసేయెడల సవ్యమైన ఆలోచనాధోరణి, సవ్యమైన జీవితసరణి ఏర్పడగలవు. "కుటుంబముకొరకై వ్యక్తిత్యాగం; సంఘంకొరకై కుటుంబత్యాగం; దేశంకొరకై సంఘత్యాగం; ఆత్మకోసం సర్వలోకవారి త్యాగం" చేయాలి.



భీమవరంలో వయోజన విద్యావార ప్రారంభ సమయంలో ఊరేగింపు.

శ్రీ వేలూరి రామమూర్తిగారి శిల్పచాతుర్యము

శ్రీ పిలకా లక్ష్మీనరసింహమూర్తి




గాంధీజీశిల్ప ప్రతిమ

లలితకళలలో శిల్పము చిత్రలేఖనము రెండూ కవలపిల్లలవలె కనపడే జంటకళలు. శిల్పం శిలారాతిలో పుట్టింది. చిత్రలేఖనము మనోహరమైన వర్ణములలో జన్మించింది. కొందరు శిల్పులు కొందరు చిత్రకారులు అయితే రామమూర్తిగారు శిల్పమునందు చిత్రకళయందూకూడా అందెవేసినచేయి. ఆయన ఉన్నతాశయములు కల శిల్పి చిత్రకారుడు.

వారి ఇంటికి వెళ్లినప్పుడు శిల్పములను కూడా చూచే సదవకాశము కలిగింది. ఆయన కాపురము ఉన్న ఇంటి ఆవరణలోనే వారిదొక చిన్న కుటీరము ఉన్నది. చుట్టూ చిన్న చిన్న మదురుగోడలు - వాటి నడుమ ఈ చిన్ని కుటీరము చూడ ముచ్చట గొలిపింది. బైటకు వచ్చి ఎటు చూచినా కనులపండువు కలిగించే పల్లెటూరి దృశ్యములు. చిరివాడ ప్రశాంతమైన స్థల మనిపించింది. ఆయన చిత్రకళలోవలెనే శిల్పములోనూ అతి సమర్థులని ఆయనకొమారుడు చెప్పగా విన్నాను. కాని ప్రత్యక్షముగా చూచినతరువాత ఆయన శిల్పబ్రహ్మ యని తోచినది. ఆంధ్రులలో ఇంతటి మహామహులు కొందరేల అజ్ఞాతముగా ఉన్నారో నాకు తెలియలేదు. ఈయన ప్రతిభ ఆంధ్రలోకము ఏలగుర్తించలేదని కించ కలిగింది. ఆయన శిల్పములు తయారు చేస్తున్నట్లు నాతో అన్నవారైన లేరు. చాలాసేపు చిత్రకళనుగురించే ముచ్చటించాము. ఇంకొక గంటకు అక్కడనించి బయలుదేరుతాననగా ఆలోచనలో అటు నిటు పరికించగా ఆ కుటీరములో అస్పష్టముగా కొన్ని శిల్పమూర్తులు కనిపించాయి. వెంటనే లోపలికి వెళ్లిచూతును కదా అద్భుతమైన శిల్పములు లోపల ఉన్నవి. ఆశ్చర్యచకితుడ నయాను. అహో! ఆంధ్రశిల్పి నేటి శిల్పములోను అనల్పమైన కృషిచేశారని ఆనందపరవశుడ నయాను.

అందులో సుమారైదు అడుగుల ఎత్తున ఉన్న దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారి రూపశిల్పము నన్నెంతో ముగ్ధుని చేసినది. మూడుమూర్తులా దేశభక్తుని పోలికలు నిండిఉన్నవి. పంతులుగారిని ఒకసారి బెజవాడలో బహిరంగసభలో చూచాను. బాగా దగ్గరగా రెండుగంటలు వారి సమక్షములో కూర్చున్నానేమో ఆయన మూర్తి మరచిపోలేనంతగా నామనః ఫలకముపై అచ్చుగుద్దినట్లుయుంది. మరల రామమూర్తిగారి శిల్పములో చూచాను. అప్పటికి పంతులుగారు జీవించే ఉన్నారు. శిల్పములలో అనేకుల మూర్తిశిల్పములు చూచాను కాని వ్యక్తిత్వము అంత ప్రస్ఫుటముగా ప్రతిఫలింపించిన శిల్పములు అరుదు.

రామమూర్తిగారు ఆంధ్రచిత్రకారులలో అతిసమర్థులు. కాని వారి సర్వతోముఖమైన శక్తులకనుకూలమైన వాతావరణము ఆంధ్రదేశములో లభించనే లేదు. ఈనాడు



కొండా వెంకటప్పయ్యగారి శిల్ప ప్రతిమలు

లోకముతీరే విచిత్రమైనది. ప్రత్యేకించి ఆంధ్రలోకము. రామమూర్తిగారివంటి సర్వసమర్థులు అజ్ఞాతముగా ఉండుట శోచనీయము. ఆమధ్య గాలివాన ఆంధ్రదేశమును సర్వనాశన మొనర్చిపోయినది. గాలివానకు ఆకుటీరము కూడా కూలిపోయి దేశభక్తుని విగ్రహము చితికిపోయింది. అంత చక్కని శిలాప్రతిమ స్థాపింపబడనేలేదు. దాని ఛాయాచిత్రముమాత్రము రామమూర్తిగారి వద్ద ఉన్నది. అది పోయినతరువాత నాకే ఎంతో మనస్తాపము కలిగింది. ఆయన ఎంత బాధపడిఉంటారో అనిపించింది. అది మళ్లీ ఆరంభించి పూర్తిచేసిననాడు ఆంధ్రులు చూచి ఆనందించగలరు. ఆ కుటీరములోనే పూర్తిఅయిన గాంధిమహాత్ముని శిల్పము, టంగుటూరి ప్రకాశంపంతులుగారి శిల్పము, తదితరశిల్పములు ఉన్నవి. అవి ఎంతో ఆకర్షణీయముగా మూర్తిశిల్పమునకు మచ్చుతునకలవలె ఉన్నవి.

తరువాత ప్రాక్ప్రతీచీ శిల్పదృక్పథములలో కొంచము తేడా ఉన్నది. అన్ని దేశముల శిల్పములు స్థూలముగా చూచిన వాటిలో రెండువిధముల శిల్పములు కనిపించుతాయి. అవి పౌరాణికశిల్పములు. మూర్తిశిల్పములు పురాణకథల ననుసరించి శిల్పించిన శిల్పములు పౌరాణికశిల్పములు. ఇక మూర్తి శిల్పములు లేక రూపశిల్పములలో చక్రవర్తులు రాణులు-సైన్యాధిపతులు మొదలయిన వ్యక్తి శిల్పములు వస్తాయి. ఇటీవల దేశములో పేరు పొందిన వ్యక్తులు శిల్పులు శిల్పములు తయారు చేస్తున్నారు. ప్రాచీనభారతీయరూపశిల్పములు కొంచము ఇంచుమించు పౌరాణిక శిల్పములను అనుసరించే ఉంటయి. వాటికి వీటికి ప్రాచీనకాలమందు శాస్త్రదృష్ట్యా కాకుండా స్థూలదృష్టిలో అంత వ్యత్యాసము కనిపించదు. రూపకల్పనలో-అవయవ సౌష్టవమును శిల్పించుటలో-హస్తపాదవిన్యాసములో - ఆహార్య రచన-ఆభరణములు కూర్చుట మొదలయిన విషయములలో సన్నిహితసంబంధము కనిపిస్తుంది. తిరుపతి దేవాలయమునకు వెలుపలగా ఉన్న శ్రీకృష్ణదేవరాయలు దేవేరులవి విగ్రహములు రూపశిల్ప




ప్రకాశంపంతులుగారి శిల్పప్రతిమ

ములలో అపరూపమైనవి. ప్రాక్ప్రతీచీ రూపశిల్పములలో పాశ్చాత్యరూపశిల్పములు ఎక్కువ వాస్తవికతవైపు మొగ్గుచూపిస్తాయి. ప్రాచ్యరూపశిల్పములు రమ్యమైన అలంకారములతో శిల్పిసమాధినించి అవతరించిన దివ్యరూపమునకు ప్రతిబింబములా అన్నట్లు ఉంటాయి. నేడు చిత్రకళాశాలలో శిల్పవిద్య నేర్చుకునేవారు వాస్తవికదృష్టికే ప్రాధాన్యమునిస్తూ రూపశిల్పములు తయారుచేస్తున్నారు. మైసూరుసంస్థానశిల్పిఅయిన వెంకటప్పగారు శిల్పములో అద్వితీయులు. వేలూరి రామమూర్తిగారి శిల్పకౌశలము కూడా ప్రశంసనీయమైనది. ఈయనశిల్పములో ప్రాక్ప్రతీచీ సంప్రదాయములు చక్కగా నెరిగిన శిల్పి.

శిల్పి వాస్తవికమైన భౌతికరూపము ద్వారా వ్యక్తిఆత్మను కనుక్కుంటాడు. వ్యక్తికి ఉండే విచిత్రమనశ్శక్తులు శిల్పమూర్తిలో ద్యోతకమయ్యేట్లు చేస్తాడు. రూపకల్పనలో ద్రష్టను ఆకర్షించే సర్వవిషయములకు తను సృష్టించే మూర్తి వ్యాఖ్యానమువంటిది. సుపరిచితమైన పోలికలకు ప్రాధాన్యము ఇస్తాడు. సామాన్యమైన అనవసరవిషయములకు మూర్తికల్పనలో చోటుఉండదు.

శిల్పవిద్యలో రామమూర్తిగారి శక్తులు సర్వసమగ్రమైనవి. అట్టి శక్తిని భగవంతుడు ఆయనకు ప్రసాదించాడు. అది ఎంతగా కృషిచేస్తే అంతగా ఫలోన్ముఖమై సహస్రవిధముల విజృంభించుతుంది. నేటి ఆంధ్ర-చిత్రకారులలో ఇట్లు వివిధశక్తులు గలవారు అరుదు. వీరు పౌరాణికశిల్పములు కూడా చక్కగా తయారుచేయ గలరని నాయూహ. పురాణకథలలో నించి చక్కని ఇతివృత్తములు తీసుకొని గొప్ప శిల్పములు తయారుచేయవచ్చును. ఈమధ్య వచ్చిన గాలివాన ఆయనతయారు చేసిన శిల్పములనుకూడా పాడుచేసినది. బలవంతులకే అడుగడుగునకు అంతరాయములు అడ్డులు తగులుతాయి. కార్యసాధకులే అనేక ప్రతికూలపరిస్థితులను ఎదుర్కుంటారు. ఈయన సర్వవిఘ్నములను నెట్టుకొని సర్వోత్కృష్టమైన కృషి సలుపవలెను. అది తప్పక కళాపోషకులను ముగ్ధులను చేస్తుంది. సహృదయుల మన్ననలను పొందుతుంది.



నవల:



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౧౮

పూర్ణిమనాటికి ఏకశిలానగరమున కొంత సందడి తగ్గెను. త్రిపురాంతకుడును జన్నిగదేవుడును సోదరుడగు నంబదేవునికి తమ మండలముల లెక్కలందజేయుభారముకూడ నప్పజెప్పి మహాసైన్యములతో పల్లవపాండ్యచోళసేనల నెదుర్కొను వీరోత్సాహముతో కదలి చనిరి. పలువురు సామంతులు మండలేశ్వరులు రుద్రదేవమహారాజుల సెలవుగైకొని తమతమ ముఖ్యస్థానముల కేగిరి. కొలని రుద్రుడు కొలనివీటి కేగెను. అన్నమంత్రికూడ వెడలిపోవ నుంకించెను గాని రాజధానీనగరము విడిచిపోవ నాతనికి రాజానుజ్ఞ రాలేదు.

ఆ మరునాడు శ్రీ రుద్రదేవమహారాజు ఆంతరంగికమందిరమునకు తిక్కచమూపతిని అన్నమంత్రిని అంబదేవుని బిలిపించి యేకాంతమున వారితో మంత్రించుచుండెను. ఆ యేకాంతమందిరము బహుచిత్రమైనది. అక్కడ గూరుచున్న నగరమంతయు గనబడుచుండును; కూరుచున్నవారును నగరమంతటనుండి కానరావచ్చును గాని గుర్తించుటగుదు.

ఏకశిలానగరమధ్యభాగమున స్వయంభూశేశ్వరస్వామి గూలయమున్నది. ఆ దేవాలయము నాలుగు గోపురద్వారములును కోటనాలుగుద్వారముల కెదురుగా నున్నవి. ఈశ్వరుడు సర్వతోముఖుడైనను ఈశ్వరాయతనము దక్షిణముఖముగా నున్నది. ఆ మహాయతనము నావరణకు బాహ్యప్రదేశమున దక్షిణభాగమున ఈశ్వరుని మహాసరోవర మున్నది. సరోవరజలములంటి స్వయంభూదేవాలయమునకు ఇన్నూరు విండ్ల దూరమున నాగ్నేయభాగమున నొక మహాశిల కలదు. కోటలో నీశాన్యభాగమున మరియొక గండశిల కలదుకాని యీ మహాశిలయే యందున్న ఏకైకశిలగా భాసించును. పూర్వ మీనగరము చిన్న పల్లెగా నుండునప్పుడు బాటసారులా సరస్సెంత గల తోటలో విడిసెడువారు. అప్పుడు అది ఎక్కడనున్నదని క్రొత్తవా రడిగినప్పుడు సంస్కృతము వచ్చినవారికి, ‘అదిగో ఏకశిల కనబడుచున్న దే యక్కడ!’ అని నిర్దేశించువారు; ప్రాకృతులకు, ‘అదుగో ఓరుగల్లు కనబడుచోట నే’ అని చూపెడివారు. అదియే మహాపట్టణమైనతర్వాత ఏకశిలానగర మైనది. కేవల మది నగరము నడిబొడ్డున లేకున్నను ఉన్నట్లే భాసించును.

ఆ మహైకశిలపైకి పోవుటకు తూర్పున గల చిన్న మార్గమున దప్ప మానవసాధ్యము కాదు. మిగిలిన యన్ని వైపుల నది చెక్కకుండగనే చెక్కివేసినట్లు నునుపుగా ప్రపాతమై ఒడుదుడుకుగా నుండును. అందుచే కోట కట్టునప్పుడే కాకతీయప్రభువులు వానిని ఉపలక్షించి క్రీడాశైలముగా చేసినారు. పైకి దారిగల ప్రాచీదిశను క్రిందిభాగమున క్రీడావనము వేయించి యందు జక్కని లీలామందిరములు నిర్మించి చుట్టును ఉన్నతప్రాకారము నిర్మించిరి. ఆ దారికి వచ్చువరకు శిలపైగూడ రాతిగోడలు కట్టినారు.

కాకతీయుల క్రీడాశైల మగు నీ ఏకశిలయుపరిభాగమున గల మండలములే బహుళముగా వారి మహామంత్రశాలలు. అక్కడనున్నవారికి కనబడకుండ నెవ్వరు వినగలుగు దూరమునకు వచ్చుట యసాధ్యము. అది నగరమధ్యమున నున్నను నగరోపరి గలదు. అందుచే నచ్చట బహుప్రశాంతముగ నుండును. అచ్చట గూరుచున్నవారి దృష్టి యేకశిలానగరప్రాకారముకూడ దాటి వారికి దూరమున వాయవ్యముగా గోవిందరాజస్వామిగుట్ట కనిపించును; దానికి పడమరగా హనుమకొండకొండలును దాని సమీపముననే శాయంపేటకొండయు చూడనగును. ఇంకను దూరమున ఇనుపరాతిగట్టును పూర్వము హిడింబాశ్రమ ముండెడి దని ఐతిహ్యము కల రెండుస్తంభముల యాకారము కల గుట్టయు నందుండి కానవచ్చును. అందున్నవారి మనస్సులా కారణమున దూరభూములకును నభోవీథులకును ప్రసరింపగలిగి యుండును.

“ఆంధ్రరాజ్యముసరిహద్దులం దెల్లెడల శత్రుదండయాత్రలు చెలరేగినవి. ఇప్పటికి నాలుగైదుసంవత్సరములక్రిందటనే పరాభూతుడైన ఈపల్లవకొప్పెరుంజింగనికి మరల పైకిరా ధైర్యము వచ్చినది. ఈమారు జటావర్మసుందరపాండ్యుడు కంచినుండి నెల్లూరువరకు గల భూభాగ మాక్రమించుట ప్రమాదకర మైనది. ఉత్తరమునుండి కళింగులు పిఠాపురమువరకు చొచ్చుకొని వచ్చి దక్షిణమునుండి వచ్చుచున్న కొప్పెరుంజింగనితో కలసికొన నుంకించుచున్నారు. చోళసామంతు లందరు శత్రుసేనలతో చేరుచున్నారు. గొంటూరువిభుడగు నాగదేవుడు శత్రువుల రాక యాధార మొనర్చుకొని కాకతిరాజుల ధిక్కరించుటయే గాక మండలమునం దెల్లెడ నరాజకము చేయుచున్నాడు. ఇక యలజడి లేకున్నట్లు కనుపించునది పశ్చిమభాగముననే. అందు దక్షిణభాగమున హొయిసలులును ఉత్తరభాగమున యాదవులును మనకు పరమశత్రువులు. అటునుండియే ఈ

యాంధ్రరాజ్యమునకు మహాప్రళయ మెన్నటికైన రావచ్చును. వారి కెక్కువ క్రోధకారణము లున్నవి. వారి కెక్కువ బలము లున్నవి. వారు పైకి శాంతులుగా కనుపడుచున్నను మనము ఏమారియుండుటకు వీలులేదు. మన రాష్ట్రములో పరిస్థితులు ఎక్కువ యల్లకల్లోలమైనపిమ్మట పెద్దఎత్తున మనలను ముంచివేయు నిశ్చయములతో వారుండియుండవలె! రాజధానీనగరములో జైనకరణములు చేసిన సమ్మెతో మన కన్నులు తెరువబడినవి. శత్రుసైన్యము లాకస్మికముగా మనల ముట్టడించిన నీ మట్టికోట మనల గాపాడలేదు. అదియును మట్టికోట నంటి కర్ణాటదేశమునుండి వచ్చిన జనులు పలువురు నివాస మేర్పరచుకొని యున్నారు. ఈ జైనకరణముల గృహములును ప్రాయికముగా నచ్చటనే కలవు!—"

ఈవిధముగా తిక్కచమూపతి నివేదించుచుండెను. అన్నమంత్రి యడ్డువచ్చెను.

"ఈ మట్టికోటలోపల నొక శిలాప్రాకారమును మరల రాజమందిరములకు జుట్టు మరియొక శిలాప్రాకారమును నిర్మించుటకు వివరములు సిద్ధముచేయ స్థపతులకు ఆజ్ఞ లీయబడినవిగదా! అవి ఎంతవర కైనవి?"

తిక్కచమూపతి: "అవి మీ యుభయుల యెదుటగూడ నివేదించుటకే మిమ్ముల నిద్దర రాజధానీనగరమున మహారాజు లుంచినది!"

అన్నమంత్రి: "మంచిది! ఏవి?"

తిక్కచమూపతి సంకేతముగా చిన్న శంఖ మొకటి మ్రోయించెను. కొలదిసేపటిలో రుయ్యమ కొన్ని పటపత్రములతో నచ్చటికి వచ్చెను. అందులో భావిదుర్గనిర్మాణచిత్రములు లెక్కలు వివరములు ఇత్యాదులు కలవు. అవి తెచ్చిన వ్యక్తి యవి యిచ్చి సెలవు తీసికొని వెళ్లియుండవలసినది.

కాని చిత్రముగా రుయ్యమ యచ్చటనే కదలక యున్నది. రుద్రమదేవి యైనను వచ్చిన వ్యక్తిని వెళ్లుమని సంజ్ఞ చేయలేదు. అందుచే నాశ్చర్యముతో అన్నమంత్రి కన్నెత్తి రుయ్యమ్మవంక వీక్షించెను. రుయ్యమ యంతవరకు తనవంకనే ప్రీతిపూర్వకముగా తదేకదృష్టితో విలోకించుచున్నట్లు వెంటనే యాతడు గమనించెను. అతని చూపు తనపై బడినంతనే రుయ్యమ జంకుతో తల త్రిప్పుకొనెను. తా నంతవరకు అన్నమదేవునివంక తత్పరయై చూచుచున్న సంగతియే యామె కంతవరకు తెలియదు. అన్నయగౌరకన్నులలో నపూర్వ మగు నొక కాంతి కలదు. రుయ్యమ సామాన్యముగా పురుషులు తనవంక జూచుచుండిన నేమాత్రమును తిరిగి చూచుటకు జంకెడి అభ్యాసము కలది కాదు. కాని యట్లామె చూచుటలో నెట్టి యెడ్డెతనమును ప్రదర్శింపదు. ఆమెకు స్త్రీపురుష భేదము లేని నిర్లిప్తప్రకృతి గల దను నొక గౌరవభావమే యుదయించును.

కాని యీనా డన్నమంత్రి, "ఇంకను ఎందుకు వెడలి పోలేదు?" అని ప్రశ్నించుచున్నట్లుగా తనవంక జూచినంతనే తనకు మున్నెన్నడు పురుషదృష్టి కలిగించియుండని జంకు ఈనాడు ఇతని దృష్టి కలిగించిన దేమి? తా నాతనివంక నంతసే పేల చూచినది? ఆతని శ్యామాయత దేహము ఉన్నతఘనతంత్రాలికములు నాసము గౌరకన్నులు చూచినచో నెవరికి మరలమరల చూడవలె ననిపించదు? పూర్వ మెప్పుడు నాతని దివ్యమూర్తి నంత సమీపమున నుండి రుయ్యమ చూచియుండలేదు. అతని చూచుచుండుట నేడు కన్నుల కొక విందుగా నున్నది. కాని తా నాతని కంతసేపు చూచుచుండినందుకు ఎంతో సిగ్గుగా నున్నది. తాను చూచుచున్నది అతని దృష్టిలోగూడ బడినది. ఆ తలపుతో రుయ్యమ దేహమంతయు కుంచుకొనిపోయెను. ముఖమామె వాల్చినను ఆ ఎర్రని ముఖము వికసించిన కోకనదమువలె మరిం ఎర్రనయ్యెను.

సిగ్గుపడుచున్న యీ పదునారేండ్ల బాపనపడుచును అన్నమంత్రి తన గౌరకన్నులతో మొదలు కోపము చిరాకుతోడనే చూచెను. కాని యాత డామెసిగ్గు నుపలక్షించినంతట నంతయు నాశ్చర్యముగా మారెను. అంతలో రుద్రమ యన్నమంత్రిసందేహము గమనించి స్పష్టపరచెను.

"అమ్మాయిని నేనే ఉండుమంటిని. ఆమెకీ పత్రాదికములు క్షుణ్ణముగా ముఖస్థమైనవి!"

ఆ మాటలతో అన్నమంత్రి తృప్తుడై యథాప్రకారము వ్యవహారకాండలో నిమగ్నుడయ్యెను. తిక్కచమూపతి అన్నమదేవునికిని అంబదేవునికిని రాతికోటనిర్మాణము వివరించుచుండెను. మధ్యమధ్య వారలకు గోపురద్వారములు దిడ్డుగవనులు బురుజులు ఎక్కడెక్కడ నుండునోకూడా భూమిపై దూరమున వ్రేలితో చూపి విశదము చేయసాగెను వారిద్దరును అట్టి సూక్ష్మముగా సర్వము నవగాహన మొనర్చుకొనుచుండిరి.

పెద్దరాతికోట ఎంత యెత్తు? ఎంత లావు? మట్టికోట కెంత దూరము? అది యేయేవాడలమీదుగా వచ్చును? ఎన్ని మందిరములు ఇప్పు డున్నవి తీసివేయవలసివచ్చును. దీనిని రక్షించుట కెక్కడెక్కడ ఎంతెంత సైన్య ముంచవలెను? ఎట్టి సేనలు అవి? అగడ్తకు నీరుపెట్టుట యెట్లు? ఇన్ని శిలలు ఎక్కడినుండి వచ్చును? ఎట్లు? దీనికి ఎంతకాలము పట్టును? అది పూర్తియగువరకు రాజమందిరము రక్షించు టెట్లు? ఇట్టే ఎన్నియో ప్రశ్నలు వచ్చెను. వానికి సమాధానములును నిర్ణయమైనవి. ముందు రాజమందిరముల చుట్టును పెద్దరాతితోడను వానిమధ్య నీటిపైగూడ తేలునవై యుండి బరువు లేకుండి బహుకఠిన మగు నిటుకలతో దృఢ మగు ప్రాకారము మహాశివరాత్రిలోపుగా పూర్తి చేయవలెను. ఈమధ్యనే పెద్దరాతిగోడకు రాళ్లు ఇనుపరాతిగట్టునుండి తెప్పింపవలెను. మూడు సంవత్సరములు కాకముందె శిలాప్రాకారము పూర్తియైతీరవలెను. స్థపతులను శిల్పులను ఎంత ద్రవ్యము వెచ్చించియైనను వేలకొలదిగా దీనికి నియమింపవలెను.

ఆ సంభాషణలో రుయ్యమ ఏమియు కల్పించుకొనలేదు. కాని యానాటి కార్యాలోచనమంతయు ప్రత్యక్షరమును ఆమె యవగాహన మొనర్చుకొనుచు హృదయకుహరములో పదిలమొనర్చుకొనుచున్నట్లు అన్నయకును అంబదేవునకును స్పష్టమయ్యెను. ఈ పిల్ల ఎవరు?

ఇవి పటాదులు తెచ్చునపుడు రుద్రమను 'అమ్మా!' యని సంబోధించెను. అది మర్యాదపిలుపు కావచ్చును. కాని రుద్రమ దీనిని 'అమ్మాయి' యనియే కుమార్తెనట్లే నిర్దేశించి పలికినదే! ఈమె కూతు రైనచో మన మెరుగకుందుమా? ఈమె రుద్రమతో నెట్టి పోలికయు లేదే! పైగా బ్రాహ్మణయువతిగా కనిపించుచున్నదే!

రాతికోట మనోజ్ఞముగా నుండి చూచువారిని ఆంధ్రరాజుల

(28 వ పేజీచూడుడు)

కథానిక:

పచ్చబంగీ

శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి



శ్రీఉదయమే నాగవల్లి పూనానుండి తిరిగి తండ్రిదగ్గరకు వచ్చింది. నాగపూరు యూనివర్సిటీ ఇంటరు పరీక్ష తప్పిపోయిన తరువాత నాగవల్లి చాలా క్రుంగిపోయింది. ఆమె తనువల్లిక పచ్చదనము కోలుపోయినది. ఎప్పుడూ ఒకటే విచారము! పరీక్ష తప్పిపోవటము ఎంత అవమానకరమైన విషయము! ఆమె ఎన్నో కలలను గన్నది. తాను మొదటితరగతిలో ఉత్తీర్ణురాలవుతుందనీ - ప్రథమురాలుగానే రావచ్చుననీ - తోటి విద్యార్థులూ అధ్యాపకులూ తన నెంతో అభినందిస్తారనీ ఎన్నో ఆలోచనలు పరీక్షఇచ్చిన దగ్గర నుండి ఆమెహృదయములో కెరటములు లేస్తూనే వచ్చాయికాని... ఏమిలాభము! ఆమె ఆశలన్నీ పరీక్షాఫలితాలువార్తాపత్రికలలో వెలువడిననాడు - ఆమె నంబరు అందులో కనబడకపోవటముతో-అటుగంటిపోయినవి!

ఆమె గదిలోనుంచి బయటికి రాలేకపోయింది. తన ముఖము ఎవరికీ చూపలేకపోయింది.

ఆమెకు అహర్నిశలూ అదే దిగులూ విచారమూను. మనసు మళ్ళించుకోవాలని ఎన్నో పుస్తకాలు చదివిచూసింది. చెల్లెళ్లకు తమ్ముళ్లకు బట్టలుకుట్టూ...వాళ్ళకు చదువుచెప్పాలని ప్రయత్నించింది. కాని ఆమెకు ఏదీ సాధ్యముకాలేదు.

ఆమెతండ్రి వరదరాజు ఆమెతోపాటు పరీక్షపోయినందుకు విచారపడ్డాడు. ఆమె ఆవిధంగా అన్నమూ నీళ్లూ వర్జించి చింతాభరములో మునిగిపోవటము చూడలేక నాలుగు నెలలపాటు మేనమామ దగ్గర పూనాలో ఉంటే కాస్త ఉత్సాహముగా ఉంటుందన్న ఉద్దేశ్యముతో నాగవల్లిని పంపించాడు.

పూనావెళ్ళిన రెండుమూడు దినాలపాటు క్రొత్తక్రొత్తగా ఉన్నా తరువాత ఆఊళ్ళో నాగవల్లికి బాగానే ప్రొద్దుజరిగింది. మేనమామ, అత్తయ్య ఆమె మేధస్సుకు విశ్రాంతి లేకుండా చేశారు. పగలు మేనత్తతో గృహకృత్యాలలో పాల్గొనేది. సాయంత్రము అయిదు కాగానే మేనమామ ఆఫీసునుంచి వచ్చి ఇద్దరినీ బయటికి తీసుకొనివెళ్లేవాడు. ఇటుఅటు తిరిగి మెల్లగా సినీమాకు చేరుకునేవారు. రాత్రి ఏపదిగంటలకో ఇల్లుచేరుకొని భోజనానంతరము, చూసివచ్చిన సినీమాలనుగురించి, పాత్రలనుగురించి చర్చిస్తూ నిద్రపొయ్యేవారు.

అక్కడఉన్న నాలుగు నెలలలో నాగవల్లి ఆరోగ్యము బాగా అభివృద్ధిపొందింది. ఆమె తనూలత నవనవలాడ జొచ్చినది. మనిషిలో ఎప్పటివలె మంచి ఉత్సాహము కలిగినది. తప్పిపోయిన ఆమె పరీక్షసంగతి క్రమేణ మరచింది.

కొత్తగా తమ్ముడుపుట్టినట్లు ఉత్తరము వచ్చేవరకు ఆమెకు ఇంటిధ్యాసే కలుగలేదు. ఆమెమనసు తిరిగి గృహోన్ముఖమై తలిదండ్రులమీదికి చిన్న చెల్లెళ్ల తమ్ముళ్లమీదికి మరలింది.

బారసాలకు రమ్మని బావమరదికి వరదరాజు ఉత్తరము వ్రాశాడు. మేనమామకు సెలవుదొరకలేదని నాగవల్లి ఒక్కతే ప్రయాణమయి వచ్చింది.

కొత్తపాపముచ్చట తీరిన తరువాత తిరిగి కాలేజీ.- చదువుమాట ఎత్తుతుందేమోనని వరదరాజు అనుకున్నాడు. కాని నాగవల్లి ఆమాటే తలపెట్టలేదు. పూనానుండి తెచ్చుకున్న పుస్తకాలతోటీ-అత్తయ్యదగ్గర నేర్చుకున్న వింతవింత అల్లికలతోటీ కాలక్షేపము చేస్తున్నది.

* * *

అవి హైదరాబాదు స్టేటుకాంగ్రెసుమీద ప్రభుత్వము ఆంక్ష పెట్టిన దినాలు. నాయకుల నియంతృత్వముక్రింద చాలా మంది ప్రభుత్వశాసనాన్ని ఉల్లంఘించి కారాగారశిక్షను పొందారు. చీమలబారువలె ఎడతెగకుండా కొంతకాలము జట్లుజట్లుగా కాంగ్రెసువాదులు జైలుకు వెళ్లితేనేగాని కాంగ్రెసుబలము ప్రభుత్వానికి తెలియదని, నాయకులు ప్రజలలో చాలా తీవ్రముగా ప్రబోధమూ ప్రచారమూ కావించి సంచలనము కలిగిస్తూ వచ్చారు. అయితే ఇదంతా రహస్యంగానే జరుగుతూ వచ్చినది.

ఈ జట్టులలో కూడా పేరుపొందినవాళ్లు వచ్చినట్లయితే కాంగ్రెసుకు విలువ ఎక్కువగా ఉంటుందనీ, పెద్దలలోనే కొంత కదలిక కలిగించాలని ఆ సంఘములోని యువకబృందానికి అభిప్రాయము కలిగింది. స్వాతంత్ర్యసమరములో నాయకులనబడే వారు ముందుగా నడుముకట్టి బయలుదేరవలెనని యువకులు పట్టుపట్టారు. "మీరు ఫలానారోజున బయలుదేరవలసినది"నిఆకాశరామన్న ఉత్తరాలు వ్రాయటమూ కొంతమందిస్త్రీలచేత ప్రబోధము చేయించటమూ ప్రారంభించారు.

తీవేళములేని కార్యకర్తలూ, పూర్వాపరాలను ఆలోచించిన లౌకికులూ వీటినేమీ లక్ష్యము చేయలేదు.

ఉప్పొంగిపోతున్న ఉత్సాహముతో యువకబృందము కొంతమందిస్త్రీలను సమావేశపరచారు. అందరూ కలిసి ఒక తీర్మానము చేశారు. ఒక చీరె నాలుగేసి గాజులు పచ్చటి కాగితములో చుట్టి దానికి ఎర్రటి బొట్టుపెట్టి, వారి పట్టికలో ఉన్న సంఖ్యకు సరిపడే బంగీలను తయారుచేయించారు. మరునాడే చిరునామాదారులకు అందచేయాలని సంకల్పించి తగు ఏర్పాట్లు చేశారు.

మరునాడు ఉదయము ఏడుగంటలకల్లా రెండు మోటార్లలో స్త్రీజనము బయలుదేరింది. ఉత్సాహవంతులయిన విద్యార్థులు కొందరు ఈ సంఘములో చేరటము చూసి నాగవల్లికూడా చేరి పచ్చబంగీతో బయలుదేరింది.

నిర్దేశించిన ఇంటికి వెళ్లటము, చిరునామాదారుని పిలిచి ఆ బంగీ చేతుల్లో పెట్టటము, ఆ బంగీఏమిటో వారు తెలుసుకోనే లోపలనే 'నమస్తే' అంటూ సెలవు పుచ్చుకుని కారు ఎక్కటము, ఈవిధంగా తొమ్మిది పదిగంటలయేసరికల్లా అందరిపనీ పూర్తిఅయి నాగవల్లి ఒక్కతే మిగిలిపోయింది.

సుమారు తొమ్మిదిన్నరగంటలకు ఆమె వంతుకు వచ్చిన ఇంటిముందర కారు ఆగింది. నాగవల్లి దిగి చీరె సవరించుకుంటూ లోపలికి వెళ్లింది. బయట వరండాలో కళ్లజోడు ధరించిన ఒక యువకుడు కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు.

నాగవల్లికి అతడు యజమానిగా తోచలేదు. కాని ఆమెసంకల్పము యజమానికే స్వయముగా యివ్వాలని. కనుక 'వారిని పిలువండి' అని ఆ యువకుని ఉద్దేశించి అన్నది.

"లోపల మాట్లాడుతున్నారు. మీరు కూర్చోండి వారు వస్తారు" అంటూ ఆ యువకుడు కుర్చీ చూపించాడు.

నాగవల్లి మర్యాదగా 'సరే'నని కూర్చున్నది. కాని ఆమెకు ముళ్లమీద కూర్చున్నట్లుగా ఉంది. ఎంతో పని ముందుపెట్టుకొని ఊరికే కూర్చున్నట్లుగా తోచింది. కాని యజమాని వచ్చేవరకూ కూర్చోవలసిందేనని నిశ్చయించుకున్నది కనుక ఎప్పుడు ఆయన వస్తాడా - ఎప్పుడు బంగీ చేతులో పెట్టానా అని ఎదురుతెన్నులు చూస్తూ కూర్చుండిపోయింది.

ఇంతలో 'ఆ బంగీ ఏమిటండీ' అని సామాన్యకౌతూహలంతో ఆ యువకుడు ప్రశ్నించాడు.

దానితో నాగవల్లిఅమాయకహృదయము ఉద్రేకించి ఆవేశపూరితమయి, "కాంగ్రెసు శంఖారావములు చెవినిబడిన తరువాతకూడా, త్యాగముచేసి సమరములో పాల్గొనని నాయకులకు ఈ బంగీలను బహుమానముగా ఇస్తున్నాము. ఇందులో ఒక చీరె గాజులజత ఉన్నాయి. సౌభాగ్యలక్షణమైన పసుపుకుంకుమచిహ్నాలుగల ఈ బంగీలను స్వీకరించి ఆడదానివలె వాటిని ధరించి ఇండ్లలోనే ఉండమని మా సలహా." అంటూ జేవురించిన ముఖమును చేతిగుడ్డతో అద్దుకున్నది.

ఆ యువకుడికి మొదట ఆశ్చర్యమూ, తరువాత ఆపుకోలేని నవ్వూ కలిగాయి.


"స్త్రీ అబల కాదు, పురుషునితో అనేదవిషయాలలోనూ పోటీ చేయగలదని సంచలనము జరుగుతూఉన్నది కదా. స్త్రీజాతి బాగా ఉన్నతస్థితికి వచ్చినట్లుగా మీ ఉన్నతి మీ విద్య చెప్తూనేఉన్నాయి. అట్లాటింకి ఈరోజుల్లో స్త్రీలు ధరించే చీరెలోనూ గాజులలోను అబలాత్వమెక్కడున్నదండీ? అందులో - స్త్రీలే స్వయముగా పురుషులకు ఇవ్వటములో - మీ స్త్రీజాతిని మీరే చిన్నచూపు చూస్తున్నారేమోనని నాకు తోస్తున్నది. బాగా ఆలోచించారా?" అంటూ వచ్చేనవ్వును పెదవులతోనే అణచిపెట్టాడు.

సన్నగా పొడుగ్గా ఉన్న నాగవల్లితను వల్లిక జార్జెట్టుచీరెతో అలంకరింపబడి ఉన్నది. కనుబొమలకు నల్లటిరంగు - పెదవులకు ఎర్రరంగు వేసుకున్నది. చెంపలకు గులాబిరంగు పూసుకున్నది. పులిగోళ్లవలె దీర్ఘములైన ఆమెచేతిగోళ్లు ఎర్రటిరంగుతో - గోరింటాకును పెట్టుకొని కడుక్కున్నట్లుగా ఉన్నాయి. ఎత్తుమడమల కాలిజోడు ధరించటమువల్ల ఆమె మరింత పొడగరిగా చూపరులకు కనబడుతున్నది. ఆమెతనవల్లిక ఆ యువకుడు వేసిన అడ్డుప్రశ్నవల్ల రోషముతో ఊగిపోసాగింది.


ఈ అధునాతననవోఢను చూసి - ఆమె తలపెట్టిన కార్యమును చూసి యువకుడు తిరిగి నవ్వటము మొదలుపెట్టాడు.

నాగవల్లికి రోషము ఎక్కువ కాజొచ్చి

(33 వ పేజీ చూడుడు)




రిప్పన్ భవనం.




సెంట్రల్ స్టేషన్.

దీపమాలాలంకృత భవనాలు


రిపబ్లిక్ సంస్థాపనోత్సవ సందర్భంలో
విద్యుచ్ఛక్తి దీపమాలాలంకృతాలైనట్టి భవనాలు
భవనాలపైన కనిపించే నక్షత్రాలను
పోలినకాంతులు, బాణసంచా కాల్చినట్లున్నవి.



ఎగ్మూర్ స్టేషన్.




ద్రోణార్జునులు—శ్రీ వేలూరి రాధాకృష్ణ




ఆదర్శ జీవితము—శ్రీ వి. మధుసూదనరావు

చిత్రలేఖనంలో కొత్త




గొల్లకాపరులు—శ్రీ కుమారిలస్వామి



'గాంధీమహాత్ముడు'—శ్రీ ఎ. పైడిరాజుగారు






పుంజు, పెట్ట—శ్రీ కొండపల్లి శేషగిరిరావు


పోకడలు

అక్క-చెల్లెలు—పంచవర్ణదారు చిత్రం. శ్రీ హరీన్ బోస్.
హైదరాబాదు ఆర్ట్సుసొసైటీవారి బంగారుపతక
బహుమానాన్ని పొందినది.





విజయా ఫిలింస్ వారి **షావుకారు** చిత్రంలో నాయికపాత్రధరించిన **జానకి**



విజయా వారి "షావుకారు"

విజయావారి "షావుకారు" నిర్మాణం వాహినీ స్టూడియోలో శ్రీ ప్రసాదు దర్శకత్వంలో చాలా చురుకుగా సాగుతున్నది. చిత్రం తాలూకు సంభాషణలు [illegible] అయి ఎడిటింగు కూడా జరిగింది. ఇది సాంఘిక చిత్రం. ఇందులో అనేక ప్రత్యేకతలు [illegible]. మొట్టమొదటిసారిగా [illegible] నటించే ఎస్. జానకి ప్రధానపాత్ర నిర్వహించటమే కాక, అతికష్టమైన [illegible] సామర్థ్యంతో నటిస్తున్నది. ఈ నటితో పాటు షావుకారు [illegible] పాత్ర [illegible] గోవిందరాజుల సుబ్బారావు. [illegible] (రౌడీ) పాత్ర [illegible] చాకలి రామి పాత్ర [illegible] మాధవి [illegible] దానికి సందేహం లేదు. [illegible] ఈ చిత్రంలో చెప్పుకోదగిన విశేషం ఏమంటే ఇది [illegible] సాంఘిక చిత్రాలకు [illegible] చేస్తున్నది. ఇందులో సాహిత్యంతో [illegible] ఉండే పాత్రపోషణ [illegible] చిత్రంగానూ ఉండటమే [illegible] కారణం. అనేకరకాల [illegible] చక్రపాణి [illegible] కనిపిస్తున్నది. శ్రీ ఘంటసాల వెంకటేశ్వర్లుగారి దర్శకత్వంలో చిత్రంలో సంగీతం హాయినిస్తుంది.


★

రాగిణీ ఫిలింస్ వారి

తిరుగుబాటు

ఈ తెలుగు చిత్రంలో నారాయణరావు, శాంతకుమారి, కృష్ణవేణి, లలిత, పద్మిని మొదలైనవారు నటిస్తున్నారు. చిత్రం దాదాపు పూర్తికావచ్చింది. సంగీతదర్శకులు [illegible] నరసింహారావుగారు.

పై చిత్రంలో [illegible] సెట్టుల్లో ఉన్న లలిత, పద్మిని. ప్రక్క చిత్రంలో నాయికా నాయకులు శాంతకుమారి, నారాయణరావులు.





నాలుగు సూక్తులు

అనగనగా ఓపూరిలో నలుగురు స్నేహితులున్నారు. వాళ్ళ నలుగురికి దేశసంచారం జేయాలని బుద్ధి పుట్టింది. సరేనని దేశసంచారానికి బయలు దేరి వెళ్తున్నారు. త్రోవలో ఊసుపోవడానికి ఒకరి కొకరు కథలు చెప్పుకుంటుండేవాళ్ళు. కథ చెప్పినవారికి 50రూ॥ యివ్వాలనే నియమం యేర్పరచుకున్నారు. ఇలా వెళ్లుతుండగా, దారిలో ఓవృద్ధ బ్రాహ్మణుడు కనిపించాడు. నలు-



గురు స్నేహితులు అతని చుట్టుచేరి, "తాతగారూ! కథ చెప్పండి" అంటూ వేధించడం మొదలుపెట్టేరు.

తాత వారిని చూచి "అలాగే చెపుతాను. నాలుగు వాక్యాల కంటె యెక్కువ చెప్పలేను. ఒక్కొక్క వాక్యానికి, వంద రూపాయలివ్వాలి" అన్నాడు. వారు సరేనని ఒప్పుకొని - డబ్బుయిచ్చినతర్వాత తాత యీక్రింది నాలుగు వాక్యాలూ చెప్పాడు.

(1) డబ్బు, ప్రయాణ సమయంలో ఖర్చుపెట్టడానికే వుద్దేశింపబడినది.

(2) ధనము లేనినాడు బంధువులు

శ్రీమతి యం. పద్మావతీదేవి

నిన్ను విడనాడుదురు. స్నేహితుడే నిన్నాదరించును.

(3) దగ్గర నున్నంతవరకే, స్త్రీ భర్తయెడ ప్రేమానురాగములను కనబరుస్తుంది.

(4) విక్రమాదిత్యుని కుమార్తెను పెండ్లిచేసుకోవాలంటే నిద్రను జయించాలి.

ఈనాలుగు వాక్యాలు విని నలుగురు స్నేహితులు తెల్లబోయారు. వారికి మిక్కిలి కోపం వచ్చింది. "వహ్వా ఈముష్టినాలుగుమాటలకు నాలుగువందలు తీసుకుంటావా?" అని, తాతను రాజగారివద్దకు తీసుకొనిపోయి తమను అతడు మోసపుచ్చి, ఏవో నాలుగు ముక్కలు చెప్పి, నాలుగు వందలు దోచుకున్నాడని ఫిర్యాదు చేసేరు.

రాజు తాతవైపు తిరిగి "ఏమయ్యా! నీవేమి చెప్పుకుంటావో చెప్పుకో" అన్నాడు.

తాత "మహాప్రభూ! చెప్పుకోవడానికేముంది. వాక్యానికి వంద రూపాయిలు తీసుకుంటానని ముందే వాళ్ళతోచెప్పేను. నామాటల్లోని సత్యాన్ని గ్రహిస్తే, వాటికి వంద రూపాయిలవిలువ యేమాత్రం?" అన్నాడు.

ఆ నాలుగు వాక్యాలు యేమిటో చెప్పమన్నాడు రాజు. తాత యిదివరలో చెప్పిన సూక్తులే చెప్పేడు.

రాజుకూడా మొదట ఒక్కొక్క సూక్తికి ఇంత డబ్బా అని ఆశ్చర్యపోయాడు. కాని ఎలాగైనా వాటి నిజానిజాలు స్వయంగా పరీక్షించి చూడాలనుకున్నాడు. ఆ నలుగురు స్నేహితులకు వారి డబ్బిచ్చి పంపివేసి తాతతో "తాతా! నీవు చెప్పిన వాక్యాల నిజానిజాలు స్వయంగా పరీక్షచేసి చూస్తాను. అంతవరకు నీవు నాకోటలోనే వుండాలి. నీవు చెప్పినవన్నీ తూచ తప్పకుండా సరిపోతే, నిన్ను గౌరవించి, సత్కరిస్తాను. అవి అసత్యాలయితే యేమి చేస్తానో నీకే తెలుసు" అన్నాడు. తాత "మీ యిష్టం. నే చెప్పినవన్నీ, యెన్నటికీ అబద్ధం కావు" అన్నాడు.

కొన్నిరోజులయినతర్వాత రాజు తన భార్యను పుట్టింటికి పంపివేసేడు. రాజ్యం మంత్రుల కప్పజెప్పి, తానొక కూలివానివేషం వేసుకొన్నాడు. కొంత డబ్బు రహస్యంగా మొలలో దాచుకొని తన భార్యపుట్టింటివూరు చేరేడు. ఆ వూరిలో రాజుగారికి రొట్టెలు చేసే వాడిదగ్గిర పనివాడుగా కుదిరేడు. ఒకరోజు సాయంత్రం రొట్టెలవాడింటికి, చక్కని స్త్రీ పళ్ళెంనిండా మిఠాయివస్తువులతో వచ్చింది. ఆవిడ చాలా అందంగా వుంది. ఎవరా అని తిరిగి చూస్తే తన భార్యే! తెల్లవారుఝామునే వెళ్ళిపోతూ కూలీవేషంలో వున్న రాజును చూచింది.

ఇంటికి వెళ్ళి "ఆ కూలీవాడిని చూస్తే నా భర్తలాగే వున్నాడు. బహూశా ఆ తాత చెప్పిన వాక్యాల్లోని సత్యాన్ని కనుక్కోవడానికే వచ్చివుండాలి. ఇతడిని ప్రాణాలతో వొదిలిపెడితే నా కపకీర్తి వస్తుంది. అందుచేత వెంటనే చంపించివెయ్యడమే మంచిది" అని తనలో తాను ఆలోచించుకొంది. రహస్యంగా నలుగురి తలారివాండ్లను పిలిపించి, చాలా డబ్బు యిచ్చి, రాజభవనంలో రొట్టెలవాడింటిలో పని చేస్తున్న కూలీవాడిని చంపివెయ్యమని చెప్పింది.

తలారివాళ్లు రాజును అడవిలోకి తీసుకుపోయారు. రాజు తన దుర్గతికి చింతిస్తూ వారితో "ఎందుకు నన్నన్యాయంగా చంపుతారు? మీకు రాణి యిచ్చినదానికి రెట్టింపు డబ్బు యిస్తాను. నన్ను ప్రాణాలతో వదలివేయండి" అని బ్రతిమాలుకున్నాడు. రాజు తనదగ్గర వున్న డబ్బంతా యిచ్చివేయగానే వానిని విడిచి వాళ్లు సంతోషించి, తమ దారిని తాము పోయేరు.

రాజుకి, తాత చెప్పిన మొదటి రెండుసూక్తులలోనినిజం తేటపడింది.

ఇంక మిగిలిన రెండు సూక్తుల నిజం తెలుసుకుందామని, రాజు ఓ సాధువువేషం వేసుకున్నాడు. ఆ వేషంతో తన చెల్లెలి రాజ్యం చేరుకొని, ఆమెభవనానికి వెళ్లేడు. ఆమెను చూచి కన్నీళ్లతో "నా రాజ్యమంతా శత్రువుల పాలైపోయింది. పూటకు గతిలేని నిరుపేదనైపోయాను. భోజనం చేసి నాలుగు రోజు లయింది. భోజనం పెట్టి నా ప్రాణం నిలుపు" అని ఎంతో దీనంగా వేడుకున్నాడు. కాని చెల్లెలి హృదయం ఏమాత్రం కరుగలేదు. పైగా ఆవిడకు కోపం వచ్చింది. కోపంతో మండిపోతూ "ఛీ! ఛీ! సిగ్గులేక నాయింటికి వచ్చేవా? నా అన్న యిటువంటి దరిద్రుడని నా భర్తకు తెలిస్తే, నా పరు వేమైనా నిలుస్తుందా? ఎంత అప్రతిష్ఠ! ఎవ్వరు చూడకుండా వచ్చినదారినే వెళ్ళిపో!" అని దూషించింది. దాసీదానిచేత కొంచెం అన్నం మూకుడులో తెప్పించి ఇచ్చి అన్నతో "ఈ మూకుడు తీసుకువెళ్లు. మళ్ళీ నాకంట బడకు" అని హెచ్చరించింది. రాజు దీనంగా "అలాగే చేస్తాను. దానిమీద నీ ముద్ర వేసియ్యి" అని అడిగాడు. ఆమె అంగీకరించి, తన రాణిముద్ర దాని మీద వేసి ఇచ్చింది. రాజు దానిని భద్రంగా ఒకచోట దాచిపెట్టేడు.



ఏ. యస్. జయలక్ష్మి (మద్రాసు)
ఆలిండియా రేడియోలో జనవరి 21-వ తేదీన పాడిన బాలిక.

ఆహా! లోకంలో డబ్బు వుంటేనే బంధువులు ఆదరిస్తారు. తాత చెప్పిన వాక్యం నిజం." అనుకుంటూ తన చిన్ననాటి ప్రాణస్నేహితుని యింటికి వెళ్లేడు. రాజు స్నేహితుని చూడగానే తన చెల్లెలికి చెప్పినట్టే, తన కల్పితకథంతా చెప్పడం మొదలుపెట్టేడు. స్నేహితుడాతనిని ఆప్యాయంగా కౌగలించుకొని "ఎందుకు మిత్రమా! దుఃఖిస్తావు. కష్టాలు కలకాలం కాపురం చేయవు. నీకు మళ్లీ మంచిరోజులు రాకమానవు. అధైర్యపడితే యేమి లాభం! భోజనం చేసి, హాయిగా మా యింట్లో విశ్రాంతి తీసుకో! మనస్సు వ్యథాగా పాడుచేసుకోకు" అని ఓదార్చేడు.

కొన్ని రోజులు మిత్రుని యింటి దగ్గర గడిపినతరువాత రాజు సాధువు వేషంతో విక్రమాదిత్యుని పట్టణం చేరుకున్నాడు. ఆ రాజుదగ్గరకు వెళ్ళి "రాజా! నీ కుమార్తెను నాకు వివాహం చేసుకోవాలనివుంది" అన్నాడు.

విక్రమాదిత్యుడు పరిహాసంగా నవ్వి "నా అభ్యంతరం యేమీ లేదు. ఒకరాత్రి అంతా ఆ మొగదిలో మీరు నిద్రపోవాలి. రెండవరోజుకు

బ్రతికి బాగుంటే, రాజకుమార్తెను మీరే పెళ్లి చేసుకోవచ్చు" అన్నాడు.

సాధువువేషంలో వున్న రాజు ఆ షరతుకు వొప్పుకున్నాడు. ఆ రోజు రాత్రి అతనికి రాజకుమారుడి వేషం వేసి, రాజకుమార్తెగదిలోనికి పంపించేరు. తన ప్రక్కమీద తనతలపాగా దుస్తులూ అవీ తీసి అచ్చంగా మనిషి పడుకున్నట్లే పెట్టి, తానొక మూల కూర్చొని చూస్తున్నాడు. తాత చెప్పిన వాక్యం జ్ఞప్తికి తెచ్చుకొని నిద్రనేమాట మరిచిపోయేడు. అర్ధరాత్రయేసరికి రాజకుమారి నోట్లోనుండి ఓ పెద్దపాము గబగబా బయటికి వచ్చి ప్రక్కమీద మనిషి ఆకారంగా వున్న దుస్తులను బాగా కాటు వేసి, తిరిగి రాజకుమారి నోట్లోకి వెళ్ళిపోబోతున్నది. రాజు కత్తితీసి ఆ పామును చంపివేసి, యింకే భయం లేకపోవడంవలన కొంచెం నిద్రపోయాడు. ఇంతలో వాడుకప్రకారం శవవాహకులు వచ్చి తలుపు తట్టేరు. రాజే వచ్చి తలుపు తీసేసరికి వారాశ్చర్యపోయి విక్రమాదిత్యునితో యీ సంగతి చెప్పేరు.

ఈ విషయం తెలియగానే రాజు కూడా ఆశ్చర్యపోయాడు. తన కూతురును సాధువుకు యిచ్చి వివాహం చేయాల్నే అనే విచారం, యీనాటికైనా తన కూతురికి వివాహం అవుతుంది కదా అని సంతోషం ఒక్కసారి అతన్ని చుట్టుముట్టేయి. తన ప్రతిజ్ఞ నెరవేర్చుకోవడంకోసరం సాధువుకు తన కుమార్తె నిచ్చి వివాహం చేయడానికి నిశ్చయించుకున్నాడు. ఈ ఆలోచనలో పడి కొట్టుకుంటుండగా సాధువు అతని దగ్గరికి వచ్చి, "రాజా! మీ అమ్మాయిని నెల రోజులు పోయినతర్వాత వివాహం చేసుకుంటాను. ప్రస్తుతం నాకు మీ కుమార్తె ఉంగరం, మీ ఉంగరం కావాలి" అన్నాడు. ఆ రెండు ఉంగరాలు సంపాదించి రాజు తన రాజధాని చేరుకున్నాడు.

తాత చెప్పినవన్నీ సత్యాలు కావడంవల్ల యెంతో సంతోషించి, అతన్ని చాలా గౌరవించి కావలసినంత ధనం యిచ్చేడు. తర్వాత తన చెల్లిలియింటికి తాను భద్రంగా దాచిన మూకుడు పట్టుకువెళ్ళేడు. అన్నీ తిరిగి రాజువేషంలో రాగానే ఆమె అతన్ని యెంతో గౌరవించింది. ఆ మెయుద్రతో నున్న మూకుడు చూపించి వున్నసంగతి వున్నట్లు చెప్పేడు. ఆమె రాజుకాళ్ల మీద పడి క్షమించమని వేడుకున్నది. అక్కడినుండి స్నేహితుని యింటికి వెళ్ళి, జరిగిన సంగతంతా చెప్పి అతనికి చాలా ధనం యిచ్చి గౌరవించేడు. తర్వాత తన మొదటి భార్య పుట్టింటికి వెళ్లి మామగారికి తన భార్యప్రవర్తనగురించి తెలియజేసేడు. తలారివాళ్లు కూడా సాక్ష్యమివ్వడంవల్ల, ఆమెచెడుప్రవర్తన స్పష్టపడింది. రాజశాసనానుసారం ఆ ముసలిరాజు తన కూతురిని, ఆ రొట్టెలుచేసేవాడిని చంపించివేసేడు.

విక్రమాదిత్యుడిచ్చిన రెండు ఉంగరాలు పట్టుకొని తన పరివారంతోసహా అతని పట్టణం చేరుకున్నాడు. ఆ ఉంగరాలు చూపించి తన కథనంతా అతనికి తెలియజేసేడు. విక్రమాదిత్యుడు, తన అల్లుడు ఒక గొప్ప రాజైనందుకు చాలా సంతోషించి తన కూతురినిచ్చి వివాహం చేసేడు.

తెల్లదొర - నల్లదొర

ఒక గ్రామం దగ్గర ఒక పెద్దచెరువులో కప్పలూ, చేపలూ, చాలా ఉన్నాయి. వాటిలో అవి తగులాడుకుంటూ ఉండేవి. ఒకనాడు అన్నీ కలిసి గట్టిగా ప్రార్థన చేశాయి. “ఒఇంద్రుడా! మమ్ములను పాలించడానికొక దొరను పంపవయ్యా!” అని

ఇంద్రుడు వాటిమనవి విన్నట్లున్నాడు. మరునాడు తెల్లని శరీరం పొడుగైన కాళ్లు, ముక్కుకల ఒక దివ్యమూర్తి చెరువుగట్టుపై దిగాడు. అతన్ని చూడగానే అందరికి ఆనందం కలిగింది. ఇంద్రుడు పంపిస్తే వచ్చిన తమ యేలిక అనుకొన్నారు. పడి-పడి, దండాలు పెట్టారు. ఆ వచ్చిన వ్యక్తి విలాసంగా ప్రొక్కులందుకున్నాడు. తమ తమ కష్టసుఖాలు వినిపించుకోడానికి దగ్గరకు వస్తూన్న సంఘాన్ని అదలించి, “ఒక్కొక్కరే నాదగ్గరకు దయచెయ్యండి,! మీ సంగతి విచారిస్తా”నన్నారు తెల్లదొర. చిత్తమన్నారు అందరూ.

ఆనాటినుండి ఒక్కొక్కరే విన్నపాలు చేసుకొంటున్నారు. అయితే దొరగారి దర్శనానికి వెళ్ళిన వారు మరి తిరిగి రావడం లేదు. వారి వ్యవహారం పరిష్కారం అక్కడే అయిపోతున్న దన్నమాట. ఈతీరుగా కొంతకాలం సాగింది. చెరువులో జనాభా తగ్గడం ప్రారంభించింది. బుద్ధిమంతులు కారణాలు వెతుకుతున్నారు. ఈసారి నలుగురికి తక్కువ గాకుండా వెళ్ళకూడదు. దర్శనానికొకరు లోపలికి వెళ్లితే మిగిలినవారు గుమ్మందగ్గర నుండి సంగతులు, సందర్భాలు కనిపెటాలి అనుకొన్నారు. అలాగే చేశారు.

లోపల కుంభకోణం జరుగుతున్నది. “కీచుకీచు మేవానరుంధే” అని వినిపించింది. తెల్లదొరగారి తత్వం బైటపడింది. ఈ మహానుభావుడు మరికొంతకాలం దయచేసి యుంటే మనపని పూర్తి కావచ్చు” అని తేల్చుకున్నారు. ఆనాటినుండీ “మా కొద్దు ఈ తెల్లదొరతనము” అని ఇంద్రునితో మొరపెట్టుకున్నారు.

ఇంద్రుడు వారి ప్రార్థన విన్నాడు

శ్రీ రేజేటి సీతారామస్వామి

కాబోలు ఆ గ్రామంలో రైతుసోదరుడు నల్లగా నున్న ఒక తుమ్మదుంగను చెరువులో ఊరవెయ్యడానికి మోసుకవచ్చి దభాలున నీటిలో పడేశాడు. తెల్లదొరగారు బెదిరి పారిపోయారు. చెఱువు అల్లకల్లోలమైపోయింది. కొంతసేపటికి కల్లోలం తగ్గింది. మెల్లిగా నల్లగా దుంగ తేలింది. దాన్ని చూచి చెఱువులోని జీవులన్నీ ఊహించాయి “ఈయన మనల్ని పాలించడానికి యింద్రుడు పంపించగా వచ్చియుంటారు. ఆహా! నల్లదొరగారు! ఎంత చక్కగా ఉన్నారు! ఎంత గట్టిగా ఉన్నారు. ఎంత శాంతమూర్తులు!” అని ప్రశంసలు ప్రారంభించారు.

మెల్లిమెల్లిగా ఒక్కొక్కరే దగ్గరకు చేరుకొన్నారు. రెండుచేతులతో ముట్టుకొని దండాలు పెట్టుకోవడం సాగించారు. కదలరు, మెదలరు, ఊఁ అనరు ఆఁ అనరు. మా నుంచిదొర. అంటూ మీదను యెక్కడం మొదలు పెట్టారు. ఛల్. ఛల్. అంటూ స్వారీ చేయటం మొదలుపెట్టారు. బలే నల్లదొరగారు! అంటున్నారు.

కొందరుమాత్రం “ఉలకరు, పలకరు దొరగారు. వారిమీద నెక్కడం తప్పురా?” అంటున్నారు. మఱికొందఱు “కష్ట మనడు సుఖ మనడు. లంచాలు పట్టుతున్నా, బ్లాకుమార్కెట్లు చేస్తున్నా”!

దొంగతనాలు, దోపిళ్లు చేస్తున్నా హత్యలు జరిగిపోతున్నా చూస్తూ వూరుకుంటారు. ఇదేమి దొరతనము! మా కొద్దు ఈ నల్ల ధొరతనము. మాకు జన్మమధ్యను, కంట్రోలు, రేషనింగు, పోదా?” అని మఱికొందరు అంటున్నారు. “పన్నెండు దేశాలు పండుతున్నవి గాని పట్టెడన్నము లోపమండీ” అని పాటలు పాడుతున్నారు ఇలాగుంది స్థితి. “ఈ దొరగారికి పౌరుషం లేదురా! ఒరేయ్. మునుపటి తెల్లదొరతనమే మంచిదిరా! ఈ నల్లదొరతన మిలాగే ఉంటుందిరా! రాజంటే దుర్మార్గులను శిక్షించాలి. సన్మార్గులను రక్షించాలి. మనమంతా తిన్నగా నడవగల్గితే దొరయెందుకు?” అని విమర్శించారు. వీడూ పోతేనే మంచిదిరా! భగవంతుడా! ఓ యింద్రుడా” అని ప్రార్థనలు చేశారు. ఇంతలో రైతు వచ్చి ఆ తుమ్మదుంగను పట్టుకుపోయాడు.

మర్నాటినుండీ! మరింత అరాచకం ప్రారంభమైంది. అదుపుపెట్టే వారు కనపడరు. మళ్లా ప్రార్థనలు సాగించారు. ఇంద్రునికి వీరిపై కోపం వచ్చింది. వర్షాలు కురిపించడం మానేశాడు. చెరువు యెండిపోతున్నది. చేపలు కప్పలూ విష్ణుమూర్తినిగూర్చి మొరపెట్టుకున్నాయి. అత డేమి చేస్తాడో!!

రుద్రమదేవి

(16-వ పేజీరుతవాయి)

మహైశ్వర్యమునకు విభ్రాంతులను జేయునట్లుకూడ చేయుట యవసరము! అందుపై గూడ గొంత విచారణ సాగినది. స్థపతులు గోపుర ద్వారములకు పలువిధములుగా రూపచిత్రము లిచ్చిరి. కొన్ని కేవలము బలముగా నుండి మోటుగా నున్నవి. కొన్ని కొంచెము తక్కువబలముగను సున్నితమైన శిల్పసంపదతోడను ఉన్నవి. అవి చూచినకొలదియు చూచువారి నాకర్షింపసాగెను. మరికొన్ని బలిష్ఠమై యుదాత్తశిల్పముతో విరాజిల్లుచున్నవి. అం దందరు నేకగ్రీవముగా మూడవరకమువానిలో చిత్రములు ఉచితము లని నిశ్చయించిరి. ఆంధ్రవీరుల మనస్సులవలెనే ఈ కోటగూడ దృఢమును ఉదాత్తమునుగా నుండవలె. జిలుగుపనులు కోటగోడలకు ఉచితములు కావు. గోపురద్వారములయొద్ద రెండువైపుల నోరు తెరచి మెడ మలచికొనియున్న సింహవిగ్రహములే పెట్టవలెను. అవి జేగురు రాతితో నిర్మింపవలెను!

అంతలో రుద్రముకనుసన్న గైకొని రుయ్యమ యా యేకశిల ద్వారమునొద్దకు బోయెను. ఆమెవెంట కుబ్జ బాలప్రతాపరుద్రు నచ్చటికి తీసికొనివచ్చి వదలి సెలవుతీసికొని పోయెను. కొండపల్లిలో చేసిన కొయ్యగజ మొకటియు అశ్వ మొకటియు ప్రతాపరుద్రుని యాట కచ్చట వదలిపెట్టి పోబడెను. ఆ రెండును యెక్కిలి పెద్దవై బాలు డెక్కుట కనువుగా నుండెను. క్రింద వాని కున్న చక్రములపై నెక్కినవారు నడిపింప వీలుకూడ కలదు.

తిక్కచమూపతి చిరునవ్వుతో ప్రతాపరుద్రదేవుని పలుకరించెను. "ప్రతాపరుద్రదేవా, శ్రీరుద్రదేవమహారాజులు మీ కేమగుదురు?"

ప్రతాప: "అమ్మగారు!"

ఆ మాటతో రుద్రమదేవిలోని మాతృత్వము బయలుపడ పురుషధీరత వదలి చిరునవ్వు నవ్వెను.

తిక్కచమూపతి: "మరి యీ రుయ్యమ?"

ప్రతాపరుద్రదేవుడు మాటాడక రుయ్యమవంక జూచెను. ఆ చూపులో నాతనికి రుయ్యమ యన్న నేమాత్ర మిష్టము లేదని స్పష్టమయ్యెను. రుద్రమదేవి యందుకొనెను. "రుయ్యమ్మ ప్రతాపరుద్రదేవులకు ఒకకొంత శిక్షాగురువు!"

అంబదేవుడు ప్రశ్నించెను. "ప్రతాపరుద్రదేవులు ఈ గుర్ర మెక్కి స్వారిచేయగలరా?"

"ఓ!" యనుచు ప్రతాపరుద్రుడా కొయ్యగుర్ర మెక్కి కాళ్లతో త్రోసికొనుచు నా కట్టినుమున శీఘ్రగమనమున సంచరించెను. పిల్లవాని చురుకుదనమున కందరు మెచ్చుకొనిరి.

"మరి గజ మెదురైనచో నేమి చేయుదురు?" ఈ ప్రశ్న తిక్కచమూపతి యడిగెను.

ప్రతాప: "ఏదీ ఎదురు రానిండు!—చూపెదను?"

రుయ్యమ యా పెద్దఏనుగును ఆతనివైపుకు త్రోసెను. దానిని దగ్గరకు రానిచ్చి ప్రతాపరుద్రుడు మెరుపుమెరసినట్లు ఊపున తన గుర్రముముందుకు త్రోసి గజమును డీకొనజేసి దానిని వెనకకు కొట్టివేసెను.

అన్నమదేవుడు: "అయితే ప్రతాపరుద్రులకు కత్తిసాము తెలియునా?"

రుద్రమ: "మీరే పరీక్ష చేయుడు! ప్రతాపరుద్రా! ఏదీ?"

వెంటనే ప్రతాపరుద్రుడు అశ్వముప్రక్కను గజము ప్రక్కను గ్రుచ్చబడి యున్న రెండు కొయ్యకత్తులు తీసికొని యందులో నొకటి యన్నమంత్రి నేరుకొమ్మనెను. అన్నమంత్రి యందులో కొంచెము గట్టి తక్కువగా నున్నది తీసికొనుచుండగా, 'అది మంచిది కాదు. ఇది తీసికొండు, రండు!' అని ప్రతాపరుద్రుడు బలవంతముగా మంచిది అన్నమంత్రి కిచ్చి రెండవది తాను కొని కత్తిపోరుకు రెమ్మనెను.

అన్నమంత్రి నవ్వుచు 'డాలులేని కత్తిపోరేమిటి?' అనగా 'ఇప్పుడు తప్పించుకొనక రండి! డాలు అక్కరలేదులెండి!' అని ప్రతాపరుద్రుడు తొందరచేసెను. అన్నయ యా కత్తి చేకొని చిరునవ్వు నవ్వుచు నిలుచుండెను.

ప్రతాపరుద్రుడు తన కత్తితో దురుసుగా అన్నయపై విజృంభించెను. అన్నయ సంతోషముతో నా బాలుని కత్తిదెబ్బలు తన కత్తితో నెమ్మదిగా నడ్డుచుండెను. ఎంతటికిని అన్నమంత్రి నాతడు కొట్టలేక విసిగి ఒక్కసారిగా అన్నమంత్రిమీదికి కవిసి యాతని ఘట్టుకొన కుప్పించెను. మంత్రీశ్వరుడు ప్రేమాతిశయముతో వచ్చుచున్న యా బాలుని చేతులలో నెత్తుకొనెను. కాని బాలుడు పోరు చాలింపక కాలు చేతుల నన్నమంత్రిని కుమ్మసాగెను.

అంబదేవుడును, అన్నమంత్రియు నొక్కసారిగా "వీరికి మహాదేవరాజుల తొందరయంతయు వచ్చినది!" అనగా రుద్రమదేవి విరిసిన ముఖముతో, "అంతే కాదు! మంత్రీశ్వరుల నట్లు పట్టుకొని కొట్టవచ్చునా? వారికి నమస్కరించు!" అనెను.

రుద్రమ యట్లనువరకు నాతడు అన్నమంత్రిని పట్టినపట్టు వదలలేదు. రుద్రమమాటలు విన్నంతనే యా బాలుడు పోరు చాలించి 'దెబ్బ తగిలినదా?' యని యన్నమంత్రిని పరామర్శ చేయుచు నాతనికి వినీతుడై నమస్కరించెను. ఆ నమస్కరించుటలో నాతడు చూపిన ఠీవికి అందరు ముగ్ధులైరి.

"చిరంజీవ! ఆయుష్మాన్!" అనుచు అన్నమంత్రీశ్వరుడా బాలుని దీవించెను.

అంతట రుద్రమదేవి నెమ్మదిగా ప్రతాపరుద్రదేవులను పంపివేసి మంత్రీశ్వరులతో నితరప్రసంగములలోనికి దిగి కొంతసేపు గడపెను. అంతట నామె వారి నిట్లు ప్రశ్నించెను.

"మేము మా సామంతులలో ఒకొనొకరికి అశోకపుష్పములు పంపగా అత డవి గ్రహించి కేతకీపుష్పములు పంపినాడు. అందులో నంతరార్థ మేమో మంత్రీశ్వరులు తెలుపగలరా?"

తిక్కచమూపతియు అన్నమంత్రియు అంబదేవుడును ఒకరి ముఖము లొకరు చూచుకొనిరి.

'అట్లు చేసిన సామంతు డెవడై యుండును?' అనియే వారి మనస్సులలోని ప్రశ్న. కాని ఎట్లడుగగలరు? ఇంకను కతమవు వారు మౌనము వహించిరి. రుయ్యమశరీరము కంపించుచున్నదా? ఎందుకు?

మరల రుద్రమయే నిష్కంపముగా ప్రశ్నించెను.

"కేతకీపుష్పము పూజకు వినియోగింపదగినదేనా ?"

అన్నమంత్రి : "అది శివశాపదూషిత మైనదిగదా ?"

తిక్కచమూపతి : "మీ కా సామంతు డంపిన కేతకీపుష్పములను మేము చూడవచ్చునా ?"

"అవశ్యము !"అనుచు రుద్రమదేవి పలికెను. రుయ్యమ ద్వారమునొద్దకు బోయి సంజ్ఞ చేయగా నొక బంగారుపళ్లెరము గొని కుబ్జ యచ్చటికి వచ్చెను. అందులో మహాలయామావాస్యనాడు వీరభద్రేశ్వరుడు పంపిన మొగలిపూవు లుండెను. ఆ మొగలిపూవులపై రంపములవలె నున్న యాచ్ఛాదనపత్రము లట్లే యున్నవి.

మొగలిపూవులు శీఘ్రముగా వాడిపోవు. ఐనను పదునారుదినములకు వాడుముఖము చూపుటే కాక ఎండుటకూడ ప్రారంభించును గదా ! అవి క్రొత్తగా పంపినవి కావని యందరు ఎరిగికొనినంత వారికి మనస్సులలో కొంత బరువు తీరిన ట్లయ్యెను. ఆ పూవులపైగల రంపములవంటి పైరేకులే వారియందరి దృష్టుల నాకర్షించెను.

"ఇవి పంపుట మహారాజులకు ఏక్కలి యనుజ్ఞ చేయుట ! రంపమునే స్ఫురింపజేయుచున్నవిగదా ఇవి!" అని అంబదేవుడు నిష్కర్షగా వచించెను.

ఆ పుష్పములను అన్నమంత్రీశ్వరుడు కన్నులతో దూరమునుండి, లెక్కించుచుండెను. కాని వానిలో నవి యడ్డుండుటచే సాధ్యము కాకుండెను. రుయ్యమ తల వంచుకొనియే యుండి యది సూక్ష్మముగా గ్రహించి యా పళ్లెరమును సమీపించి, 'అమ్మా, ఇవి యెన్ని ఉన్నవి ?"అని లెక్కింపసాగెను.

రుయ్యమకుశాగ్రబుద్ధికి అన్నమంత్రి రిచ్చవడి యామెవంక తేరిపార మాచుచుండునంతలోనె రుయ్యమ లెక్కించుట పూర్తి చేసి 'పది!'యనెను.

"దశదిశలనుండి యీ రంపములు ప్రయోగింపబడు ననికూడ, సంకేతార్థ ముండునా?"అని బిగ్గరగా అన్నమంత్రి యోచించుచున్నవానివలె పలికెను.

రుయ్యమయు రుద్రమయు నొకరివంక నొకరు చూచుకొనిరి. "మంత్రీశ్వరులముందు ఈవిషయము ప్రస్తావింపవలెనా యని ముందు మేము వెనుకాడితిమి. ఇప్పుడొక విశేషము స్ఫురించినది. దశదిశలు, దశదిశలు!—"అనుచు రుద్రమ యాలోచనలో మునిగిపోయెను.

అంబదేవుడు : "శత్రువులు సేనలతో ఎనిమిదిదిక్కులనుండి రావచ్చును. భూగర్భమునుండి యాకాశమునుండి కూడ కృత్యాప్రయోగములచే శత్రువులు సాధించుటకు ప్రయత్నింపవచ్చును."

అప్పటికే రుద్రమదేవి విజయదశమినాటి రాత్రి తనకు వచ్చిన పీడ కలయు వీరభద్రేశ్వరుని యంధకారమయమూర్తి ప్రత్యక్షమగుటయు తలపున బార నదియే ధ్యానించుచుండెను.

"ఆ సామంతునకు అశోకములు మీ రేల పంపవలసివచ్చెనో అడుగవచ్చునా ?"

ఇట్లు అన్నమంత్రి ప్రశ్నింపగా రుద్రమ ధ్యానభంగమై కలలోనుండి మేల్కాంచినట్లు, "అవును. మా సామంతులకు మేము అశోక మర్థింతుముగదా!—వారు మమ్ము రంపములతో దశదిశలనుండి కోయ నుద్యమింతురు కాబోలును!"

అంబదేవుడు వీరావేశముతో పలికెను.

"అట్టి సామంతుని గృహమంతయు నశోకపుష్పములతో నిండియున్నను అతనికి శోకము దూరము కానేరదు !"

తిక్కచమూపతి మొదలనే యా సామంతుడు వీరభద్రేశ్వరుడని యూహించియుండుటచే నా సంభాషణలో ఎక్కువ కలిగించుకొన వెనుకాడెను.

అట్టి సమయమున మేచయనాయకులు మహారాజదర్శనమపేక్షించుచున్నారని కుబ్జ వచ్చి నివేదించెను. వెంటనే ప్రవేశపెట్ట రుద్రమ యాజ్ఞాపించెను.

మేచయనాయకుడు వందనాదిక మైనపిమ్మట కొన్ని పత్రములు శ్రీరుద్రదేవమహారాజుల పాదపీఠముందున పళ్లెరమున నుంచి వినీతుడై నిలుచుండెను.

ఆపత్రము లొకటొకటే రుద్రమదేవి చదువుకొనుచుండెను. చదివినకొలది యామెముఖము వివర్ణము కాజొచ్చెను. ముందు ఆశ్చర్యము పిమ్మట కోపము తర్వాత చెప్పలేని ఆందోళన వరుసగా చూచినవారికి వ్యక్తమయ్యెను. హృదయకుహరములో నెక్కడనో ఆగియున్న పరస్పరవిరుద్ధభావము లెన్నియో దాగక ఆమెముఖమున తాండవింపజొచ్చెను. మహారాజుహృదయగతభావము లట్లు ముఖమున బింబించుట యరుదు !

"నా విధులు తృప్తిగా నిర్వర్తించుటకు నాకు విశేషాధికారములు కావలెనని మనవిచేయుచున్నాను !" రుద్రమ పత్రములు చూచుట పూర్తియైనంతనే మేచయనాయకుడీ విన్నపము చేసికొనెను.

రుద్రమ దీర్ఘాలోచనము చేయుచు మాటాడలేదు. కొంతసేపు నిరీక్షించి మేచయ మరల నర్థించెను.

"రాజ్యములో నెంతటివారి నైనను బంధించు ననుజ్ఞ నాకు కావలెను. మహామంత్రుల నైనను బంధించు నధికారము దయచేయవలెనని విన్నవింతును !"

రుద్రమ : "తగిన కారణములు నిరూపించినచో మే మట్టి యనుజ్ఞ యీయమని ఏల సందేహింపవలసివచ్చినది ?"

మేచయ : "అట్లయినచో, ఆ పత్రములు చూచితిరిగదా ! అన్నమంత్రీశ్వరులను ఇప్పుడే బంధింప ననుజ్ఞ యర్థించుచున్నాను".

అంబదేవుడును తిక్కచమూపతియు నిర్ఘాంతపోయిరి. అన్నమంత్రీశ్వరుడు చలింపలేదు. ఆయన కది చమత్కారముగా తోచెను.

రుయ్యమ కాళ్లు నిలువక కూరుచుండెను.

అంతలో రుద్రమదేవి యిట్లనెను.

"మేము మేచయనాయకుల నిశ్చయముతో నేకీభవింపలేకున్నాము. ఈ పత్రములలో సంశయకారణము లున్నవి. కాని నిస్సందేహముగా నేరము నిర్ధారణచేయ నాధారము కనపడదు. ఈ పత్రము లన్నియు శత్రుకల్పితము లై యుండవచ్చును. మా కుటుంబమునందు వంశపారంపర్యముగా వారు చూపిన విశ్వాసమును ఇవి చలింపజేయలేవు !"

ఆ మాటలు విని ఎవరును మాటాడలేదు. అన్నమంత్రికూడ కొంచెము ఆశ్చర్యపడెనుగాని తన్నుగూర్చిన సందేహముగాన అందులో జోక్యము కలిగించుకొనుట యుక్తము కాదని మిన్నకుండెను. మేచయనాయకుడు ఎంతమాత్రమును తన నిశ్చయము మార్చుకొన్నట్లు లేదు.

నెమ్మదిగా నాపత్రములు రుద్రమదేవి మేచయ కిచ్చి అన్న

మంత్రి కిమ్మన నాతఁ డట్లొనర్చెను. ద్రోహికి ద్రోహనిరూపణచేయు పత్రములే మహారాజు లిమ్మన నతఁ డేమి చేయగలఁడు?

అన్నమంత్రి యాపత్రములు పరిశీలించుచుండెను. అట్లాతఁడు చూచుచుండగా నాతని ముఖలక్షణములు రుద్రమ శ్రద్ధతో గమనించుచుండెను. మేచయ నిశ్చలుఁడై నిలుచుండి దోషిని చూచువిధముగా అన్నయవంక చూచుచుండెను.

అన్నమంత్రి పత్రములు కొన్ని మరలమరల పరిశీలించెను. కొన్ని వెనుకకు ముందుకు త్రిప్పి చూచెను. నిదానముగా యోచించెను. మరల నవి మేచయనాయకున కిచ్చివేసెను.

రుద్రమదేవి యడిగెను: "అన్నమంత్రీశ్వరులు అన్నియు చూచితిరిగదా, ఏమందురు?"

అన్నమంత్రి: "ఆ పత్రములు ఎక్కువభాగము కల్పితములు. సత్యమైన పత్రములును కొన్ని గలవు. వానికి అసత్యపత్రములతో కలిపి చదువనియెడల సదర్థమే యుండును. ఐనను నేనును మేచయనాయకుల యభిమతముతో నేకీభవింతును!"

ఆ మాటలకు మేచయనాయకుఁడే యులికిపడెను. అతఁడు దూరమాలోచింపనిది నిశ్చయింపఁడు. ఆ మాటలతో నాతనికే తన నిశ్చయములో పొరబడియుంటినా యను సంశయము ఉదయించెను.

తిక్కచమూపతియు అంబదేవుఁడును ఏమియు దోపక అయోమయస్థితిలో పడిపోవుచుండిరి.

రుయ్యమకుండలు దడదడలాడుచుండెను. ఆమెకన్నులు తిరిగియే పోవుచున్నవి. రుద్రమవంకగాని అన్నదేవునివంకగాని యామె చూడలేక స్వయంభూతేశ్వరుని ఆలయశిఖరముపై నున్న కనకకలశమును తిలకించుచుండెను.

రుద్రమ యడిగెను. "అన్నమంత్రీశ్వరుల యభిప్రాయము వివరింతురా?"

అన్నమంత్రి స్పష్టముచేసెను.

"నాకున్న యధికారము కలవానిపై నింత తీవ్రమగు సందేహమున్నపుడు అది తీరనిది అధికారపదవిలో నుంచుట రాజనీతివిరుద్ధము. ఒక ద్రోహి కారాగారమునుండి మోసముగా తప్పించుకొనిపోవుటకు మా కార్యాలయమునుండి పత్రములు వెళ్ళినట్లు కనబడుచున్నది. మరియు మాకు నాగదేవునితోడను దేవగిరీశునితోడను ఉత్తరప్రత్యుత్తరములు జరుగుచున్నట్లు కొంత యనుమానము తోచుచున్నది. ఇవిగాక సందేహాస్పదమగు స్థితిలో నున్న మనుమగొండగోపాలుని పక్షమువారికి నేను బల మిచ్చుచున్నట్లును కనబడుచున్నది. ఇందలో చివరిదానిలో కొంత సత్యమును లేకపోలేదు.

"నాకీనాఁడు విశేషముగా రాజ్యతంత్రరహస్యములు తెలిపియున్నారు. అందుచే నన్ను స్వేచ్ఛగా నుండనిచ్చుట యుచితము కాదని నాకే తోచుచున్నది."

రుద్రమ ధీరగంభీరముగా పలికెను.

"మాకు భాసించిన భావమే అన్నమంత్రీశ్వరులును సెలవిచ్చినారు. ఈ విషయముననే కాక ముందుగూడ ఎన్నో విషయములలో అన్నమంత్రీశ్వరుల సహాయ మర్థించుచుందుము—మేచయనాయకా! అన్నమంత్రీశ్వరుల కొక ఏకాంతమందిరము రాజప్రాసాదములో చూచి సిద్ధముచేయింపుము. వారి కెట్టి యవజ్ఞయు లేకుండ రాజబంధువులకువలెనే ఏకాంతమున వారికి మర్యాదలు జరుగునట్లు చూడుము!"

మేచయనాయకుడు సెలవుతీసికొని వెడలిపోయెను.

రుద్రమదేవి అన్నమంత్రీశ్వరుని సంబోధించి యడిగెను.

"మీ రచ్చట నెంతకాల ముండవలెనో! ప్రొద్దుపుచ్చుటకు మీ కెట్టి ఏర్పాట్లు కావలెను?"

అన్నమంత్రీశ్వరు డాలోచించుకొనలేదు. వెంటనే యుత్తరమిచ్చెను.

"నాకీ యధికారపదవిలో వేదవేదాంతచింత చేయు వ్యవధి లేకపోయినది. చతుర్వేదపారగు లగు నలుగురు విప్రులను నాయొద్దకు వచ్చుచు బోవుచుండ ననుజ్ఞ యిచ్చినచో కృతార్థుఁడ నగుదును!"

రుద్రమ: "మంచిది తప్పక యట్లే చేసెదము. ఇంకేమైన నర్థింతురా?"

అన్నమంత్రి: "ఉన్నది. నామీద కలిగిన సందేహము తిక్కన సోమయాజుల కెట్టి స్వేచ్ఛాభంగమును కలిగింపకుండునుగాక!"

రుద్రమదేవి యడిగెను. "తిక్కనసోమయాజుల సంగతి ఈ పత్రములలో జూచినాము. వారి విషయము తెలిగింతురా?"

అన్నమంత్రి: "వారు మాకు దూరబంధువులు, మనుమగొండ గోపాలునియొద్ద చాలకాలము మంత్రీశ్వరులుగా నుండిరి. మహాకవీశ్వరులు. నన్నయభట్టారకులు వ్రాయక వదలిన మహాభారతగ్రంథమును ఆంధ్రావనిమోదముం బొరయ జగద్ధితముగా నాంధ్రీకరించుచున్నారు. వా రేదో కార్యసిద్ధి యర్థించి మన రాజధానికి దయచేసియున్నారు. మనుమగండగోపాలునిపై రాజానుగ్రహము ప్రసరింపఁజేయు నిచ్చ వారి కుండి యుండవచ్చును. వారి కా చలచిత్తునిపై అపారవాత్సల్యమున్నది. వారే బ్రాహ్మణులకు కరణవిద్య నేర్పు పాఠశాల ప్రారంభించు నిచ్ఛకు మూలకారణులు!"

రుద్రమ: "అన్నమంత్రీశ్వరా, రాజధర్మ మెంత కఠినమైనదో మాకు ఒకదానితర్వాత నొకటి యీ ఐదారుదినములలోననే నిరూపించుచున్నవి. అభిషేకమైనవెంటనే మేము పంపిన మొదటియాజ్ఞ శ్రీవీరభద్రేశ్వరుల బంధించుటకే. మరల మిమ్మీనాఁడు నిర్బంధములో నుంచవలసివచ్చినది. మీ ఇచ్ఛానుసారము తిక్కనసోమయాజులకు ఈ నగరమున సర్వస్వాతంత్ర్య మీయ కట్టడిచేయుదుము."

అన్నమంత్రీశ్వరుడు "ధన్యోస్మి" యనెను. రుద్రమదేవి రుయ్యమునైపు చూడలేకపోయెను. అంబదేవునివంకను తిక్కచమూపతి వంకను గూడ చూడలేకపోయెను.

రుద్రమకన్నులు చెమ్మగిల్లుచున్నవో ఏమో, ముఖమావలకు చప్పున త్రిప్పుకొనెను.

మనస్సులో కలతకీ మెడలో నెప్పికీ దగ్గర సంబంధం

(12 వ-పేజీ తరువాయి)

గురించి తాపత్రయపడేవాళ్లు రెండోతరహా. ఇంట్లోగొడవలకోసం ప్రయాసపడతారు. వృత్తికోసం ప్రయాసపడతారు. ఏదీ దొరక్కపోతే పొరుగింటిపుల్లయ్యకోసం బాధపడతారు. వాడు తనపట్ల అల్లా ఎందుకు ప్రవర్తిస్తాడు? వాడంటే ఆవల్లయ్య అంత అల్లా పడి ఛస్తాడేం? ఈమాదిరి.

3. చిక్కుల్లోపడ్డంవల్ల మనశ్శాంతి పోగొట్టుకునేవాళ్లు మూడోతరహా. వీరికి దివాలా, తాకట్లు, గృహచ్ఛిద్రాలు మొదలైనవి హేతువులవుతాయి. అయితే ఈ తరహా మనుషులికి వచ్చే జబ్బుల్ని సులువుగా కుదర్చవచ్చు.

అసలు మనోవైకల్యంవల్ల శరీరబాధలెలా పుడతాయి? ఆలోచించడం అంటే ఏమిటో అర్థంచేసుకుంటే ఇది కొంత బోధపడుతుంది. ఆలోచన అనేది కేవలం మెదడుకి సంబంధించినదే ననుకోడం పొరపాటు. శరీరమంతా వ్యాపించి ఉన్న నరాలన్నిటికీ సంబంధించినది ఆలోచన. ఈనరాలకి కేంద్రం మెదడు. ఒక్కొక్క ఆవేగానికి ముఖవర్ణం మారిపోతుంది. తెల్లపోవడం ముఖం మాడిపోవడం మనకి తెలుసు.

ఉద్రేకాలలో అందరికీ అతిసామాన్యంగా తెలిసివచ్చేది కోపం. ఒక మనిషికి కోపంవచ్చినప్పుడు ముఖం తెల్లబడుతుంది. లేదా ఎర్రబడుతుంది. కళ్లు పెద్దవిచేస్తాడు. కండరాలు బిగపడతాడు. వొణుకుకూడా పుట్టుతుంది మనస్సులో మార్పు ఈవిధంగా శరీరంలో పొక్కుతుంది.

తత్తరపాటు మరొక ఉద్రేకం. దీనివల్ల ముఖం తెల్లబడవచ్చు ఎర్రబడవచ్చు. అంతమాత్రానికి ఆ మనిషికి చర్మరోగం ఉందనుకోము. తత్తరపాటువల్ల ముఖంలోని రక్తనాళాలు పొంగుతాయి.

కొందరికి నెత్తురు చూసేసరికి వాంతులవుతాయి. కొందరికి స్మృతిప్పుతుంది. నెత్తురు చూడగానే కడుపులో దేవినట్లయితే వాంతులొస్తాయి. నెత్తురు వేడెక్కి ప్రవాహవేగం అధికమైతే అది మెదడుకి మైకం కలిగిస్తుంది.

అయితే మనోవైకల్యంవల్ల జబ్బులెల్లా సంభవిస్తాయి?

ఉద్రేకం అధికమయినప్పుడు కండరాలు బిగుసుకుంటాయి. రోజుపొడుగునా ఉద్రేకం తగ్గలేదనుకోండి, కండరాల బిగువెక్కువౌతుంది. మామూలుగా గుప్పిడి బిగపట్టి విడుస్తే నెప్పి కలగదు. కాని చాలసేపు వదులు చెయ్యకుండా గుప్పిడి బిగబట్టే ఉంచితే నెప్పి పుడుతుంది.

ఉద్రేకంవల్ల కండరాలు బిగువైతే ముందుగా నెప్పికలిగేది మెడవెనుకకండరాలకి. తరవాత కంఠనాళానికి. అప్పుడు గుటకపడ్డం కష్టమనిపిస్తుంది. కడుపులో కండరాలుకూడా సులువుగా నెప్పి పుడతాయి. అప్పుడు కడుపులో పెద్దబరువు దిగినట్లు బాధపడతారు. బిగుతు మరీ ఎక్కువైతే రణం ఎంత బాధపెడుతుందో కడుపులో నరాలంత బాధపెడతాయి. మావూళ్లో ఒక షావుకారు కడుపులో నొప్పితో బాధపడుతుంటాడు. కడుపులో రణం ఉందనుకునేవారు. వ్యాపారంలో పోటీకీ ఇంట్లో గయ్యాళిభార్యపోరుకీ తట్టుకోలేక మనస్సు కలతవల్ల బాధపడేవాడు. కడుపులో నెప్పివల్ల నిత్యమూ బాధపడేవాడు. రణమేమీ లేదని డాక్టరు చెప్పినా అతను నమ్మడు. ఊరువిడిచి బంధువుల్ని కాని స్నేహితుల్ని కాని చూడ్డానికి వెళ్లినప్పుడల్లా బాధపోయేది. తిరిగి ఇంటికివచ్చేసరికి బాధ తయారయ్యేది.

ఈమాదిరి నెప్పి పెద్దపేగుల్లో ఎక్కడైనా సంభవించడంకద్దు. చాలామంది పైత్యకోశం నెప్పిపెడుతోందనుకుని భాధపడతారు. నిజానికి ఉద్రేకంవల్ల తిత్తి ముడుచుకుని నెప్పిపెడుతుంది అంతే. అయితే నెప్పి ఉంది. లేదనడంలేదు. పెద్దపేగులో నెప్పి ఒక్కొక్కప్పుడు ఉబ్బు అనిపిస్తుంది. అప్పుడు డాక్టర్లకి చూపిస్తే ఆపరేషన్ చెయ్యక్కర్లేదని గ్రహించుకునేవాళ్లు బహుకొద్దిమంది ఉంటారు.

అనేకమంది తలనెప్పి పార్శ్వపునెప్పిలవల్ల బాధపడతారు. కేవలం ఉద్రేకంవల్ల శిరస్సులో ఎక్కడో కొన్ని రక్తనాళాలు పొంగివచ్చేదే ఆబాధ. చర్మవ్యాధులవల్ల బాధపడేవారిలో మూడోవంతుమందికి ఉద్రేకంవల్ల వచ్చినవే. మనస్తాపం ఉద్రేకాలవల్ల చర్మంవద్ద రక్తనాళాలు పొంగి ఈ వ్యాధులకు చర్మం లొంగిపోతోంది. ఉద్రేకం కలిగినప్పుడల్లా రసిపొంగిరక్తనాళాలద్వారా చింది చర్మంలోకి ప్రవేశిస్తుంది. అట్టలు కట్టిన రసితో చర్మం మందమెక్కుతుంది. చివరికి చర్మంపైకి చొచ్చుకువచ్చి పొలుసులవలె పేరుకుంటుంది. ఆపైనదురద, పుండు వగైరా.

కండరాల బిగువుకి త్వరగా లోబడేవి రొమ్ములో పైన ఎడమభాగం. కుడివైపు నెప్పి పుట్టితే ఎవరూ అంతగా ఖంగారుపడరు. ఎడమవైపునైతే డాక్టర్లదగ్గిరికి పరుగులెడతారు. గుండెజబ్బేమోనని భయం. ఎప్పుడూ గుండెవైపు వెతుకుతుంటారు. ఆ అనుమానం నతుక్కోడమే చాలు నిజంగా నెప్పిపుట్టడానికి.

మనోవైకల్యంవల్ల కలిగే శారీరకబాధల్లో కండరాల బిగుతువల్ల సంభవించే తరహాకాక ఇంకా కొన్ని రకాలున్నాయి. గర్భకోశంలో కొన్ని తిత్తులుకూడా ఉద్రేకంవల్ల నెప్పి కలిగిస్తాయి. కారు వేగంగా పరిగెడుతుంది. అకస్మాత్తుగా ఒకడు దారిలో కనిపిస్తాడు. ఉలిక్కిపడి పక్కకి పరుగెడతాడు. కారులో కూచున్నవాళ్లకి ఒక్కక్షణం ఊపిరి ఆగిపోతుంది. గుండెలు దడదడమంటాయి. అధికభయంవల్ల అకస్మాత్సంఘటనవల్ల శరీరం బిగుసుకుపోతుంది. కడుపులో బిగుతువల్ల తిత్తులు అధికంగా రసోత్పత్తి చేస్తాయి. ఆ రసం నెత్తురులో చేరి హృదయం చేరగానే గుండెలో నెప్పి ఆరంభమౌతుంది. ఊపిరితిత్తుల్ని కలిపే మెదడు నరాలు నెప్పిపెడతాయి. ఆయాసం ఆరంభమౌతుంది.

శరీరంలో ఎక్కడైనా ఏఅంగం దుర్బలంగా ఉన్నప్పటికీ, మనోవైకల్యంవల్ల అక్కడ బాధ ఆరంభమౌతుంది. ఉద్రేకం వచ్చినప్పుడల్లా గుండె దడదడ నెప్పికలిగితే అది ప్రమాదకరం. ఈ గుండెనీరసం ఉన్న ఒక పెద్దమనిషి ఇలా అన్నాడు. "నాకు గట్టిగా కోపం తెప్పించేవాడు హంతకుడన్నమాటే."

మనలో చాలామందికి ఈ దౌర్బల్యం ఉంటుంది. చుట్టూ చాలామంది అటువంటి మనుషులే కనిపిస్తారు. పల్లెటూళ్లలో మరీ

అధికం. ఆస్పత్రిలో ఉండేవారిలో చాలా మంది ఇటువంటివాళ్ళే. అనేకమంది ఈ దౌర్బల్యంవల్లనే మంచంపట్టి ఉన్నారు. ఈ జబ్బులికి బలికాకుండా ఉండాలంటే మన ఆలోచనావిధానాన్ని సక్రమమార్గంలో పెట్టుకోవాలి. నిజానికి స్కూళ్ళలోనూ కాలేజీల్లోనూ జీవనం ఒకకళ అని నేర్పాలి. మన భావన అభిప్రాయాలు మితిమీరకుండా ఉద్రేకానికి లొంగిపోకుండా జీవనాన్ని స్థిరంగా ప్రశాంతంగా నడపాలని నేర్పాలి. సాధ్యమైనంతవరకు ఉత్సాహపూరితంగా సంతోషమయంగా జీవితాన్ని గడపడం నేర్చుకోవాలి. జీవితంలోని ఎగుడుదిగుళ్ళకి లొంగిపోకుండా సహనంతో స్థైర్యం అలవర్చుకోవాలి.

ఒక వంకకష్టాలు ముసిరివస్తుంటే కేవలం నవ్వుతూఉండండి అని చెప్పడంలేదు కాని ఈ క్రింది విషయాల్ని గమనించవచ్చును.

ఎప్పుడూ స్వంత యోచనల్ని శల్య పరీక్ష చేస్తూ కూచోకూడదు. వచ్చే చిక్కుల్ని గురించే నిత్యం యోచిస్తూ కూచోడం అనవసరం.

చేసేపని, నిత్యవృత్తి అంటే ఆపేక్ష శ్రద్ధ అలవర్చుకోవాలి. లోకంలో నలుగురితోపాటయినా ఎన్నికవాలంటే అదివృత్తి పైనా వృత్తి నిర్వహించేవిధానంపైనా ఆధారపడిఉంటుంది. ప్రీతితో నిర్వహిస్తే కర్తవ్యం భారమనిపించదు. అది బరువనుకుంటే సత్తువ క్షీణించిపోతుంది.

వృత్తివేకాక అన్యత్రా ఏదో వ్యాపకం పెట్టుకోడం మంచిది. నిత్యకర్తవ్యంలో విసుగెత్తినట్లయితే, ఆ భారాన్ని వదలించెయ్యడానికి అన్యవ్యాపకాలు అవసరం. వృత్తితో సంబంధించని మిత్రుల్ని, గృహ సమస్యలతో సంబంధించని బంధువుల్ని తరుచుకలుసుకుని కొంతకాలంగడపడంఅవసరం.

మనం సంభాషించే వ్యక్తుల్ని, చూసే వ్యక్తుల్ని సాదర సౌజన్యాలతో పరిగణించడం మంచిది.

ద్వేషాలు క్రోధాలు తప్పకుండా అనారోగ్యానికీ, శారీరకబాధలకీ దారితీస్తాయి. నా మిత్రుడొకడు తనకు పడని ఆఫీసరుకింద పనిచెయ్యవలసి వచ్చింది. ఆ ఆఫీసరేది చేసినా నా మిత్రుడు కటగించుకునేవాడు. "ఆ క్రాపు చూడు ఎలా దువ్వుతాడో చేతకానివాజమ్మ ఈల పాటపాడకుండా ఉండలేడుకాబోలు. పెత్తనం ఒలకబోస్తూ 'ఇలా చూడు' అని సలహాలివ్వడం ఆరంభిస్తాడు నాకు." నిజానికి ఇతనికి చాలా మందిని చూస్తే నచ్చదు. తల్లితోనూ తండ్రితోనూ. అన్నదమ్ముల్తోనూ తగువులు పెట్టుకున్నాడు. ఇప్పుడు ఆస్పత్రిలో ఉన్నాడు. అతని జబ్బుకి కారణం అతని స్వభావమేనని నాకు తెలుసును. అందర్నీ అసహ్యించుకోడం ఆరంభిస్తే జీవితం నరకప్రాయమౌతుంది. తెల్లవారిలేస్తే నలుగురితోనూ తిరక్క తప్పదు. నలుగురితోనూ మాట్లాడక తప్పదు. అందువల్ల అసహ్యం మానడం అవసరం.

మనం మార్చలేని పరిస్థితులికి వగచి లాభంలేదు. మా వ్యాళ్లో ఒకడికి తాననన్న ఇల్లంటే గిట్టదు. పిల్లలు అల్లరిచేస్తే కోపం. భార్యనమ్రతవల్ల ఆతనికి తిక్క. ఏవో పెద్దకోరికలు మనస్సులో పెట్టుకున్నాడు. అవి తీరలేదు. అందువల్ల అతనికి తన సంసారమన్నా, స్నేహితులన్నా, బంధువులన్నా, ఇల్లన్నా, ఊరన్నా అసహ్యం కోపం. అదృష్టవశాత్తు అతనే క్రమంగా అన్యవ్యాపకాలు అలవరుచుకున్నాడు. ఇప్పుడంతగా తనకు ఇష్టంలేని విషయాల్ని పట్టించుకోడు. ఇంటితలుపులు పైకప్పు, చూసి విసుక్కోడు. అసలు అటు చూడనే చూడ్డం మానేశాడు. క్రమంగా అతని అనారోగ్యం కుదిరిపోయింది. ఉన్న దుస్థితికి విచారించడంకంటే దాన్ని మరిచిపోయి ఉన్నదానిలోనే మేలు చూసుకుని తృప్తిపడ్డం నేర్చుకున్నాడు.

పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు ఉత్సాహంతో పరిష్కరించడానికి పూనుకోవాలి. చేస్తున్న కృషికి సత్ఫలితాలు కలక్కపోగా విపరీతఫలితాలు సంభవిస్తే ఇదేమని విచారించడం వ్యర్థం. మార్గాంతరాలు అన్వేషించాలి. ఒకచోట పరాజయంపొందితే మరొకచోటైనా విజయం రాకపోదు. ఎప్పుడూ ఉత్సాహంగా సుముఖభావంతో వర్తించడం లాభదాయకం, మన సమస్యల్ని పరిష్కరించడానికి స్థిరచిత్తం అవసరం. తక్షణనిర్ణయాలు అవసరం. జాప్యంవల్లా, సందేహమనస్కతవల్లా అందబోయే ఫలంకూడా వెనక్కి మళ్లుతుంది. ఒకసమస్య ఉత్పన్నమైనప్పుడు ఏమిచెయ్యాలో సాధ్యమైనంతత్వరలో నిర్ణయానికి రావాలి. ఇంక ఆ తరవాత అది అమలుజరపడానికే మనస్సు లగ్నపరచాలి కాని మళ్లీ మళ్లీ ఆలోచించడం దౌర్బల్య లక్షణం. జీవితంలో సౌఖ్య సాధనకి యోచనావిధానమే పరికరం. మనస్సుని కలతలకి లొంగనిస్తే మెదడులో నరాలు మళ్లు పడిపోతాయి.

ఈనాడు కాంగ్రెస్ పరిస్థితి

(10-వ పేజీ తరువాయి)

నిస్తూ, అపహాస్యంచేయటం పరిపాటవుతోంది. అవినీతికి, మోసానికి, స్వార్థానికి ఖద్దరు చిహ్నమయింది. గాంధీజీ నిజశిష్యులు నెహ్రూ, పటేల్, ప్రసాద్ ప్రభృతులు కాంగ్రెసువారు ఎవరూ కూడా ఇంక ఖద్దరు ధరించనక్కర్లేదనే నిబంధన పెట్టటంమంచిది. ఖద్దరుగౌరవాన్ని నిలబెట్టడానికి కప్పుడు వీలుపడుతుందేమో.

ఖద్దరును స్వదేశీ, కుటీరపరిశ్రమగానే గాంధీజీ ఎంచలేదు. అవినీతి, పీడన పరాధీనతలనుంచి నైతికంగా ముక్తిపొందిన స్వచ్ఛజీవనవిధానం ఖద్దరు అని గాంధీజీ ఆదేశించారు. స్వచ్ఛజీవనం లేనప్పుడు, స్వచ్ఛమైన వస్త్రం మాలిన్యాన్ని కప్పిపుచ్చలేదు.

1946 లో ఎన్నుకోబడిన శాసనసభా సభ్యుల్లో 100 కి 90 మంది మళ్లీ నియోజకవర్గాలను మర్యాదకైనా చూసిన పాపానపోలేదు. కాంగ్రెసే దేశానికిమోక్షం, కాబట్టి అంతా కాంగ్రెసునే బలపరచాలి. అని నాయకులు హెచ్చరిస్తున్నారు.

కాని నానాటికీ సంస్థలో తీవ్రంగా వృద్ధిచెందుతున్న అంతఃకలహాలు, స్వార్థం, అవినీతి, అక్రమధనార్జన, అసత్యం వీటిని నిర్మూలించనిదే, కాంగ్రెసును దేశం అనుసరించి ప్రయోజనం లేదు. పైన పేర్కొన్న మాలిన్యాన్ని క్షాళనం చేసుకోనిదే, కాంగ్రెసుకు పూర్వగౌరవప్రతిష్ఠలు మళ్లీ దక్కవు. కాంగ్రెసువారు తమ సంస్థను త్వరలో సంస్కరించుకొని, అవినీతిని నిర్మూలించి, మళ్లీ నీతియుక్తంగా పనిచేయునంతకాలం, వీరు దేశాన్ని బాగుచేయలేరు. ముందు తమ పార్టీని లోపరహితంగా తీర్చిదిద్దుకొంటేనే, భవిష్యత్ - నాయకత్వాని కర్హులు కాగలరు. కాని కాంగ్రెసు పునరుద్ధరింపబడటమనేది సాధ్యమా? కృపాలినీ, రాజేంద్రప్రసాద్, పట్టాభి రామస్వామి పక్షులై సాధించలేనిది ముందుముందుకు సాధ్యమౌతుందా?

పచ్చబంగి

(18 వ. పేజీ తరువాయి)

నది. తక్కినవాళ్లంతా చిరునామాదారుడు లేకపోయినా ఎవరికో ఒకరికి యిచ్చివేసి వాళ్ల పనిని త్వరలో ముగించుకున్నారు. కాని తాను వాళ్లవలె సుభావంగా బంగీ యిచ్చివేసి రావటముగాని, లేక యింకెవరి కయినా యివ్వటముగాని చేయదలచుకో లేదు. తాను వచ్చినది నాయకులకు వీరావేశము కలిగించటానికీ-ఉద్రేకము కలిగించటానికీను. ఆవిషయములో ముందు వెనకలు చూడదలచుకో లేదు. ఆమె తనధోరణిని ఏమాత్రమూ తగ్గించుకోకుండా "వస్తే ఈ క్షణములో బయటికిరండి. లేకపోతే యిందులో ఉన్నవిధరించండి." అంటూ చెమర్చిన ముఖమును మరొకసారి చేతిగుడ్డతో అద్దుకొన్నది.

యువకునికి నవ్వాగటమే లేదు!

"చీరె గాజులు ధరించిన స్త్రీలు పురుషులకంటె ఏమి తక్కువ? అన్నిటిలో మిన్నగానే ఉన్నారు కదండీ" నడుమనడుమ నవ్వుతూ-ఒకొక్కమాటా అన్నాడు.

ఆమె ఈ మాటలలోని అర్థము గ్రహించే స్థితిలో లేదు!

'ఇతడెవరూ......అడ్డుప్రశ్నలు వేస్తూ తనను నిలవదీసి అడగటానికి?' కోపాగ్నితో ఆమెదేహము ఒక్కసారి భగ్గుమన్నట్లయింది.

"ఈ బంగీలో ఉన్న వస్తువులను ధరించటానికి మీరే అర్హులుగా కనబడుతున్నారు. మీరే వీటిని ధరించండి" అంటూ ఆ బంగీని ఆ యువకునిమీదికి విసరివేసి, చరచరనడచి వెళ్లిపోయింది నాగవల్లి.

ఆ యువకుని నవ్వు కారు బయలుదేరే వరకు నాగవల్లి చెవులలో రింగురింగుమంటూ ప్రతిధ్వనిస్తూనే ఉన్నది.

*　　　*　　　*

నాగవల్లి వరదరాజుకు ప్రథమపుత్రిక. కుమార్తె చదువు నిలిపివేయగానే మంచి సంబంధమొకటి చూసి వివాహము చేయవలెనని సంకల్పించాడు.

లగ్నబలము లేకనో ......కళ్యాణరేఖ బయటపడకనో...ఏసంబంధమూ నచ్చక... నచ్చినది కుదరక......రెండుసంవత్సరాలు మనస్సు స్థిమితము తప్పి విసిగి వేసారి పోయాడు.

ఒక స్నేహితుడు ఏదో పనిమీద వచ్చి వరదరాజు కోరినమీదట ఒక సంబంధము చూపించి వివరాలు తెలిపిపోయినాడు. వరుడు ఎం. ఏ. యల్. యల్. బి. ప్యాసయినాడట. రూపము చూడతగ్గదేనట. వరదరాజు వెంటనే వెళ్లి పెండ్లికుమారుని చూసి వచ్చి వధూవరుల మాపులకు ఏర్పాటు చేశాడు. వారిద్దరూ ఒకరికొకరు నచ్చినట్టుగానే ముసిముసినవ్వులు నవ్వారు. అంతా సమ్మతించారు. కొద్దిగా ఉన్న భూవసతి వరసిర్ణయానికేమీ అడ్డురాలేదు. వెంటనే జాతకాలు చూసి సిద్ధాంతులు ముహూర్తమేర్పాటుచేశారు.

సూత్రధారణ అయినతరువాత వధూవరులను లోపలికి తీసుకొనివెళ్లి ఫలహారము పెట్టున్నారు. అంతలో పెండ్లికొడుకు చెల్లెలు.

"అన్నయ్యా కళ్లజోడు తీసి యింకెంత సేపు కూర్చుంటావు? తలనొప్పి రాదూ? నేను తీసుకొనిరానా?" అంటూ అతని దగ్గరకు వచ్చి కూర్చున్నది. ఆమె అన్నకు ముద్దుచెల్లెలు కావటమువల్ల అతనిని ఒక్క క్షణమైనా ఇతరులతో మాట్లాడనియ్యదు. అన్నిటికి తానే ముందుగా సిద్ధమయ్యేది.

అతడు వధువు నొకసారి ఆపాదమస్తకమూ తిలకించి—చెల్లెలివైపు తిరిగి, 'ఇస్స్' అంటూ ముక్కుమీద వేలుపెట్టి నివారించాడు.

నాగవల్లి వరునిముఖము చూచి అర్థము కాక, తలవంచుకున్నది.

"అరుణా! నా చిన్నసంచి ఒక్కసారి తెచ్చి యిస్తావూ మంచిదానవుకదూ. ఒక్క క్షణములో తీసుకొని రావాలి." అంటూ చెల్లెలిని పంపాడు దానికోసము.

సంచిని పట్టుకొని మూడుఅంగల్లో అరుణ అన్నను చేరింది. పెండ్లికొడుకు సంచిలో ఉన్న వస్తువుతీసి వధువు చేతి కిస్తూ,

"మీరే వీటిని ధరించటానికి అర్హులంటూ నీవు ఆనాడు నాకు బహుమానము చేసిన పచ్చబంగీ యిదిగో. ఈ శుభసమయాన నేను ధరించినా...పోనీలే...ప్రేమపూర్వకముగా నీకు తిరిగి బహుమానము చేస్తాను. తీసుకో" అన్నాడు ఆమెముఖము చూస్తూ.

నాగవల్లి తెల్లబోయింది. దానిని చూడగానే ఆమెకు ముచ్చెమటలు పోసినవి.

మూడు సంవత్సరాలనాడు నాయకులకు బహుమానాలుగా పంపిన పచ్చబంగీలవి!

"మీరు...మీరు...కళ్లజోడు ధరించిన ఆ యువకులా!" అంటూ రెండుచేతులతో ముఖముదాచుకొన్నది నాగవల్లి.

ఆనాడు నిలువెల్లా ఆమెను రోషపూరితను కావించిన ఆ యువకుని నవ్వు... నేడు నాగవల్లిని నిలువెల్లా లజ్జింపచేసినది.

కాశ్మీర్ సమస్యపై భద్రతామండలి చర్చ

భారతప్రభుత్వంపై అమెరికా ఒత్తిడి

కాశ్మీరసమస్య తిరిగి ఈవారం భద్రతా మండలిలో చర్చకు వచ్చింది. అయితే మండలిలో శాశ్వతసభ్యత్వంగల రష్యాప్రతినిధి సమావేశంలో పాల్గొనలేదు. శాశ్వత సభ్యత్వంగల చీనా ప్రభుత్వం తరఫున చియాంగ్ కై షేక్ ప్రతినిధి హాజరైనాడు. చీనా సభ్యత్వ వివాదం ఇంకా ఐక్యరాజ్యసంస్థ ఉపసమితి (లిటిల్ ఎసెంబ్లి)లో పరిష్కారం కాలేదు. ప్రజాస్వామ్యనియమాల ననుసరించి చీనాసభ్యత్వాన్ని నిర్ణయించవలసిందని, అనగా సమితిలోని అధికసంఖ్యాకుల అభిప్రాయం తెలుసుకొని ఆప్రకారం నిర్ణయంచవలసిందని భారతప్రభుత్వ ప్రతినిధి చేసిన సూచనను, ప్రస్తుతానికి త్రోసివేశారు. భారతప్రభుత్వం చీనాలో ఏప్రభుత్వాన్ని గుర్తించిందో ఆప్రభుత్వప్రతినిధికి బదులు పార్మోజాలో తల దాచుకున్న ప్రభుత్వప్రతినిధి మండలిలో సభ్యుడుగా కూర్చున్నాడు. భద్రతామండలి ఏతీర్మానం చేసినా, ఏనిర్ణయానికి వచ్చినా రష్యా చీనాలు నిరాకరించితీరతాయి. భద్రతామండలి ఇప్పుడు చేసేచర్చలు వ్యర్థమే ననే అభిప్రాయం ప్రబలిపోయింది. ఈస్థితిలో మండలిని సమావేశపరిచి కాశ్మీర సమస్యను చర్చించడం వ్యర్థం. ఆంగ్లో - అమెరికన్ దేశాలవైఖరి చూస్తే భారత దేశంపై ఒత్తిడితెచ్చి ఏదోవిధంగా త్వరలో (బహుశా టిబెట్ సమస్య విషమించేలోగా) కాశ్మీరభవిష్యత్తును నిర్ణయించాలనే ఆత్రం కనిపిస్తుంది.

భద్రతామండలిపూర్వాధ్యక్షుడు కనేడియన్ ప్రతినిధి జనరల్ మెక్నాటన్ తలపెట్టిన మధ్యవర్తిత్వంకూడా విఫలమయింది. ఈ మధ్యవర్తిసూచించిన పరిష్కారవిధానం చూస్తే పాకిస్తాన్ హింసాత్మకవరాల్ని తీర్చి ఏదోవిధంగా తేల్చి పారెయ్యాలనే యత్నం కనిపిస్తుంది. కాని వారి యత్నాలు నిష్ఫలం కాక తప్పదు. కోరికలు తీరుస్తున్న కొద్దీ పెరుగుతాయి. దీనికి అంతొకటి ఉండదని గ్రహించిన భారతప్రభుత్వం నిష్ఠురంగా నిరాకరించింది.

భద్రతామండలిచర్చలో భారత ప్రతినిధి. బి. యన్. రావు, పాకిస్తాన్ ప్రతినిధి జఫ్రుల్లాఖాన్‌గార్లు తిరిగి తమ తమ వాదాల్ని ఏకరువుపెట్టారు. అన్యదేశాల ప్రతినిధు లెవరూ చర్చలో పాల్గొనలేదు. భద్రతామండలిస్థితే అసందిగ్ధంగా ఉన్నందువల్ల తమ అభిప్రాయాల్ని ప్రకటించడంవల్ల ప్రయోజనం లేకపోగా భారత పాకిస్తాన్ ప్రభుత్వాల విమర్శలకు లోను కావలసివస్తుందని కాబోలు అన్యదేశాలవారు మౌనం వహించారు.

భారతపాకిస్తాన్ ప్రభుత్వాల వాదనల్లో కొత్త ఏమీ లేదు. మెక్నాటన్ ప్రతిపాదనల్లో గల లోపాల్ని బి. యన్. రావుగారు వివరించారు. పాకిస్తాన్ ప్రభుత్వాన్ని తృప్తిపరచడంకోసం కాశ్మీర్ కమిషన్ కంటె మెక్నాటన్ మరో అడుగుముందుకు వేసినట్లు నిరూపించారు.

పాకిస్తాన్ దురాక్రమణను అరికట్టాలని భారతప్రభుత్వం చేసిన ఫిర్యాదును భద్రతా మండలి చర్చించదలచలేదన్న విషయం ఇదివరకే స్పష్టపడిపోయింది.

కాశ్మీర్ భవిష్యత్తును ఏదోవిధంగా తేల్చడమే తమ ప్రధాన కర్తవ్య మన్నట్లు భద్రతామండలిసభ్యులు భావిస్తున్నారు. భవిష్యత్తును నిర్ణయించవలసింది కాశ్మీర్ దేశవాసులేకాని అన్యులకు జోక్యం అనవసరమనీ, పాకిస్తాన్‌కు కూడా జనవాక్యనిర్ధారణ జరిగేవరకూ జోక్యం చేసుకునే అధికారం లేదనీ భారతప్రభుత్వవాదం. కాని ఈ వాదాన్ని భద్రతామండలి అంగీకరించడంలేదు. అన్యుల జోక్యానికి తావిస్తే అంతర్జాతీయరాజకీయదుస్తంత్రాల్లో పడిపోతుందనీ, కాశ్మీర్ రష్యా చీనాల దాపున ఉన్నందువల్ల రష్యా అమెరికాలు ఎవరికటుకు వారు కాశ్మీర్‌భవిష్యత్తు తమకు సుముఖంగా నిర్ణయించబడ్డానికి ఇప్పుడే యత్నిస్తారనీ తెలుస్తూనే ఉంది. అందువల్లనే భారతప్రభుత్వం కాశ్మీర్‌సమస్యకు సంబంధించినంతవరకూ ఈ దుస్తంత్రాలకి లొంగకుండా మహసఖ్యతలో గాంధీజీ ఆదర్శాలకే కట్టుబడిఉన్న కాశ్మీర్‌వాసుల్ని రక్షించడానికే దృఢనిశ్చయానికి వచ్చింది.

భద్రతామండలి, ఉభయుల ఉపన్యాసాలు విని తిరిగి ఎప్పుడు సమావేశమవాలో ఏమిచెయ్యాలో నిర్ణయించకుండా వాయిదా పడింది.

ఈలోగా యుద్ధానికే పరిస్థితుల్లోనూ దిగకూడదని ఉభయప్రభుత్వాలూ ప్రకటిస్తే ఉభయదేశాల్లోనూ ప్రజలమధ్య ఏర్పడుతున్న వైమనస్యం తొలగిపోతుందని భారతప్రభుత్వంచేసిన సూచనకు పాకిస్తాన్ ప్రభుత్వం నిరాకరించింది. కాశ్మీర్ సమస్యాపరిష్కారాన్ని భద్రతామండలి ఆధ్వర్యంక్రింద ఒకపరిష్కర్తకు ఒప్పగించి, వారి నిర్ణయాలకు బద్ధులై ఉండడానికి భారతప్రభుత్వం అంగీకరించేపక్షంలోనే అటువంటి ప్రకటనకు అంగీకరించగలరని పాకిస్తాన్ ప్రభుత్వం సమాధానం చెప్పింది. దీనివల్ల పరిష్కర్తనియామకానికి అంగీకరించనిపక్షంలో యుద్ధానికి దిగడమే తమ లక్ష్యమని పాకిస్తాన్ బెదిరిస్తున్నదన్న మాట.

అమెరికాలో దుష్ప్రచారం :

భారతప్రభుత్వంపట్టుదలగురించి అమెరికాలో దుష్ప్రచారం అధిక మయింది. కాశ్మీర్‌సమస్య విషయంలో పరిష్కర్తనియామకానికి భారతప్రభుత్వంచేత అంగీ

కరించ చెయ్యడానికి ఆంగ్లో - అమెరికన్ వర్గాలవారు అనుచితంగా ప్రవర్తిస్తున్నారు.

నేపాల్ దేశాన్ని స్వాధీనం చేసుకోడానికి భారతప్రభుత్వం యత్నిస్తున్నదని వదంతులు ప్రచారమవుతున్నాయి. నేపాల్‌లో నిరంకుశపరిపాలనకు స్వస్తి చెప్పి ప్రజాప్రాతినిధ్యపరిపాలన స్థాపించి శాంతి నెలకొల్పవలసిందని భారతప్రభుత్వం నేపాల్ మహారాజుకు సలహా ఇచ్చినమాట నిజమే. నేపాల్‌లో నిరంకుశపరిపాలన ఫలితంగా భారతదేశంలో అక్కడక్కడ అశాంతి కలుగుతోంది. నేపాల్‌లో అరెస్టు కాగా మిగిలిన కాంగ్రెస్ నాయకులు భారతదేశంలోకి పారిపోయివచ్చి, కలకత్తా కేంద్రంగా ఉద్యమం ప్రారంభించారు. అందువల్ల భారతప్రభుత్వం ఈవిషయమై నేపాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించవలసివచ్చింది

ఇది సాకుగా తీసుకుని, ప్రజాస్వామ్య సిద్ధాంతాలు తమసొత్తేనని ప్రగల్భాలు పలికే అమెరికా భారతప్రభుత్వంపైన దురాక్రమణవాంఛను ఆరోపిస్తున్నది. కాని వాస్తవమేమిటంటే నేపాల్‌లో కూడా తమ ప్రాబల్యం స్థాపించుకోవాలని అమెరికాయత్నం. టిబెట్‌కి చీనాకమ్యూనిస్టుల భయాన్ని ఆధారంచేసుకొని, అక్కడ తమ రాయబారవర్గాన్ని స్థాపించి, ఆ దేశానికి సహాయం చేసి చీనావారితోనే ప్రజల్ని యుద్ధానికి బలి చెయ్యాలని అమెరికా తంత్రం పన్నుతున్నట్లు ఇదివరకే స్పష్టపడింది. ఇప్పుడు నేపాల్‌లో కూడా అదేవిధంగా ప్రాబల్యం ఆర్జించుకోవాలని అమెరికాయత్నం.

నేపాల్‌కి దక్షిణాన భారతదేశం ద్వారానే అన్యదేశాలతో సంబంధం సాధ్యం. నేపాల్ వర్తకం భారతదేశంలోనే అధికం. నేపాల్ ఎగుమతివస్తువులన్నీ భారతదేశంనుంచే వెళ్లాలి. నేపాల్‌కు ఉత్తరాన, తూర్పుపడమరల్లో టిబెట్ ఉంది. అయితే నేపాల్ సమీపంలో టిబెట్‌లో జననివాసం బొత్తిగా లేదు. టిబెట్ కమ్యూనిస్టులవశమైతే నేపాల్‌లో అమెరికా స్థావరం ఏర్పరుచుకునేపక్షంలో కమ్యూనిస్టులకి పక్కలో బల్లెంవలె ఉండగలదు. రష్యాతో తగవుల్లో భారతదేశం తమ పక్షం వహించదని అమెరికన్లకి తెలిసినవిషయమే. అందువల్ల భారతదేశం అధికారం చలాయిస్తుందని భయపెట్టి, భారతదేశాన్ని తృణీకరించి నేపాల్ ప్రభుత్వాన్ని తమ ప్రాబల్యంలోకి తెచ్చుకోవాలని అమెరికన్ల యత్నం. కాని ఈ తంత్రాల నెన్నడూ భారతదేశం సహించదు. ఇటువంటి కుతంత్రాలవల్ల ఒక్కటే ఫలితం కలుగుతుంది. భారతప్రభుత్వం తటస్థవిధానం దృఢతరం కావచ్చును. కాశ్మీర్ సమస్యసందర్భంలోనే అమెరికావైఖరిపట్ల భారతీయులు అసంతృప్తి చెందారు. ఇప్పుడు అమెరికాపట్ల భారతీయుల స్నేహభావం మరింత క్షీణించగలదు.


ఫార్మోజాకు అమెరికా సహాయం:

దక్షిణకొరియాకు 60 మిలియన్ల డాలర్ల ఆర్థిక సైనిక సహాయా లివ్వడానికి అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టబడిన బిల్లు రిప్రజెంటేటివ్ హౌస్‌లో (మన ప్రజాప్రతినిధుల సభవంటి శాసనసభ) పరాజయం పొందగానే కాంగ్రెస్ సభ్యుల ఒత్తిడికి అమెరికన్ ప్రభుత్వం లొంగవలసివచ్చింది. ఈపర్యాయం ఫార్మోజాలో చియాంగ్ ప్రభుత్వానికి 28 మిలియన్ల డాలర్ల సహాయం ఇవ్వడానికి,దక్షిణ కొరియా ప్రభుత్వానికి 60 మిలియన్ల డాలర్ల సహాయం ఇవ్వడానికి ఒక బిల్లు ప్రవేశపెట్టింది. ఈ ధనాన్ని 1950 జూన్ 30 లోగా, అనగా దాదాపు అయిదు మాసాల్లో వెచ్చించడానికి నిశ్చయించబడింది. ఈబిల్లును చర్చలేకుండా కాంగ్రెస్ ఆమోదించింది.

అంటే చీనాసమస్యవిషయంలో అమెరికన్ ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోవలసివచ్చిందన్నమాట. దీనితోపాటు భద్రతామండలిలోగాని ఇతర ఐక్యరాజ్య సమితిసంస్థల్లోగాని చీనాప్రాతినిధ్య సమస్య చర్చకువచ్చినప్పుడు చియాంగ్ ప్రభుత్వానికే తోడ్పడగలమని అమెరికన్ ప్రభుత్వం ప్రకటించింది.

ఈ సంస్థల్లో చియాంగ్ ప్రభుత్వ ప్రతినిధే ఉండాలని అమెరికా కోరుతుంది. అయితే భద్రతామండలిలో వీటో ప్రయోగించదలచినట్లు ప్రకటించలేదు. కమ్యూనిస్టుప్రభుత్వప్రతినిధిని ప్రవేశపెట్టడానికి అభ్యంతరపెట్టదట. అంటే ఉభయప్రతినిధుల్నీ సమితిలో ఉంచాలని అమెరికాఆలోచన. రష్యా దీని కంగీకరించకపోవచ్చును. మొత్తానికి భద్రతామండలిలోగాని ఇతరఐక్యరాజ్యసమితి వ్యవహారాలలోగాని అమెరికావిధానం రష్యావిధానాన్నే పోలివుంటోంది. ఐక్యరాజ్యసమితికార్యకలాపాలు స్తంభించిపోయే ప్రమాదం కలుగుతోంది

[సూర్యనారాయణ]



గుంటూరుతాలూకా పెదకాకానిలో శ్రీ గంగా భ్రమరాంబామల్లేశ్వరస్వామిక్షేత్రం. ప్రతి ఆదివారమూ వేలకొలది ప్రజలు స్వామివారిని దర్శించి వెడుతూవుంటారు.

ఢిల్లీ లేఖ

((7-వ పేజీ తరువాయి)

అయితే ఇంతవరకూ భారతప్రభుత్వం ఈ సూచనగురించి ఏమీ చెయ్యలేదు. ప్రత్తి సాగు హెచ్చుచేస్తే ఆహారధాన్యపు పంటల గతేమవుతుందో పరిశీలిస్తున్నారట.

నారపరిశ్రమ

దేశవిభజనవల్ల మనదేశంలో నారపరిశ్రమ ప్రమాదంలో పడిపోతోందని జూట్ కమిటీ హెచ్చరించింది. భారత రిపబ్లికులో నారఉత్పత్తి వృద్ధిపరచడానికి ఈ కమిటీ కొన్ని సూచనలు చేసింది.

భారతదేశంలో పెద్దపరిశ్రమల్లో నార పరిశ్రమ ఒకటి అందువల్ల దేశఆర్థికస్థితి చక్కబడ్డానికి ముడినార సమృద్ధిగా ఉత్పత్తిచెయ్యవలసిన అవసరం ఉంది.

కమిటీసూచనల్లో ఈ క్రిందివి కొన్ని ముఖ్యమైనవి :

1. దొరికినంతమటుకు నారవిత్తనం అంతనీ సేకరించాలి.

2. రెండోపంటకాలంలో నారనే పండించాలి.


3. సాగులోలేని భూముల్లో వీలైనంత మటుకు వెంటనే నారసాగులోకి తీసుకురావడానికి యత్నించాలి. వ్యవసాయదార్లకు చౌకగా విత్తనాలు, ఎరువులు అమ్మాలి.

సర్కారువారి మళ్లలో మేలైనరకం విత్తనాలు ఉత్పత్తిచెయ్యడానికి కృషి జరగాలి.

జూట్ కమిటీ 1947 డిసెంబరులో సమావేశమై ఈవిషయమై తీవ్రమైన కృషిచెయ్యడానికి సూచనలు చేసింది. జూట్ కమిటీవారి పరిశోధనాలయం ఢాకాలో (తూర్పు పాకీస్తాన్) ఉన్నందువల్ల వెంటనే భారత యూనియన్‌లో మరొక పరిశోధనాలయాన్ని స్థాపించాలని కమిటీచేసిన సూచనల్లో ముఖ్యమైనది. పరిశోధననిమిత్తం పశ్చిమబెంగాల్ ప్రభుత్వం 50 ఎకరాల మడిని కమిటీ పరిశోధకసంస్థకు ఇవ్వడానికి నిశ్చయించింది.

పశ్చిమబెంగాల్, బీహార్, అస్సాం, ఒరిస్సాలలో నారఉత్పత్తి వృద్ధిపరచడానికిగాను వెంటనే సర్వేజరపాలని కూడా కమిటీ సూచించింది. నారవిత్తనాల ఉత్పత్తివృద్ధికోసం రాష్ట్రప్రభుత్వాల్ని ప్రోత్సహించడానికిగాను ఒకటిన్నరలక్షల రూపాయలు వడ్డీలేకుండా ఋణమివ్వడానికి కమిటీ నిర్ణయించింది. పైనాలుగు రాష్ట్రాల్లోకూడా పరిశోధననిమిత్తం నాలుగుస్టేషన్లు స్థాపించాలని నిర్ణయించింది.

ఈ నివేదిక భారతప్రభుత్వవ్యవసాయ శాఖవారికి అప్పుడే పంపబడింది. కాని పాకీస్తాన్ భారతరిపబ్లిక్‌పైక త్తిగట్టి నారబేళ్లని నిర్బంధించేవరకూ భారతప్రభుత్వం కళ్లు తెరవలేకపోయింది.



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

౪౫

(సంపు. ౪ : పదం. ౧౪౨)

అన్నమాచార్యుల రచన

కాంభోజిరాగం - రూపకతాళం

[పల్లవి]

(౧) , మ గ గ పా । పా , ధ సా స నిధా నిప । , ప ధ సని పా దా । సా , , స స ని ధ
మొ త్త కు రే అ మ్మ లా ల ము ద్దు లా డు వీ

(౨) పధ పమ గ గ పా । పా , ధ రి స ని ధా ధనిపా । , ప ధ సా రి స స ప ధా । సా , స స ని ధ ప ధ
డు మొ త్త కు రే అ మ్మ లా ల ము ద్దు లా డు వీ

(౩) ప ధ ని మ గ గ పా । పధ స రి మ గ రి సా ని ధ ప । , ప ధ స రి గ మ రి గ । సా రి స ని ధ మా ప ధ
డు మొ త్త కు రే అ మ్మ లా ల ము ద్దు లా డు వీ

(౪) ప ధ ,, ,, । , ప ధ స రి మ గ రి ప । మ గ రి స ని ధ ప మ గ సా రి ॥ గ మ (మొత్త)
డు ము ద్దు లా డు వీ డు

(౧) , ప ప ని ధ ధ ప మ గ । ప మ గా సా , రి గా । , గ మ గ సా , రి మ గ । సా , , , ,
ము త్తె ము వ లె ను న్నా డు ము ద్దు లా డు

(౨) , ప ధ స ధ ధ ప పా । ధ ప మ గ సా , రి గా । ,, ,,
ము త్తె ము వ లె ను న్నా డు

(౩) , ప ధ రి స స ధ ధ ప । మ ప ధ స ధ ప మ గా స సా । గ రి
ము త్తె ము వ లె ను న్నా డు

[చరణం]

, ని ధ పా ప । ప ధ మా గ పా ధ । , ధ ప ధా సా , । స ని ధా ధ ని ధ పా మ
చ క్క ని య శో ద త న్ను స లి గ తో మొ త్త రా గా

, ప మ ప ధా స పా , । ని ధ ధ ప మా గ మ గ రి । ప స రి గ స రి । గా సా , ,
(మొ క్క బో యి శా ళ్ళ కు ము ద్దు లా డు

, స స నిధపా ప । ధమగపధా సా, రిగ । , సా రిగ మగగరి సా । సా, ధరిస సనిధా పా ।
వక్క సా న రే ప ల్లె వ న్నె లె ల్ల మా పు దా క

ధ ప ధ మగగరిసా । స నిధ ధనిప మగపధ సా । , ప ప మ పా నిధధపమగ । మగగరిసా
ము క్క న వ య్య గ ది న్న ము ద్దు లా

పరిగమపధ ॥ పధ (మొత్తి)
డు

ఇట్లే క్రిందిచరణములు :

(౨) రువ్వాడి రాళ్ళ దల్లి – రోల దన్ను గట్టెనంటా,
ముువ్వల గంటలతోడి – ముద్దులాడు;
నవ్వాడి జెక్కులనిండ – నమ్మిక బాలునివలె,
మువ్వురలో నెక్కుడైన – ముద్దులాడు. (మొత్తి)

(3) వేల సంఖ్యల సతుల – వెంట బెట్టుకొని రాగా
మూల జన్నుగుడిచీని – ముద్దులాడు;
మేలిమి వెంకటగిరి – మీద నున్నాడిదె వచ్చి
మూలభూతి దానైన – ముద్దులాడు. (మొత్తి)

లఘుటీక : సలగ = చనవు. రెండూ ఒకధాతురూపాలే. చెల్లుధాతువుగూడా ఇట్టిదే. 'ప్రాపు–ఆశ్రయము' అనే శబ్దరత్నాకరార్థము ఊహామాత్రసిద్ధము. చెల్లుబడి యనుట సరియైన యర్థము; వయ్యంగ = కొరునట్లు. కన్నడపు 'పుయ్యు', తెలుగు 'పోయు' దీనికి చేరినవే; వేలసంఖ్యల...రాగా = తుంటరితనానికి శిక్షింతామని మీరిందరిని గుంపు గూర్చుకొని రాగా; మూల భూతి = జగదాదికారణమైనవాడు.

ముద్రితపాఠములు : రువ్వాడి తాళ్ళ; నున్నాడిదె వచ్చె.

సముద్రగర్భంలో

(8-వ పేజీ తరువాయి)

సముద్రంలో పైనీటిమట్టంనుంచి ఎంత లోతుకి పగటివెల్తురు పోగలదో భౌతిక శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు 200 అడుగులకి క్రింద వెలుగు కొరణాలు మాసుకుపోతాయని కనిపెట్టారు. ఇంక ఆక్రింద సంచరించే బృహత్కాయులైన జలచరవిశేషాల శరీరకాంతులు మాత్రమే వెలుగు నిస్తాయి.

ఈసముద్రజంతువుల శరీరాల్లోనే విద్యుచ్ఛక్తివల్ల కాంతి ఉద్భవిస్తుంది, ప్రపంచంలో ఇటువంటి వింతవింత రంగువెలుగుల సమ్మేళనం మరెక్కడా కనిపించదు. మానవుడు తన విజ్ఞానాన్నంతనీ ఉపయోగించి ఇటువంటి కాంతిని సృష్టించలేకపోయాడు. వేడిలేని వెలుగు ఇంతవరకూ మనుష్యులచేత కనిపెట్టబడలేదు. పెద్ద పువ్వుల్ని పోలిన పెద్దపగడాల పురుగుల రంగు వెలుగుల్లో 20 అడుగుల దూరంలో ఉంచికూడా అక్షరాలు చదవవచ్చునని ఒక ఫ్రెంచిశాస్త్రవేత్త చెప్తున్నాడు. ఈ వింత జంతువులు ప్రసరించే రంగులు క్షణక్షణానికీ మారుతుంటాయి. ఆకుపచ్చన, ఊదా, నీలి, గోధుమ, ఎరుపు, నారింజ రంగులు వెదచల్లుతూఉంటాయి. అన్నిటిలోకీ ఆకుపచ్చవెలుగు అధికం.

బాగా లోతులో నీటిబరువు చాలా అధికంగా ఉంటుంది. ప్రశాంతమహాసాగరంలో ఒకచోట ఒక ఘనపుటంగుళం నీరు అయిదుపుట్లు బరువుంది.

సముద్రంలో చాలలోతున 'రతీదేవి పూసెజ్జ' అనే నాచుబంతులు కనిపిస్తాయి. గట్టిగా పట్టుకుంటే పిలపిలా రాలిపోతుంది. కాని సముద్రగర్భంలో అంతలోతున నీటి బరువుకికూడా నిలవగలుగుతోంది. దీనికి కారణం, బంతి అంతటా ఉండే బెజ్జాల్లో ఎక్కువనీరుపై నీటి ఒత్తిడికి బంతి నలిగిపోకుండా కాపాడుతుంది. ఈ బంతిని అకస్మాత్తుగా అంతలోతునించి నీటిపైకి తెచ్చినట్లయితే వెంటనే పేలిపోతుంది. అదే విధంగా భూమిపై చరించే జంతువుని అకస్మాత్తుగా సముద్రంలో లోతుకు పడవేస్తే బిగుసుకుపోయి చిన్నదైపోతుంది.

సముద్రంలో లోతున జీవించే చేపలు నీటిమట్టంపైకి పడిపోకుండా కాపాడుకోవాలి. (భూమిపై జంతువులు నీటిలోకి పడిపోకుండా జాగ్రత్తపడేటట్లు.) నీటిలో ఒక గిరికిపైగా పోతే నీటి ఒత్తిడి తేలికై పోవడంవల్ల గాలి పల్చబడి చేపలతిత్తులు ఉబ్బుతాయి. అట్టే ఉబ్బినట్లయితే తిత్తులు పేలిపోతాయి.

అప్పుడు పేలి ముక్కలైన చేప మెల్లిగా నీటిలో మునుగుతుంది. చచ్చిన ప్రతిప్రాణీ ఇలాగ అడుక్కి నేలమట్టానికి చేరుకోవలసిందే. చచ్చినజంతువుల శరీరాలు నీటిలో ఒక లోతుకంటె మునగవనీ, అవి అక్కడే నీటిమధ్యలో తేలుతుంటాయనీ కొందరు చెప్తారు. కాని అది తప్పని తెలుస్తున్నది.

అక్కడ అట్టడుగున నేలమట్టంలో కుళ్ళిన మాంసాన్ని జలచరాలు భక్షిస్తాయి. నిత్యమూ చంపడమనేది నీటిలో వెలుతురు చొరబడే లోతుకిపైనే జరుగుతుంటుంది.

మనరాష్ట్రం మనదేశం:

(4 పేజీ తరువాయి)

ఖైదీలపైన తుపాకులు కాల్చడం 20 మంది చనిపోవడం పత్రికల్లో ప్రకటించబడింది. పారిపోడానికి దారి లేకుండా నిర్బంధింప బడినవారిని లొంగదియ్యడానికి అంతగా తుపాకులు కాల్చవలసివచ్చిందా అనే సందేహం ప్రజల్లో కలగవచ్చును. రాజమహేంద్రవరంలో పోలీసులు కళావంతుల ఇళ్లపైన దాడిజరిపి అత్యాచారాలు జరిపినట్లు, హైద్రాబాదుసమీపంలోని కృష్ణా గుంటూరుజిల్లా గ్రామాల్లో కొన్నిటిపైన పోలీసులు దాడిచేసి విచక్షణలేకుండా నిరాయుధులైన ప్రజల్ని హింసిస్తున్నట్లు, ఈ రోజుల్లో కమ్యూనిస్టుల్ని వేటాడ్డంతో పోలీసులు మర్యాదస్థులు రౌడీలు, విశ్వసనీయులు మోసగాళ్లు, స్త్రీలు పురుషులు అనే విచక్షత లేకుండా కాంగ్రెస్‌వాదుల్ని కూడా శిక్షిస్తున్నారనీ దేశంలో పుకార్లు వ్యాపిస్తున్నాయి. ఈవార్తలతో ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి, భీతి కలుగుతున్నాయి. కాంగ్రెస్‌ప్రభుత్వంపట్ల విశ్వాసం నశిస్తోంది. అప్రతిహతమైన పోలీసుల సంరక్షణలో ప్రజలకు మనశ్శాంతి ప్రాణవిత్తమానాలను రక్షించుకునే ఆశ నశిస్తున్నట్లు చెప్తున్నారు. కాంగ్రెస్‌అభిమానులకి పరిస్థితి హృదయవిదారకంగా ఉంది. ప్రభుత్వం వెంటనే వెల్లడిని సత్యాసత్యాల్ని బహిరంగపరచకపోతే కాంగ్రెస్ సంస్థకు, దేశానికీ ముప్పువాటిల్లగలదు. ఈ వదంతుల్లో చాలవరకు అసత్యాలనే భావించవచ్చును. కాని నిజంగా దౌర్జన్యాలకు హత్యలకు కారకులైన కమ్యూనిస్టునాయకుల్లో చాల మంది తప్పించుకుంటున్నారనీ, ఏ తప్పిదమూ ఎరగని అమాయకులు హింసలకు లోనాతున్నారనీ కొంతవరకైనా అంగీకరించాలి. కమ్యూనిస్టునాయకుల్ని, అరాచకం రెచ్చగొట్టేవారినీ పట్టుకోడానికి పోలీసులు ప్రజల సహకారం పొందడానికి వారిని బెదిరిస్తే వీసమైనా ప్రయోజనం ఉండదు. కమ్యూనిస్టుల దౌర్జన్యాల నుంచి ప్రజల్ని కాపాడలేకపోతేమానె వారి నింకా హింసలకు లోనుచేస్తే ఫలితం ఎదురుతిరుగుతుంది. ఈ పరిస్థితిని కాంగ్రెస్‌వారే గుర్తించలేకపోతే, దేశం కల్లోలితమైపోతుంది. ఈనాడు దేశంలో కాంగ్రెస్ తప్ప అధికారభారం వహించగల పార్టీ మరొకటి లేదని ప్రజాసామాన్యానికి తెలుసును. అందువల్ల కాంగ్రెస్‌ప్రభుత్వమే ఈ పరిస్థితిని చక్కచెయ్యలేకపోతే దేశానికి అరాచకంనుంచి ముక్తి లేదు.

కొద్దివందల అడుగులకంటె కిందికి వెలుగు పోదు. ఇంక ఆ కిందఅంతా అంధకారమే. అక్కడ చిక్కనినీటిలో చలి అధికం సూక్ష్మక్రిములక్కడ బ్రతకలేవు. అందువల్ల అక్కడికి మునిగిన మాంసం కుళ్లిపోదు. చచ్చినవాని శవాల్ని కుళ్లిపోకుండా ఊరగాయపెట్టినట్లు సముద్రం కాపాడుతుంది. మాంసాన్ని జలచరాలు తాపీగా తింటాయి. సముద్రం ఈరీతిగా పుట్టుకకూ చావుకూ హేతువై విశ్వనియమాల్ని పాటిస్తోంది.

[లాస్ ఏంజల్స్ టైమ్స్ పత్రికనుంచి]

ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి స్వస్తి:

ఆంధ్రరాష్ట్ర నిర్మాణంవిషయంలో భారతప్రభుత్వం ఇప్పుడేమీ చెయ్యదలచ లేదని స్పష్టపడిపోయింది.

జనవరి 26 వ తేదీ లోగా ఆంధ్ర రాష్ట్రాన్ని నిర్మించలేకపోవడానికి గల కారణాలను వివరిస్తూ మద్రాసుప్రభుత్వానికి భారతప్రభుత్వ అంతరంగిక శాఖవారు వ్రాసిన లేఖలవలన ఈవిషయం స్థిరపడిపోయింది. ఇంక ఆంధ్రరాష్ట్రం నిర్మాణం కావాలంటే ముందుబాధ్యతనంతనీ మద్రాసు ప్రభుత్వంపైనా ఆంధ్రరాష్ట్రకాంగ్రెస్ పైనా, ఆంధ్రదేశనాయకులపైనా విడిచి పెట్టారు. అంతేగాని మొదట వాగ్దానమిచ్చినట్లు సమాధానం కుదరని సమస్యల్ని పరిష్కర్తద్వారా పరిష్కరింపచెయ్యవలసిన తన బాధ్యతను భారతప్రభుత్వం నిర్వహించదలచలేదు. భారతప్రభుత్వమూ ముఖ్యంగా కేంద్రకాంగ్రెస్‌నాయకులైన నెహ్రూ, పటేల్ ప్రభృతులు వాగ్దాన భంగం చేశారు. కేంద్రనాయకుల ఈఅన్యాయాన్ని ఆంధ్రదేశం ఎన్నడూ మరవదు.

కాశ్మీర్‌సమస్యవిషయంలో భద్రతామండలివారి వాదం సరిగా ఇల్లాగే ఉందని పండిట్ నెహ్రూ గుర్తించడంలేదు. సమాధానం కుదరని సమస్య ఉత్పన్నమైనప్పుడు పరిష్కారంలో న్యాయం ప్రధానమా? లేక ఎలాగో ఒకలాగు (కుని తగువు తీర్చినట్లు) సమాధానపడ్డం ప్రధానమా? రెండువర్గాల మధ్య వివాదం సంభవించినప్పుడు, సమాధానం కుదరనప్పుడు, బలవంతాన సమాధానం కుదుర్చుకోవాలని చెప్పడంవల్ల ఫలితం ఏమి కలుగుతుందో భారతప్రభుత్వానికి అనుభవమే. బలవంతులు లేక వాద్దకు అధికంగా ఉన్నవారిమాట చెల్లుతుంది కాని రెండో వర్గానికి న్యాయం చేకూరడం కల్ల. ఈ వాదానికే కట్టుబడి భారతప్రభుత్వం కాశ్మీర్ వివాదవిషయంలో పరిష్కర్తనియామకానికి నిరాకరించింది. అదే వాదం ఆంధ్రరాష్ట్రంవిషయంలో వర్తిస్తుంది. ఏదో విధంగా సమాధానం కుదుర్చుకోవాలని ఆంధ్రుల్ని నిర్బంధించడం అరవల హిరణ్యాక్షవరాల్ని తీర్చాలని ఆంధ్రుల్ని నిర్బంధించడమన్నమాట. కాశ్మీర్‌సమస్యవిషయంలో న్యాయం చేకూర్చలేకపోయినందుకు భద్రతామండలినీ, కాశ్మీర్‌కమిషన్‌నీ భారతప్రభుత్వం నిందించింది. ఇప్పుడు ఆంధ్రదేశం ఇవే కారణాలను భారతప్రభుత్వాన్నీ కేంద్రనాయకుల్నీ నిందిస్తోంది. ఈ వైఖరివల్ల అసలే కమ్యూనిస్టుల అరాచకంతోనూ, ఆహారక్షేమంతోనూ నలిగిపోతున్న ఆంధ్రదేశంలో కాంగ్రెస్‌పట్ల, కాంగ్రెసు నాయకులపట్ల తీవ్ర అసంతృప్తి అనాదరం అవిశ్వాసం ప్రబలమౌతున్నాయని భారత ప్రభుత్వం గుర్తించవలసి ఉంటుంది.

—— [సీతారాం]

గ్రంథ సమీక్ష

కథాసాహిత్యం

ఈమధ్య కథలపుస్తకాలు చాలా అచ్చవుతున్నాయి. కథలపత్రికలూ ఇతరపత్రికలూ కూడా కథలు ప్రచురిస్తున్న కారణంగా కథకులకు మంచి ప్రోత్సాహం లభిస్తోంది.

కాని కథలప్రచారం వృద్ధికావడంతోపాటు కథావస్తువులో కొత్తనీరు వస్తే బాగుండేది. అదే అట్టే కనిపించడంలేదు. అయితే విషాదప్రణయం' లేకపోతే సంసారంలో కష్టసుఖాల, ఇవే కథలన్నిటికీ వృత్తాలు. ఇంక కొత్తగా వచ్చిన నీరల్లా సెక్సుపత్రికలద్వారా గుప్తప్రణయసన్నివేశాలు.

గృహవిషయికమైన కథల్లో కొత్త లేకపోయినా సాంసారికసమస్యల్ని గ్రహించి చిత్రించడం కొంత విస్తృతిచెందిందనవచ్చును. మనస్తత్వాల్ని సున్నితంగా చిత్రించే యత్నం కనిపిస్తోంది. కాని అవి పేలవంగా దిగజారిపోతున్నాయి.

ఇంక గుప్తప్రణయకథల్లో చిత్రించబడే సంఘటనలు, మనస్తత్వాలు వాస్తవజీవనానికి భిన్నంగా ఉంటున్నాయి. మనస్సుకి తోచినట్లు కల్లాలు విడిల్చి కథ కట్టినట్లయితే ఇలాగే ఉంటుంది. ఈ కథలు స్వప్నప్రపంచంలో విహరించే యువతీయువకులికి అటువంటి అనుభవాలకోసం వేటాడే కోరికల్ని రెచ్చగొడతాయేకాని, ప్రణయజీవనాన్ని సరిదిద్దుకోడానికీ, అపోహల్ని తొలగించడానికీ సహాయపడలేవని తట్టుతుంది. ఇంతవరకూ అభిసారిక, రేరాణి వగైరా పత్రికలు నిరర్థకంగానే ఉన్నాయని చెప్పాలి. చేసే హానిమాట వేరే చెప్పనవసరంలేదు.

ఈమధ్య వచ్చిన కథల పుస్తకాల్లో కొన్ని :

1. పండుగబహుమానము - రచయిత్రి శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి. ఆంధ్ర బుక్‌హౌస్, సుల్తాన్‌బజార్, హైదరాబాద్. వెల రు 2.

ఇందులో పధ్నాలుగు కథలున్నాయి. వీనిలో చాలావరకు గృహసమస్యలకు సంబంధించినవే. సంసారంలో సమస్యల్నీ, మనస్తత్వాల్నీ రచయిత్రి నిరాడంబరంగా సున్నితంగా చిత్రించగలదు. ఇందుకు 'పండుగచీర' అనే కథ తార్కాణం. ఈ పుస్తకంలోని కథల్లో చాలవరకు ఇదివరలో పత్రికల్లో ప్రచురించబడినవే.

2. మాయింట్లో - రచయిత శ్రీ ధరణికోట శ్రీనివాసులు, సాధనసమితి, హైదరాబాద్ వెల 8 అణాలు.

వీరి కథలు ముఖ్యంగా మునిమాణిక్యం నరసింహారావుగారి కాంతంకథల్ని అనుసరించి ఉన్నాయి. ఆమాట వారే ఒక కథలో చెప్పకున్నారు. వీరి కనకం కూడా వారి కాంతంకిందే తరిఫీదయినవారే. ఇందులో కథలన్నీ గృహజీవితమే కథావస్తువుగా కలిగినవి. పరకీయనాయికలకోసం పరితపించకుండా స్వకీయనాయికపైనే (పిల్లల రణగొణధ్వనిమధ్యలో) ప్రణయం ఒలికించి, పరిపూర్ణతృప్తి ఆనందాలు (కథల్లో) అనుభవంచవచ్చునని నిరూపించడానికి మునిమాణిక్యంగారివలెనే వీరూ కథలు వ్రాసుకున్నారు. వీరి కథలు కూడా ఇదివరలో పత్రికల్లో ప్రచురితమైనాయి.

3. కథాతోరణము—కొటూరి వెంకటేశ్వరరావు, వేమూరి ఆంజనేయశర్మగార్ల సంకలనం. ప్రచురణ : ఆంధ్రరాష్ట్ర హిందీ ప్రచారసంఘం, విజయవాడ. వెల రు 2.

ఈ తోరణంలో అడివిబాపిరాజు, విశ్వనాథసత్యనారాయణ, సురవరం ప్రతాపరెడ్డి, మునిమాణిక్యం, వేలూరిశివరామశాస్త్రి మొదలైన పదిమంది ప్రసిద్ధకథకుల కథలున్నాయి.

ఈ కథల్లో చాలవరకు గతించిన దశాబ్దాల్లో పత్రికల్లోనే కాక కథాసంపుటాల్లో కూడా ప్రచురించబడినాయి.

4. రాగిణి – రచయిత : శ్రీ రావూరి భరద్వాజ. ప్రకాశకులు : కళావాణి, తెనాలి. వెల రు 1.

ఈపుస్తకంలో చలంగారు పరిచయం వ్రాస్తూ, కథకుడు చలంసాంప్రదాయాన్ని అనుసరిస్తున్నారన్నారు. చలంలోపాల్ని సరిదిద్ది భరద్వాజగారు వ్రాశారని చలంగారన్నారు. కాని కొత్తలోపాలేవైనా చొరబడ్డాయో లేదో, నిష్కర్షకి బహుమానంలాక్కునే చలంగారుకూడా పరిశీలించలేదు.

ఈనాడు మన సమాజంలో ఉట్టపడుగున చీకట్లో మణిగిపోయి కొన ఊపిరితో మూలుగుతూ అడపాదడపా ఆర్తనాదం చేస్తున్న శృంగారాన్ని వెలుగులోకి తీసుకువచ్చి, స్త్రీపురుషుల పరస్పరసంబద్ధ బాంధవ్యాలకి సరైనపురి బిగించాలని భరద్వాజగారివంటి కథకుల లక్ష్యం కావచ్చును. కాని కథలు చూస్తే భావనాచిత్రణలో కాని మనస్తత్వాల నిరూపణలో కాని నరాలపురి మాత్రమే కనిపిస్తుంది. ప్రస్తుతసమాజంలో కోరి ఎలాటి శృంగారసన్నివేశాలు కల్పించుకోవచ్చునో వెతుకులాడుతున్నట్లు కనిపిస్తుంది. సహజవాతావరణాన్ని సృష్టించాలనే యత్నం కనపడుతుంది కాని వాస్తవస్థితిగతులకి అది బహుదూరం. ఈమాదిరి సన్నివేశాలు సృష్టించుకోడానికీ ఊహాప్రపంచంలో విహరించడానికీ మాత్రమే ఈ కథలు అమాయకులైన యువతీయువకులికి ఉపయోగపడతాయి. ఈకథల్ని శృంగారగాథలుగా స్వీకరించడానికైనా వీలుపడ్డంలేదు. ప్రణయజీవనంలోని మాధుర్యమైనా కనిపించదు. శృంగారప్రధానమైన ఈ కథల్లో విచిత్రమేమిటంటే తరచు బీభత్సంవచ్చి శృంగారాన్ని పీకి పిసికేస్తుంది

మానవత్వానికి గర్వకారణాలైన మానసికోన్నతి, హృదయవైశాల్యం, వ్యక్తిత్వం, శీలి, గంభీరసౌందర్యం మొదలైనవానికి ఈ సెక్సుకథల్లో తావు దొరకడంలేదు. ప్రణయజీవనంలో వాస్తవంగా వీనికిగల ప్రాధాన్యాన్ని కథకులు గుర్తించినట్లు కానరాదు.

ఇవి మనోవైజ్ఞానిక కథలని సంపుటి శీర్షికక్రింద వ్రాయబడింది. ఈ కథల్లోని మనస్తత్వపరిశీలనాప్రావీణ్యం ఎంతవరకుందో శాస్త్రప్రవీణులకైనా గోచరిస్తుందో లేదో.

లక్ష్యంపైన దృష్టిపెట్టుకుని, స్త్రీపురుషుల భావనాగతినీ వారి ప్రవర్తనీ పరిశీలించడానికి కొంచెం వాస్తవలోకంలోకి దిగి, కథకులు కృషిచేస్తే ప్రయోజనం ఉంటుంది. ఇందుకు కథకులు సమర్థులని వీరి కథల్లోని చురుకే చెబుతోంది.

ఆంధ్రపత్రిక

సంవత్సరాది సంచిక

రచయితలకు విన్నపం

ఎప్పటివలెనే, రానున్న క్రొత్త సంవత్సరమునకు (వికృతి) ఆంధ్రపత్రిక ఉగాదిసంచికను ప్రకటింప నిశ్చయించినాము

దేశమంతా ఇప్పుడు సరికొత్తశకములో నడుచుచున్నందున, అందుకు అనుగుణముగా ఈసారి సంచికను తక్కిన అన్ని విషయము లతోపాటు నవభారతమునకు సంబంధించిన సారస్వత, సాంఘిక, రాజకీయ, పారిశ్రామికాది సకలమైన నూతనవిషయములతోను సరి క్రొత్తగా సంకలితముచేసి నూతన విజ్ఞానప్రబోధకముగా ప్రకటింప దలచినాము

రచయితలు, చిత్రకారులు అందరు తమ రచనలను పంపి యథాప్రకారముగా మాకు తోడ్పడవలెనని కోరుచున్నాము

7, తంబుచెట్టివీధి
మద్రాసు 1.

సంపాదకుడు,
ఆంధ్రపత్రిక.

Regd. No. M 4479

ఆంధ్రపత్రిక

శ్రీ 'వికృతి' నామ సంవత్సర

పంచాంగం

ఈ సంవత్సరం పంచాంగంలో చాంద్రమాన, దృక్సిద్ధాంతాల ప్రకారం వేర్వేరుగా గుణింపబడిన రెండు పద్ధతుల తిథి నక్షత్రాదులు వేర్వేరుగా చూపబడినవి.

ఆంధ్రపత్రిక పంచాంగాలు

ఆంధ్రుల ఆదరాభిమానాలను చూరగొన్నవి

బ్రహ్మశ్రీ శ్రీమత్పుడపర్తి కృష్ణమూర్తిశాస్త్రిగారిచే గుణించబడిన

కొత్త పంచాంగాలు సిద్ధమైనవి

ప్రతి 1 కి. 0-4-0, 100 కి. 16-0-0,

1000 కి. 150-0-0 రైల్వేఖర్చులు ప్రత్యేకం.

వివరాలకు వ్రాయండి:

మేనేజరు, ఆంధ్రపత్రిక మద్రాసు 1.

Edited, Printed & Published by S Sambhu Prasad, at the Andhra Patrika Press 7 Thambu Chetty St., Madras.